
# కోకిలా ఎంత పని చేసింది!

## మూలం: తమిళం

జయకాంతన్



అనువాదం: ఏండీ సుందరేశన్

# KOKILA ENTAPANI CHESINDI!

(Jayakanthan's Tamil Novella)

తెనుగు అనువాదం© Kurinji Publications, California, USA

First Edition, 2021

© D. Jayakanthan/Andy Sundaresan

***Cover Design:***
Amirr Butt

The translator acknowledges with thanks the permission to use the author's photographs/contents from the ***Jayakanthan Pavazavizah Malar,*** published by Nakkeeran Gopal.

**Printed at:**

The Copy World
1375 University Avenue
Berkeley, CA 94702
Telephone:1-800-690-2679 (Toll Free)

# కోకిలా ఎంత పని చేసింది!

# నలుగురు నడిచేదే బాట!

## మూలం: తమిళం

## అనువాదం: ఏండీ సుందరేశన్

**Published By**

**Kurinji Publications**
**10944 San Pablo Avenue # 610**
**El Cerrito, CA 94530, USA**
**Email:**
**rangan.sundaresan@gmail.com**

# ఇందులో . . .

అనువాదకుని ముందుమాట

జయకాంతన్ ముందుమాట

కోకిలా ఎంత పని చేసింది!

నలుగురు నడిచేదే బాట!

# అనువాదకుని ముందుమాట

సుమారు ఇరవై సంవత్సరాలముందు - 2005 లో - ఈ రెండు పొడుగాటి కథలని - ***కోకిల ఎంత పని చేసింది!, నలుగురు నడిచేదే బాట!*** - నేను ఇంగ్లీషులో అనువదించి, మరికొన్ని కథలతో కలిపి, **Jayakanthan - on Marriage** అనే శీర్షిక కింద రెండు సంపుటాలుగా ప్రచురించాను.[1] దాంపత్యమే అన్ని కథల ఇతివృత్తం, ఘటనలన్నీ వైవాహిక జీవితంలో పరిచయమైనవే. మూడు ముళ్ళ బంధంలోని సమస్యలు, ప్రశ్నలు, ఒడిదుడుకులు, కలహాలు గురించి జయకాంతన్ రాసారు.

ఇప్పుడు అతని కొమార్తె దీపలక్ష్మి అనుమతితో మీకు వీటిని తెలుగులో అందిస్తున్నాను.

********

---


[1] **Till Death Do Us Part (2005), Made in Heaven (2006)**

# అనువాదకుని సందేశం

- ఇందులోని రెండు కథలు తెలుగులో అనువదించడానికి నాకు అనుమతి ఇచ్చిన జయకాంతన్ కొమార్తె దీపలక్ష్మికి నా కృతజ్ఞతలు;
- ఇందులోని జయకాంతన్ ఫోటోలు ***నక్కీరన్*** సంస్థ అనుమతితో ప్రచురిస్తున్నాం.
- నా తెలుగు అనువాదాలు ఓపికతో చదివి, సూచనలు చేసిన అక్కయ్య శెల్వి విశ్వనాథన్ కి నా ధన్యవాదాలు.

********

# దాంపత్యం గురించి . . .



*"ఒక మగవాడు పెళ్ళిచేసుకున్నప్పుడు అది తనకోసమే అని భావిస్తాడు; ఒక ఆడదికూడా అదే మనోభావంతో పెళ్ళికి ఒప్పుకుంటుంది. తన మేలు మాత్రమే చూసుకొని చేసే ఏ పనైనా దానివలన ఆఖరికి అసంతృప్తి కలుగుతుంది. వివాహంకి అసలు తాత్పర్యం ఏమిటి? ఒక స్త్రీ లేక పురుషుడు తనకోసం జీవించడం ఆపి ఇంకొక జీవికోసం  జీవితం ప్రారంభించడం అన్న మాట. మానవ జీవితంలో పెళ్ళి ఒక ప్రధానమైన ఘట్టం; ఒకరికోసం ఇంకొకరు త్యాగం చెయ్యడంవలనే సమాజం ప్రకాశవంతంగా వర్ధిల్లుతుంది, ధగధగలాడుతుంది. అంతేకాని 'నాకోసం, నా సుఖంకోసం' అనే వంకలో ఒక ఆడ మగ సంపర్కం ఏర్పడితే, ఆ ప్రత్యేక వ్యక్తి జీవితం, ఆ సమాజం రెండూ వ్యర్ధమౌతాయి."*

**జయకాంతన్,**

**"నిజం నిప్పులాగ" కధలో**

# జయకాంతస్ ముందుమాట[1]

ఈ రెండు కధల మధ్య ఒక సంవత్సరం ఎడబాటు ఉంది. ఆ ఎడబాటులో నేను చాలా కధలు రాసివున్నాను. ఆ కధలన్నిటికీ దూరంగా నిలబడి ఒక విమర్శకుడనే అవగాహనలో గమనిస్తే మన సమాజంలో వ్యక్తిగత జీవితంలోని విరుద్ధాలు నాకు కనిపిస్తున్నాయి: సమాజంని గౌరవించి దాని విలువలకి లోబడడం లేక సమాజంని తోసి పారేయడం అనే రెండు అంశాలు మనం గుర్తుచేసుకోవాలి.

ఆ రెండు అంశాలకీ, వాటి ధోరణికీ ఈ రెండు కధలు ఉదాహరణంగా చెప్పవచ్చు.

మొదటి కధ ***కోకిల ఎంత పని చేసింది!*** సామాజిక విలువలు ఆమోదించడం వలన వ్యక్తిగత జీవితంలోని ఘర్షణలు, వాటివలన చుట్టరికాల్లో కలిగే ప్రశ్నలని ప్రతిఫలించుతోంది.

ఇది రాసినప్పుడు కొందరు వ్యక్తులలో - ముఖ్యంగా అనంతరామన్, కోకిల పాత్రల మధ్య లేచిన - ఒక అసాధారణ ప్రశ్నని వివరించానని నేను భావించాను. ఎంతమంది పాఠకులకి ఇది బోధపడుతుందని నాకు అనుమానం కలిగింది.

కాని ఈ కధ వెలుబడిన తరువాత - ఈ రోజుల్లో మనతో కలిసి జీవించే మధ్యతర కుటుంబాలలోని చదువుకున్న దంపతులందరూ ఈ కధని ఏదో ఒక కోణంలో లేక ఈ కధలో ఏదో ఒకటి హేతువుగా చూసి తమ్మల్ని సరిపోల్చుకున్నారని తెలియగానే నాకు ఆశ్చర్యం కలిగింది.

చాలా కాలం తరువాత నా పాఠకులు ఏకగ్రీవంగా శ్లాఘించిన కధ రాసానని నేను సంతోషించాను.

---

[1] రచయత నవంబరు 13, 1967 లో రాసిన వ్యాసం సారాంశం

అడపాతడపా దాంపత్యంలో గొడవలు, ఆలుకలు సహజమనే ఎరుక ప్రజలందరికీ ఉంది. అందువలనే దాంపత్యంలో, సరిపడని, పరస్పర విరుద్ధమైన ఎన్నో ప్రశ్నలని పరిష్కరించడానికి వీలుకాకపోయినా, ఒక విధమైన సహనభావంతో, కుటుంబం కూలిపోకుండా, భార్యాభర్తల జీవితం సాగుతోంది.

ఈ పరస్పర విరుద్ధాలు సహజం అనే నిజాన్ని ఈ కథలు నిరాకరించలేదు; ఏ ఉద్యమంలోనూ అవి చోటుచేసుకుంటాయి. సామాజిక విలువలు, నీతులు, వదిలేసిన మగవాడికి (నేను ఇక్కడ మగవాళ్ళ గురించే మాటాడుతున్నాను; మన సమాజంలో మగువలకి వాటా లేదు!) ఇల్లాలు Better Half గా కనిపించదు; కుటుంబం ఒక చెఱసాల ఐపోతుంది.

చెఱసాల తలుపులు నిత్యమూ బంధించబడి ఉంటాయి; వాటిని బహిరంగపరచాలి; లేకపోతే చెఱసాల ధ్వంసమైపోతుంది.

సామాజిక విలువలకీ, కుటుంబ నిలువలకీ మధ్య నెగ్గే భేదాలు చాలా హానికరమైనవి.

మనలో చాలామంది బుద్ధిజీవులు (Intellectuals) సమత్వం, స్వతంత్రత, స్త్రీల హక్కులు అనే ప్రశ్నలన్నీ సామాజిక ధర్మంకోసమే అని వాదాడుతున్నారని నా ఉద్దేశం; సామాజిక దృక్పథంలో ఇవన్నీ నాగరిక సిద్ధంతాలని ఏకాభిప్రాయం ఉన్నా వాటిని కుటుంబం అనే పవిత్రమైన కోవిలకి కళంకం, అపకీర్తి కలిగించే దుష్ట శక్తులని వాళ్లు చులకన చేస్తున్నారు.

అందువలనే ఏ ప్రశ్న తీసుకున్నా మన ప్రజల సామాజిక దృక్పథం, కుటుంబ దృక్పథం, వేరువేరుగా కనిపిస్తాయి.

వ్యక్తిగతంగా సమాజంపై బాధ్యత లేకపోవడం వలనే ఇది జరుగుతోంది. ఉదారగుణం, సమత్వ అంగీకారం - ఈ రెండూ - సామాజిక పరిమితిలోనే నొక్కిచెప్పడం మనం చూస్తున్నాం.

తనకి బాధ్యత ఉన్న కుటుంబంలోనూ, తన అంతరంగ జీవితంలోనూ ఆ మగవాడు మూర్ఖంగా పొరబాటు చేస్తున్నాడు.

నేనిక్కడ చెప్తున్న 'అతను' ఒక సామాన్య పామరుడు కాదు. ఏదో పురాతన భూస్వామ్యయుగ నియమాల్లో పెరిగి, నానిన ప్రతినిధి కాదు. అతను విజ్ఞాన శాస్త్రం చదివినవాడు; అంర్జాతీయ ప్రశ్నలని ఆరసించి వ్యాసాలు రాసే పండితుడు; తనకి ఇంగ్లీషు సినిమాలు మాత్రం చూసే ప్రతిష్ట ఉందని గర్వంగా చెప్పుకొనే విద్యావంతుడు.

అతనికి లోకజ్ఞానం ఉంది; సంప్రదాయం నిరాకరించే త్రాణ ఉంది; నాస్తికం గురించి ప్రసంగం చెయ్యగల తీవ్రవాదిగానూ కనిపిస్తున్నాడు.

మనదేశంలో సోషలిజ రాజ్యం స్థాపించాలని, కార్మికుల కలహాల ద్వారా విజ్ఞానరీతిలో అందరి జీవితాలు మారాలని కూతలు పెట్టే సామాజిక విప్లవకారుడుగానూ అతను కనిపిస్తున్నాడు.

సమాజంలో అనేక పురుషులు ఇలాంటివారే. అందువలనే ఊ దేశంలో సామాజిక, రాజకీయ, ఆర్థిక మార్పులు, కార్మికుల విప్లవాలు ఎన్ని జరిగినా, విదేశీయ సాంస్కృతిక ఆచారాలు చొరబడినా, వాటి మూలం మన కుటుంబ వాతావరణం మారినా, అవన్నీ బూటకంగా, సారహీనంగా ఉన్నాయి. వ్యక్తిగత జీవితంలో, అంతర్గతంగా ఏ మార్పూ కనిపించదు.

ఇది చూసి కొంతమంది గర్వపడుతున్నారు కూడా.

ఇన్ని మార్పుల తరువాత వారి కుటుంబాలు, వారి ప్రజ్ఞ, వారి వైఖరి మారలేదంటే అందులో ఏముంది గర్వకారణం?

వాళ్ళు అంటున్నారు: 'కుటుంబంకని ఒక పవిత్రత ఉంది; ఈ అబద్ధాలకి దాన్ని అధీనం చెయ్యకూడదు.' అదీ వాళ్ళ నమ్మకం.

అలాగే కానీ. కాని ఏది కుటుంబంకి పవిత్రమైనదో అదే గౌరవార్హత సమాజంకీ ఉంది. కుటుంబంకి పునాదిగావున్నఉన్న వైఖరిని వీళ్ళెందుకు సమాజంకి అనుమతించరు, శ్లాఘించరు?

ఒక గుంపు సామాజిక విలువలు ఎగతాళికి పాలైన తరువాత "అవి నా కుటుంబంలో వర్ధిల్లుతున్నాయి!" అని ఎవరికైనా తృప్తి కలిగిందంటే అది మతిభ్రమ, పెద్ద పొరబాటు అని గ్రహించాలి.

సామాజిక విలువలు ఎగతాళికి పాలైన తరువాత అవి వ్యక్తిగతంగా, కుటుంబంలో స్థిరంగా కొనసాగకూడదని, అది అసాధ్యమని నేను అనడం లేదు. ఆ విలువలు ఏతావాతా ఆ కుటుంబంతో ఒక సాన్నిహిత్యంగా, లేక సమాజంలో మాయలమారిగా కనిపించాలనే కోరిక ఆ వ్యక్తులకి లేకపోతే అందుకు ఒక మంచి కారణం ఉంటుంది. అంతేకాదు. ఆ సమాజం విధించిన నియమాలని ఆ వ్యక్తులు నిర్దయతో ఎదురించుతారు, తిరస్కరిస్తారు. 'ఇది నా ఉరుకీ, సమాజంకీ సరే, కాని నా ఇంటికి వద్దు!' అని ద్వంద్వ భావనలు వాళ్ళు ఆచరించరు. ఆఖరికి పత్రికలలో, పౌర సభల్లో వాటిగురించి గొంతుచించుకొని శ్లాఘిస్తూ వ్యక్తిగత జీవితంలో రెండు శతాబ్దాలుగా వెనకబడిన కొన్ని విలువలని వల్లించితూ విలపించరు.

అందువలనే సమాజం అనే పెద్ద శ్రేణిలో ఘనుడుగా, ఆధునిక సందేశాలు ప్రకటించే అనంతరామన్ తన సొంత జీవితంలో భార్య అనే స్త్రీ ఒక మగవాడికి తోడుగా మెలుగుతోందనే నాగరిగతని కొనియాడలేక బాధపడుతున్నాడు.

నలుగురు ఏమంటారో అని భయపడుతూ ఆ నలుగురిమధ్య తన ప్రతిష్టని కాపాడుకోవాలని తహతహలాడుతూ ఆత్మగౌరవం పోగొట్టుకున్న మనిషి అనంతరామన్.

తన భార్య ఒక స్వతంత్రజీవి; ఆమె గణ్యతని తను గౌరవించనంతవరకూ తనకి శాంతి లేదని అతను గుర్తుచేసుకోవాలి. లేకపోతే తనకీ ద్వంద్వ జీవితం తప్పదు.

ఈ ద్వంద్వ వైఖరి వ్యక్తులకి మాత్రం కాదు, అది సమాజంకీ ఉంది. ఈ ప్రపంచం, శాసనాలు అనుమతించిన ఒక చిన్న విషయంలోనూ ఈ సమాజం, సంకుచిత భావంతో, సిగ్గులేక నవ్వుతూ చూస్తూ ఉంటుంది. వ్యక్తిగత స్వాతంత్ర్యం, శాంతి - వీటిని భంగపరచడానికే - సమాజంలో ఒక విభాగం ఉంది. మురికిపోయిన ఆ విభాగమే గతకాలంలో మరిగిపోయిన అనాగరిక ఆచారాలను పునరుద్ధరణ చేసి, వాటిని కొనియాడుతుంది.

అదే ***నలుగురు నడిచేందే బాట!*** కథ. సమాజంలో జరిగే ఘర్షణలకీ, పగ, ద్వేషాలకీ, ఆ నలుగురే కారణం.

ఇతరుల వ్యవహారాల్లో అది నిరంకుశంగా చొరబడుతుంది; నిరంకుశంగా నేరం మోపుతుంది; నిరంకుశంగా తీర్పుచెప్పి, శిక్షించుతుంది.

ఇవన్నీ చెయ్యడానికి, అధికారం చెలాయించడానికి అది పెద్దపెద్ద మాటలు వాడుతుంది.

సినిమా తారల వ్యక్తిగత జీవితాలగురించి బూతుగా రాసే పత్రికలు చలనచిత్ర పరిశ్రమ సవరణకి తాము కృషి చేస్తున్నటు గౌరవంగా ప్రచారోద్యమం జరుపుతున్నారే, అలాగ!

"అయ్యయ్యో, ఈ దేశం సంస్కృతి పాడైపోతుందే!" అని వాపోయే ఇంకొక గుంపు తానికి తోడుగా పనిచేస్తోంది.

"జాగ్రత్త, మన దేశమూ ఇతరదేశాలలాగ అవినీతికి పాలైపోతుంది!" అని - అన్ని దేశాల సద్గుణాలనీ ఆరసించి అజీగించుకున్నట్టు - వీళ్ళు తీరా ఈ ప్రపంచాన్నే దూషించడమూ జరుగుతోంది.

ఏ దేశంలోనూ, ఎటుంటి నాగరకతలోనూ, నీతిప్రవర్తన పునాదిగా ఉండడం అసాధ్యం అని గ్రహించడానికే ఒక సన్మార్గం కావాలి, మంచి హృదయం కావాలి. ప్రతీ దేశంలోనూ, వేరే వేరే కాలంలోనూ, ఒక నీతిబద్ధత ఉండాలని వాదిస్తే సరే, కాని ఒకటికొకటి విరుద్ధంగా కనిపించే నీతులని "ఇవన్నీ అవినీతులు!" అని బలంగా నిరాకరించడం దుర్బుద్ధి అని మనం గుర్తుచేసుకోవాలి.

అంత ఎందుకు? మన దేశంలోనూ, అన్ని తరాల్లోనూ, ఒకే విధమైన నీతిబద్ధత ఉండలేదే? ఈ తరంలోని నీతులకి విరుద్ధంగా ఉన్నవన్నీ అవనీతులని నిర్ణయించి తీరా ఈ దేశమంతా అధమం అని ఆరోపించడంలో వివేకం ఉందా?

ఒకానొకప్పుడు తమిళ దేశంలో ఆ నాటి సామాజిక అవసరాల దృష్ట్యా, ఈ మగవారి చపలంకని, సమాజం ఆమోదించిన వ్యభిచారగృహాలు ఉండేవి.

ఆ తరువాత అది అనాగరికమని ఆ పద్ధతిని న్యాయతగా మార్చడమూ జరిగింది. దీనికి అర్థం ఈ చట్టం రావడానికి ముందు తమిళ సమాజం దుర్నీతిలో పడిపోయిందనా? కాదు.

అలాగే పెళ్ళి మీద పెళ్ళి చేసుకోవడం - ఆడువారికీ, మగవారికీ - అనుమతించిన సమాజాలు భారతదేశంలో ఉన్నాయి; విడాకులకి నియమాలు ఉండేవి, ఇప్పుడూ ఉన్నాయి.

నీతిబద్ధతలు, సామాజిక న్యాయాలు స్థిరంకావు; అవీ మారుతూనే ఉంటాయి.

వ్యక్తిగత జీవితంలోనూ, సర్దుబాటులోనూ స్వతంత్రత కావాలని ఈ నియమాలు సమాజంలో అమలుకి వచ్చాయి; వాటిని మార్చడమూ సాగుతూనే ఉంది.

వ్యక్తిగత జీవితంలో నిరంకుశ ప్రవర్తనవలన సమాజంకి హాని రాకూడదనే కొన్ని హద్దులు విధించడమైంది. వ్యక్తిగత స్వేచ్ఛని పూర్తిగా నిర్మూలం చెయ్యాలనే కుట్ర అందులో లేదని మనం గుర్తించాలి.

స్త్రీల స్వతంత్రత గురించి మనదేశంలో ఘనమైన పెద్దలు అన్ని తరాల్లోనూ వక్కాణించి ఉన్నారు.

ఒకానొకప్పుడు తమిళులు స్త్రీలని తమ స్వాధీనత (possession) గా భావించారు; దానితోబాటు స్త్రీ ప్రవర్తనకి పవిత్రత అనే గౌరవం ఇచ్చారు; ఆ తరువాత, స్త్రీ మగవాడికి లొంగి, స్వాభిమానం త్యజించడానికి సిద్ధమైనప్పుడు ఆమెను దైవాంశంగా శ్లాఘించారు; మనం చదువుకున్న పురాణాల్లో ఇటువంటి పతివ్రతలు చాలామంది ఉన్నారు.

స్త్రీకీ తనలాగే మానవత్వంతో వాంఛలు, అభిలాషలు, లోటులు ఉన్నాయనే ఒక నూతన అవగాహన మనలో ఇంతవరకూ లేవనేలేదనే నిజాన్ని మనం గ్రహించకపోతే మానవాభ్యుదయంకి దారి లేదు.

నీతి ప్రవర్తనకి Sex గీటురాయి కాదు అని కూడా మనం గుర్తు చేసుకోవాలి.

ఆ పాత సంకెళ్ళు తోసిపారేయకుండా, అందుకు బదులు మనం కొత్త పూతలు పూసుకుంటే ఏం లాభం?

ఈ రోజుల్లో స్త్రీలకి విద్య, వృత్తి రంగాల్లో అభివృద్ధికి చాలా అవకాశాలున్నాయి. కాని ఇంతకు ముందు ఆమె తన భర్తకి బానిసగా ఉన్నప్పుడు అనుభవించిన అవస్థలకన్నా స్త్రీ ఇప్పుడు ఇంకా ఘోరంగా బాధపడడం నేను చూస్తున్నాను.

నిరంకుశ ప్రభువు భర్తగా ఉండాలనే నియమం లేదు. అలా ఉన్నా అదేం అంత ఘోరం కాదు. ఆ సర్వాధికారంకి ప్రేమ. పోషణ, అనే పరిమాణాలున్నాయి.

ఆ బానిసత్వంని పవిత్రతగా భావించి ఆ స్త్రీని దైవసమానంగా పూజించడమూ జరిగింది. ఇవాళ ఆ దైవాంశం పోయింది, శిలలు లేవు. ఆ ఘోరం మాత్రం సమాజంలో ప్రేమానురాగాలు, భద్రత లేని పదురుబోతుగా, అపనిందగా సాగుతూనే ఉంది.

అలాంటి పరిస్థితిలో సుగుణ వంటి Crusaders స్త్రీ వాద ఉద్యమంకీ, రాబోయే యుగాల్లో స్త్రీల అభపృద్ధికీ, దూతలని గుర్తించాలి.

ఆధునిక యుగంలో సరాసరి ఒక తమిళ స్త్రీ చదువుకొని, ఉద్యోగం చేస్తూ, మగవాడికి సమానంగా మెలగడం మనం చూస్తున్నాం. కాని ఆమెని సమాజం ఒక ఖైదీలాగే భావించుతోంది. రెండు పక్కలా అజ్ఞానం, అపనింద అనే దడి కట్టి ఆ మార్గంలోనే సూటిగా నడవడానికే ఆమెకి అనుమతి ఇవ్వబడింది. రవంత స్వేఛ్ఛతో తోవ తప్పితే ముళ్ళు గుచ్చుతాయి అనే భయం నిత్యమూ ఆమెను ఆవరించుకొని ఉంది. ముళ్ళు గుచ్చుకుంటే దాన్ని తీసిపారేయాలని ఈ సమాజంకి, ఆమె కుటుంబంలో ఎవరికీ అనిపించదు. దానికి బదులు ఆమెనే నిందించుతారు; ఆమెను నిప్పులో తగలబెట్టితే అందరికీ తృప్తి!

ఇన్ని కష్టాలు అనుభవించి, మరేం దారిలేక, ఆత్మనిగ్రహంతో రోజులు గడిపే ఆ స్త్రీలు మగవాడి Better Half గా మెలగడం ఎలా సాధ్యం?

ఆ స్త్రీలు తమ భావనలు, స్వతంత్రత చితుకగొట్టబడినట్టే ఆత్మాభిమానంకూడా కృశించిపోయి, సామాన్య భావనలకి త్వరగా బలి అవుతారు. తెంచుకోలేని ఒక బంధం మూలంగా ఒక మగవాడిని పట్టుకొని కాలమంతా అతని గొంతు కోస్తారు.

దీనిగురించి ఎటువంటి ప్రజ్ఞ, తెలివి లేనివారు భాగ్యవంతులనే చెప్పాలి. అజ్ఞానం బ్రహ్మానందం! (Ignorance is bliss!) - అనే సామెత మనకి తెలుసుకదా? వ్యక్తిగత జీవితంలో సుఖం, స్వతంత్రత లేనివారు సామాజిక బలం, ధోరణి గ్రహించినవారు, దాన్ని నిరాకరించి మార్చడానికి సిద్ధమవుతారు.

అటువంటి వ్యక్తి ముత్తువేలర్. ఆహ్లాదం అనే మాటకొస్తే యౌవనం కంటే స్వతంత్రత ఘనమైనదని అతనికి తెలుసు; అతని దృక్పథంలో అతని చావు ఒక నిద్ర.

***కోకిల ఎంత పని చేసింది!, నలుగురు నడిచేదే బాట!*** - ఈ రెండు కథలూ నేను ఒకే మనోభావంతో రాసాను. కాని మొదటి కథని నా పాఠకులలో అధిక పక్షంవారు పొగడారు, రెండవది చాలామందికి మింగుడు కాలేదు. ఈ భేదం మూలం తమిళుల ద్వివిధ భావనలు నేను గ్రహించగలిగాను.

అలాగే కానీ! మన సమాజం వర్ధిల్లుతోంది అనే నమ్మకం నాకెప్పుడూ ఉంది.

********

# కోకిలా ఎంత పని చేసింది!

# కోకిలా ఎంతపని చేసింది!

అనంతరామన్ ఆ ఆంగ్ల పత్రికలో పనిచేసే ఇరవై ఉపసంపాదకులలో ఒకడు. కాని ఇతర ఉపసంపాదకులకు లేని గౌరవం, కీర్తి, ప్రత్యేకాధికారం అతనికి ఉన్నాయి. దానికి కారణం ప్రతీ శనివారం ఆ ఆంగ్ల వారపత్రిక అనుబంధంలో 'ప్రపంచంలో నా ఎఱుక' అనే ప్రధానమైన శీర్షికలో అతను వ్రాసే వ్యాసం. అందులో సాహిత్యం, రాజకీయం, కళ, ఆర్థిక శాస్త్రం, దేశ నాయకుల గురించి ఎది కావాలన్నా అతను తన పదునైన కలంతో తన సొంత అవగాహన ప్రకటించుతాడు. అతని అభిప్రాయాల గురించి తరచుగా చర్చలు, దూషణలు లేచినప్పటికీ కొందరు పాఠకులకి అతని రచనలంటే వెర్రి ఆవేశం పట్టుకుంది.

ఏకకాలంలో డెల్లి, బొంబాయి, మద్రాసు - ఈ మూడు నగరాలనుంచి లక్షలు, లక్షలుగా ప్రజలకి వినియోగమయ్యే ఆ ఆంగ్లపత్రిక యజమానులు అనంతరామన్ అభిప్రాయాలకున్న మక్కువని గ్రహించడమే కాకుండా ఆతని ఊహలమీద పాఠకులకున్న దృఢవిశ్వాసం గుర్తు చేసుకొని, ఇతరులని ఆకర్షించే అతని రచనా విశేషంని శ్లాఘించి, అతనికి, ఆ శీర్షికలో, విశేషాధికారం, నిరాటంకమైన స్వతంత్రత, అందజేసారు.

ఇప్పుడు అనంతరామన్ తన ఎయిర్ కండిషన్ ఆఫీసులో తను వ్రాసిన ఒక వ్యాసంని తీర్చి దిద్దే పనిలో లీనమై ఉన్నాడు.

ఇందియాలో, దేశ నాయకులు, ప్రముఖులు, పాత్రికేయులు, అందరూ కలిసి సమష్టిగా, దేశీయ సమైక్యం గురించి ఆవేశంగా చర్చించిన రోజులవి. వాళ్ళందరితో తను మౌలికంగా ఏకీభవించినా ఏ విషయమైనా దాన్ని గూఢంగా బుద్ధికుశలతతో ఆరసించే అనంతరామన్ ఒక నూతన దిశలో నిలబడి, ఒక కొత్త కోణంలో, బాధ్యతతో, దేశీయ సమైక్యం గురించి తన అభిప్రాయం ఆ వ్యాసంలో రాసాడు.

రెండు మూడు సార్లు దాన్ని చదివి, దిద్దిన తరువాత - ఎదైనా సరే, పాఠకులకి తన రచన స్పష్టంగా, దీర్ఘంగా ఉండాలని అనంతరామన్ అందరికంటే ప్రత్యేక శ్రద్ధ తీసుకొనే మనిషి; అందుకని అతను ఎన్ని రాత్రులైనా నిద్రపోకుండా ఆఫీసులో

ఒంటరిగా పని చేస్తాడు - ఇప్పుడు చదివి చూసినప్పుడు  ఆ వ్యాసం అతనికి అద్భుతంగా తోచింది. అదేమో ఒక సామాన్య రచయితకి కలిగే తృప్తి కాదు; ఒక కళాకారుడుకి ఉచితంగా కలిగే అనుభవం.

వ్యాసంలో ప్రత్యేకంగా ఒక పేరా అతను మళ్ళీ చదివాడు.

'సమైక్యం అనేది మొట్టమొదట ప్రతీ వ్యక్తిలోనూ రూపొందాలి. అసలు సామాజిక ఎరుక లేని వ్యక్తులు, సామాజిక బాధ్యతలని ప్రోత్సాహించని వ్యక్తులు, ఇంటిలో ఒక మనిషిగా, వీధిలో ఇంకొక మనిషిగా, తనకు తానే వేరొక మనిషిగా, నానావిధాలుగా మెలుగుతున్న వ్యక్తుల గుంపులున్న మన దేశంలో సమైక్యం అనేది ఒక చాలా అసాధ్యమైన పని!' అని తను పురిగొల్పిన ప్రశ్నని తనలోనే అనంతరామన్ శ్లాఘించుకున్నాడు.

'అవును! దానికి నేనే సాక్షి!' అనే చింతతో ఆ గౌరవమైన కుర్చీలో కూర్చున్నప్పుడు - నాలుగు పక్కలా 'హోరు'మని ఆ అచ్చు యంత్రాలు ఘోషించుతున్న సమయంలో, Foreman తలుపు తెరచుకొని చిత్తు ముద్రణ కాగితాలతో లోపల ప్రవేశించినప్పుడు - ఆ సందలో - తన శీర్షికా రాతలని ముద్రణ చేసి లక్షలు లక్షలుగా పాఠకులకి అందించే ఆ అచ్చు యంత్రాలు, తన్ను చూసి ఏక ధ్వనిలో గర్జిస్తున్నట్టు,  ఎగతాళి చేస్తున్నట్టు - అతనికనిపించింది.

ఫోర్ మెన్ మేజామీద దిద్దబడివున్న కాగితాలు తీసుకొని నిష్క్రమించాడు. ఆ యంత్రాల ధ్వని ఇంకొక సారి గభీమని మ్రోగింది; అలాగే అనంతరామన్ మనసులో నిద్రపోతున్న  ఏదో భావన గభీమని అదిరిపడి భూగర్భంలోని జలప్రవాహంలో పాకుతున్న విద్యుచ్ఛక్తిలాగ అతన్ని తాకింది.

' . . . ఇంటిలో ఒక మనిషిగా, వీధిలో ఇంకొక మనిషిగా, తనకు తానే వేరొక మనిషిగా, నానావిధాలుగా . . . " అని తను రాసిన వార్తలలో తనే చిక్కుకొని అతను బాధపడ్డాడు.

ఈ బాహ్యప్రంపంచంలో, సమాజంలో తనకున్న కీర్తిని అతని ఒక క్షణం గుర్తుచేసుకున్నాడు. కాని, అంతర్గతంగా, సొంత జీవితంలో, తను పడుతున్న బాధలు; అపరిపక్వమైన తన అసూయ మూలంగా తను అనుభవించే చిత్రవధ; ఇతరుల కనికరంకి, హేళనకి వశమైపోయి, చిన్నబుచ్చుకొని తను గడిపే రోజులు -

ఇవన్నీ అతన్ని అదరగొట్టాయి; తన బాహ్య ప్రపంచం, అంతర్గత జీవితాలమధ్య ఉన్న అగాధం చూసి అతనికే తన ప్రతిభ, యోగ్యతలమీద కటువైన ఆయాసం కలిగింది. "What a hypocrite I am!" అని తనలో తనే అనంతరామన్ గొణుక్కున్నాడు.

అతను ఆలోచించేది ఆంగ్లభాషలేనే; అతనికి మరేం ప్రాంతీయ భాష పరిశుద్ధంగా తెలియదు. మలినమైన శైలిలో తమిళం, మలయాళం, మాట్లాడడం అతను కొంచెం అలవాటు చేసుకున్నాడు, అంతే.

' . . . ఇంటిలో ఒక మనిషిగా, వీధిలో ఇంకొక మనిషిగా, తనకు తానే వేరొక మనిషిగా . . . " తనే ఒక బహుముఖ వ్యక్తిగా మెలుగుతున్నట్టు అతనికనిపించింది.

అవాళ ఉదయం - ప్రతీ రోజు ఉదయమో, సాయంకాలమో తన దాంపత్య జీవితంలో జరుగుతున్న - అలాగ సంభవించిన తరువాత 'అయ్యయ్యో, ఎందుకిలా అయింది?' అని సిగ్గు పడి, 'ఇలాగ మరెప్పుడూ జరగనివ్వకూడదు!' అని తాపత్రయం పడినా తన బలహీనత వలన అలాగే మళ్ళీ మళ్ళీ జరుగుతున్న - ఆ ఘటన అతనికి జ్ఞాపకం వచ్చింది. దానితోబాటు అతని భార్య కోకిలతో దెబ్బలాడినప్పుడు ప్రయోగించిన మాటలు . . . (ఎందుకు, కోకిల మాత్రం ఉత్తికే ఊరుకుందా?) ఆ వార్తా పరివర్తనలు ఇప్పుడు అతని చెవుల్లో మ్రోగాయి. 'ఛీ, ఛీ, ఏమైనా సరే, నేను దాన్ని అటువంటి పరిస్థితికి లాగివుండకూడదు!' అని అనంతరామన్ వాపోయాడు.

"మనిద్దరం మనకిష్టంలేని జీవితం గడుపుతున్నాం, అవునా?" అని ఆ ఉదయం తన భార్యని అడిగిన ప్రశ్న అతను గుర్తుచేసుకున్నాడు. తన మనస్సుకి తెలిసిన ఆ సంగతి తను నోరు తెరిచి అడిగినది పొరబాటేమో అని అతనికి ఇప్పుడు అనిపించింది. సిగరెట్ కాల్చుకుంటూ, తను కూర్చున్న కుర్చీని వెనక్కి నెట్టి, పక్కన ఉన్న కిటికీని కప్పుకున్న ఆకుపచ్చ తెరని విడదీసి, అనంతరామన్ కిందకి తొంగిచూసాడు.

అక్కడ కనిపించినది వీధి కాదు. ఆ బ్రహ్మాండ భవనం నీడలో కూలీలు, కార్మికులు, రిక్షాలు, బండీలు నడిపేవారు గుమిగూడి ఉన్నారు. అనంతరామన్

చూసిన సమయం ఒక కూలీల కుటుంబంలో - అదేం దాంపత్య పోరాటమో! - ఒక మగవాడు తన చెయితో ఒక స్త్రీ జుత్తుని పిడికిట బిగఁబట్టుకొని, ఇంకొక చెయితో ఆమె మూపుని బాదడం ఒక మూగ సినిమాలోని దృశ్యంలాగ అతనికి కనిపించింది.

ఒక భర్త తన భార్యని అటువంటి ప్రశ్న అడగవచ్చా? పొరబాటున అలాగ అడిగితే, మామూలుగా, దానికి ఒక భార్య మారుమాట ఎలా ఉంటుందని అనంతరామన్ రకరకాల జవాబులు తన మనసులో ఊహించుకున్నాడు. కాని అతని కల్పనికి విరుద్ధంగా కోకిల నెమ్మదిగా ఇచ్చిన జవాబు అతని గుండెని తునకలు తునకలుగా కోసింది.

'అదేం సామాన్య భార్య కాదే?' అనే విరక్తిభావంతో అనంతరామన్ తనలో తనే నవ్వుకున్నాడు.

"మనిద్దరం మనకిష్టంలేని జీవితం గడుపుతున్నాం, అవునా?"

"అవును, దానికేం?" - అంతవరకూ ఆమె మొహంలో నిరంతరంగా కనిపించిన ఆ నకిలీ నవ్వు మాయమైపోయింది. ఏ మగవాడూ తన భార్య మొహంలో, కళ్ళలో, పెదిమల వంపులో, చూసి సహించలేని జుగుప్స, క్రోధం, విరక్తి, అందులో చోటుచేసుకున్నాయి; ఆమె జీర్ణకోశంనుంచి లేచిన జ్వాలని ఆమె కళ్ళు ఉమ్మాయి; అగ్నిని శ్వాసించుతున్నట్టు ముక్కుపుటాలు వికారంగా ముడుచుకున్నాయి; ఆ పెదవుల వంపులో గభీమని ఘోరమైన పళ్ళు మొలచినట్టు ఆమె నోటి ఆకారం పూర్తిగా మారిపోయింది.

ఆ అనుభవం జ్ఞాపకం రాగానే దాన్ని భరించలేక అనంతరామన్ తల దులుపుకున్నాడు. ఆ మొహం చూడగానే ఆమె మనస్సుని నొప్పించాలని అతను పూనుకున్నాడు. పళ్ళు కొరుకుతూ ఇంగ్లీషులో అరిచాడు: "You hate me . . .I too hate you!"

కోకిలా కనుబొమలు పైకెత్తి, నవ్వుతూ, "అది మనకి తెలుసుగా?" అని అంది.

"నువ్వు ఒక రోజు వాడితో పారిపోతావ్!"

"ఛీ, ఛీ, ఇవేం మాటలు! . . . మీకు సిగ్గు లేదూ?"

"సిగ్గు! నీకు సిగ్గంటే ఏమిటో తెలుసా?"

కోకిల కూడా ఇంగ్లీషులో బొబ్బలు పెట్టింది: "ఈ తలనొప్పి ఇవాళ పొద్దున్నే మీరు మొదలుబెట్టారన్న మాట!"

అనంతరామన్ ఆమెను నిదానంగా చూసాడు; ఆ మౌనంలో అతని మనసులో కొంచెం శాంతం చోటుచేసుకుంది; కాని ఒక మూర్ఖమైన ఆలోచనకూడా లేచింది. ఇవాళ కోకిల మానసికావస్థకి ఒక పరిష్కారం నిశ్చయించాడు. ఆమెకి మెల్లగా చెప్పాడు: "ఇక వాడి నీడకూడా నేను ఈ ఇంట్లో చూడకూడదు, తెలిసిందా?" తన ఆజ్ఞ విన్న తరువాత ఆమె మొహంలో ఏమైనా చలనం కనిపిస్తోందా అని తీవ్రంగా చూసాడు.

కోకిల నిదానంగా ఒక నిట్టూర్పు వదిలి అతన్ని చూస్తూ నిలబడింది.

ఆమె ముందు తన భావనలు మరింత ఉత్తేజకరంగా పెరగడంతో అతను ఇంకా మాటాడాడు. "నాకు తెలుసు - వాడిని చూడగానే నీకు జీవితంలో ఎప్పుడూ లభించని సంతోషం కలుగుతుంది." ఇప్పుడు అతని పెదవులు వెగటుగా చీల్చుకున్నాయి. "వాడిని చూడగానే నువ్వు నిన్ను మైమరచిపోతావ్! నేనది భరించలేను . . . నీకు వాడే ముఖ్యమంటే వాడిని వేరే ఎక్కడైనా కలుసుకో . . . నా కళ్ళముందు ఈ ఇంట్లో ఆ నాటకం జరగనివ్వను . . . "

భావం, ప్రజ్ఞ, నీరసమైపోయిన అవస్థలో కనిపించే భర్తని చూసి కోకిల నవ్వింది. అది నిశ్శబ్దమైన నవ్వు! ఆమె పెదవులు స్వల్పంగా ఒక పక్కగా తునుచుకున్నాయి. 'నువ్వొక అల్పమైన జంతువు!' అనే ఎగతాళి ఆమె చూపులో కనిపించింది.

'ఏమిటి చేస్తున్నాం?' అనే అవగాహన లేకుండా అనంతరామన్ తన చెయిలోని పాత్రని నేలమీద గట్టిగా బాదాడు. అది తనమీద పడకుండా తప్పుకున్న తరువాత కోకిల 'సరే . . . ఆ తరువాత?' అని అతన్ని అడుగుతున్నట్టు కొంటెగా చూసింది. ఆమె వొంగి ఆ పాత్రని చెయిలో తీసుకుంటుందని అనంతరామన్ ఎదురుచూసాడు. కాని కోకిల భర్త ఉన్మాదం చూసి ఆనందించే విధంగా తన రెండు చేతులూ ఛాతీమీద నిలబెట్టుకొని, గోడమీద ఆనుకొని " చాలా బాగుంది!" అని అంది.

అనంతరామన్ అలాగే స్తంభించిపోయాడు. తన ప్రవర్తన వలన తనకే అవమానం అని గ్రహించినట్టు "ఛీ!" అని నెత్తిని రుద్దుకుంటూ తన గదికి వెళ్ళి అక్కడున్న మంచంమీద కూర్చున్నాడు.

'భర్త వెర్రితనం తగ్గుతోంది,' అని కోకిలా తనలో తనే గొణుక్కుంది. కాని ఇప్పుడు ఆమె కోపం ఎక్కువైంది. "పొద్దున్నే ఈ గొడవ! ఎవరైనా చూస్తే నవ్వుతారు! పది సంవత్సరాలుగా ఇదే రోత! చాలు, చాలు . . . దీనికి ఒక ముగింపు రావాలి! "

"నేనంటున్నది అదే . . . దీనికి ఒక ముగింపు రావాలి!" అని అనంతరామన్ కూడా బొబ్బరించాడు.

"ఎందుకీ అరుపు?. . . మన సంగతి అందరికి తెలియాలి కాబోలు! . . . నేనేం చెయ్యాలి, అది చెప్పండి . . . "

"ఇక వాడు ఇక్కడకి రాకూడదు! . . . మన జీవితం బాగుండాలంటే నువ్వు వాడిని చూడనేకూడదు!"

"సరే" - కాని దానితో కోకిల ఆగలేదు, ఇంకా మాటాడింది: "సరే, అతను ఇక్కడికి రారు, నేనూ అతన్ని కలుసుకోను . . . అందువలన మన జీవితం గొప్పగా వర్ధిల్లుతుందని అంటున్నారా? నేను నా మనసులో అతన్నే కొనియాడుతున్నానని మీకనిపించితే నేను ఎక్కడకి వెళ్ళి మొరబెట్టుకుంటాను?"

ఆమె తన్ను ఎంత క్రూరంగా ఎగతాళి చేస్తోందని అనంతరామన్ గ్రహించాడు; తనూ ఆమెను క్రూరంగా వెక్కిరించాలని పూనుకున్నాడు.

"నా మనసులో ఏముందో అది అలాగే ఉండనీ . . . కాని మీకది సాధ్యం కాదే? మీరిద్దరూ మనం కావ్యంలో చదివే గొప్ప - Platonic Lovers - ప్రియులు కదా?"

అతని ఎగతాళి విని కాదు; భర్త తన్ను ఎంత నీచంగా అంచనా వేస్తున్నాడని గ్రహించగానే కోకిలా పట్టరాని కోపంతో విషం కక్కినట్టు కాండ్రుతూ నేల ఉమ్మింది.

తన మొహంమీద సూటిగా ఉమియకుండా కోకిల నేలమీద ఓకరించిందని అనంతరామన్ అపార్థం చేసుకున్నాడు. మండిపడి, ఆ వచ్చిన కోపంలో ఏం చేస్తున్నానని తెలియక, తన చేతి గోళ్ళని ఆమె చుబుకంలో గట్టిగా అదుముకొని, మూర్ఖంగా ఆమె మొహాన్ని తన చెయితో పైకెత్తి, సూటిగా ఉమ్మాడు.

ఆ మరుక్షణం తన ప్రవర్తనకి అతను సిగ్గుపడిపోయాడు. ఇక అక్కడ నిలబడడానికి త్రాణ లేక, ఆ ప్రశాంతికి భయపడి, అక్కడనుంచి నిష్క్రమించి, తన గదికి వెళ్ళి కోకిలకి కనిపించకుండా ఒక మూల నిలబడ్డాడు. అతనికి ఏడవాలనిపించింది; తన మీదనే ద్వేషం, ఏవగింపు చోటు చేసుకున్నాయి; శరీరం పూర్తిగా కంపించిపోయింది. 'ఛీ!, ఛీ!, అది నన్ను ఎంత నీచుడుగా చేసేసింది!' అని వాపోయాడు. "ఇక నేను నా జీవితమంతా ఇలాగే గడపాలా?' అనే ఊహలో భ్రమించిపోయాడు. 'ఎందుకు మన దేశంలో వివాహం అనేది కాళ్ళని కట్టివేసిన బంధంగా, ముడివిప్పలేని కట్టుగా ఐపోయింది? ఆఖరికి అది మానవుల భావనలని దండించే ఘోర మృగంగా మారిపోయిందే?' అని ఆలోచించాడు.

కొంచెం సేపు తరువాత అనంతరామన్ తిరిగి చూసినప్పుడు కోకిల బాత్ రూములో మొహం కడుగుకుంటూ కనిపించింది.

మగవాడుగా తనకేర్పడిన అహంకారం లాగే స్త్రీలకి సహజమైన ఆమె దౌర్బల్యం గురించి ఆలోచించగానే అతనికి జాలి కలిగింది. కొన్ని నిమిషాలకు ముందు తను చేసిన పని తన హోదాకి, తన అంతస్థుకి ఎంత విరుద్ధం అని ఆలోచించగానే -తనే ఒక కూలీగా, పామరుడుగా, అనాగరికుడుగా ఉంటే తన వ్యక్తిగత జీవితం ఎంత ఆరోగ్యవంతంగా ఉంటుందని అతను ఊహించాడు. తనకు నచ్చని - కోకిల స్నేహితుడో, బంధువో, ఎవడైనా సరే - వాడిని 'You dog, get out!' అని బైటికి తరిమేసి, తను తాళికట్టిన భర్త అనే అధికారంతో కోకిల జుత్తుని గుంజుకొని, రెండు తన్నులు తన్ని, ఒక మూల దాన్ని తోసిపారేసి, తను సరైన పని చేసిన భావనతో నెమ్మదిగా ఉండవచ్చు; దానివలన తనకి ఎటువంటి సిగ్గూ, అవమానం రాదని నమ్మవచ్చు; అక్కడ అగత్యంలేని తగవులు, తర్కాలు, హక్కులగురించి ప్రశ్నలు, నలుగురు ఏమంటారో అనే కలత - ఇవేం అడ్డు రావు. గప్చుప్! ఏమైనా మాటాడితే, ఇంకా రెండు తన్నులు.

'నాలాంటి వేషాలమారి కళ్ళకి ఇది అనాగరికంగా కనిపించినా అందులో, నా దాంపత్యంలోని అబద్ధం లేదు. అవును, ఆ కూలీవాడు నాకంటే - లోపలా, బయటా - ఆరోగ్యవంతుడు!' అని అతనికి అనిపించింది.

'బాహటంగా నేనొక మనిషి; అంతర్గతంగా వేరే మనిషి. ఆఫీసులో ఒక మనిషి; నా పాఠకులకి వేరే మనిషి. నా జీవితంలో ఒక మనిషి. నా భార్యకి వేరే మనిషి. నాకే నేనొక వేరే మనిషి! అవును, ఆశ్చర్యం, నాలో ఎన్ని విభాగాలు చోటుచేసుకున్నాయో!'

ఆఫీసు అబ్బాయి చెయిలో ఒక ఉత్తరంతో గది తలుపు తెరచుకొని లోపలికి వచ్చినప్పుడు ఆ అచ్చు యంత్రాల ధ్వని పెరగడంతో అనంతరామన్ తను కూర్చున్న తీరుని మార్చకుండా, కుర్చీని మేజా దగ్గఱకి జరుపుతూ మళ్ళీ పాత్రికేయుడుగా మారాడు.

ఆఫీసు అబ్బాయి అందించిన ఉత్తరం చదివి చూసాడు.

ఆ ఉత్తరం ఆ పత్రిక యజమానులదగ్గఱనుంచి వచ్చింది. అందులో, ఆ మరుదినం ఉదయం పదకొండు గంటలకి అతను Board of Directors ని కలుసుకోవాలని ఆజ్ఞ కనిపించింది. అనంతరామన్ని డెల్లీ ఆఫీసుకి బదిలీ చేస్తున్నామని, తమ నిర్ణయం గురించి అతనితో విమర్శించాలని వాళ్లు అందులో తెలియజేసారు; ఆ వచ్చే వారమే అతను డెల్లీ వెళ్ళి డ్యూటిలో చేరాలని అందులో ఉంది.

ఆ ఆజ్ఞని చూడగానే అనంతరామన్ చిరచిరలాడాడు. కాని దాన్ని అంగీకరించడమా లేక నిరాకరించడమా అని నిర్ణయం చేసేముందు తను కోకిలతో దానిగురించి తప్పకుండా సంప్రదించాలని పూనుకున్నాడు.

'ఉద్యోగంకి ఆధారం ఉదరనిమిత్తం' అని అనవచ్చా? ఒక మగవాడు ఉద్యోగం బదిలీ అయి ఎక్కడకి వెళ్ళినా సరే, అందుకు తగినట్టుగా అతను తన జీవిత పరిస్థితిని సర్దుకొని, తనవెనుక వస్తున్న విధేయమైన భార్య అనే అబలతో తనకున్న షరతులు పాటించాలనే ఆచారం ఉందే? కొందరికి ఆ బంధం కాళ్ళకి కట్టు; మరికొందరికి అవి సంకెళ్ళు; ఇంకా మరికొందరికి కంఠంలో నిర్బంధం.

ఒక వేళ ఉద్యోగం డెల్లీకి బదిలీ అవుతే? . . . ఇప్పుడు నిలకడలేని దాంపత్య పరిస్థితికి ఆధారమైన 'వాడి'ని మానుకోడానికి ఇదొక మంచి తరుణం అని కోకిల గ్రహించవచ్చు. డెల్లీలోనూ కోకిలకి పరిచయమైనవాళ్లు, బంధువులు ఉన్నారు. ఒకప్పుడు కోకిలా అదే ఆఫీసులో Receptionist గా పని చేసినప్పుడు ఆమెతో

మెలగినవారు అక్కడ ఉన్నారే? ఆ ఆకర్షణల వలన కోకిలా సంతోషంతో సమ్మతించవచ్చు . . .

'కోకిలకి సంతోషమా?'

అనంతరామన్ తన పదిసంవత్సరాల దాంపత్యంలో ఇంతవరకు అనుభవించని, 'ఇక ప్రాప్తం లేదు!" అని విసుగ్గున్న సంగతి అది.

'నా జీవితంలో కోకిలకి నేను అన్నీ సమకూర్చాను. కాని నావలన తనకి ఎటువంటి సౌఖ్యమూ లేదని కోకిల, పదే పదే - సమయం వచ్చినప్పుడల్లా - క్రూరంగా, నా హృదయాన్ని లోతుగా చీల్చి - నాకు తెలియజేస్తోంది . . . ఆ సమయాల్లో నేను కూడా ఆవేశపడి నాకూ ఆమెపై పగ, ద్వేషం అని బొబ్బలు పెట్టినా, నాకు మనసులో కోకిల అంటే ఎంత మర్యాద, అభిమానం ఉన్నాయి! ఇదే నా బలహీనత . . . నా తృప్తికోసం చెప్పాలంటే . . . నా ప్రేమ హృదయం, నాకు కోకిలపై ఉన్న నిష్కళంకమైన భావనలు ఆమెకు బోధపడినట్టు నేను తెలియజేయకపోతున్నాను . . . నేను తనకి భారమని కోకిల అల్లాడుతోంది! . . . ' అని తన పది సంవత్సరాల శోచనీయమైన దాంపత్యం గురించి అనంతరామన్ కసురుకున్నాడు.

'ఢిల్లీకి బదిలీ అవబోయే ఈ జీవితం కోకిల ఇష్టపడుతుందేమో?' అనే ఆలోచన రాగానే తన్ను సంప్రదించకుండా పత్రిక అధికారులు ఈ బదిలీ ఉత్తరం పంపించారని తన క్షోభని బైటకి తెలియజేయకుండా దీనిగురించి కోకిలతో మాటాడాలని అతను నిర్ణయించాడు.

ఆ ఉత్తరం మడతబెట్టి తన brief case లో ఉంచుకుంటూ , ఆ ఉదయం కోకిల తనకి చెప్పిన ఖచ్చితమైన వాక్యాలు అనంతరామన్ ఇప్పుడు మళ్ళీ గుర్తుచేసుకున్నాడు. పొద్దున్నే జరిగిన ఆ గడబిడ తరువాత వారిద్దరూ రెండు మూడు గదులున్న అదే కొంపలో ఎలాగో ఒకరినొకరు మానుకొని ఉన్నారు; ఆఖరికి ఆఫీసుకి బయలుదేరే ముందు అనంతరామన్ తనంతట తనే వంటగదికి వెళ్ళి, తలుపుని ఆనుకుంటూ, మౌనంగా కోకిల వెనక నిలబడ్డాడు. ఒక నిమిషం వరకూ అతను అక్కడ నిలబడి ఉన్నాడని కోకిల గ్రహించలేదు. అతను ఒకసారి దగ్గిన తరువాతకూడా లెక్కచెయ్యక ఆమె వంటలో పూనుకుంది. కొన్ని

నిమిషాలముందు తను ఆమెపై కాండ్రి ఉమ్మినందుకు లోలోపల సిగ్గుపడుతూ అతను తల వంచి నిలబడ్డాడు.

"కోకిలా!" అని అతను పిలచిన ధ్వని అతని లోతట్టులోనే అణగిపోయింది. ఆమె ఏడుస్తూ తన్ను చూస్తుందనే భావనతో అనంతరామన్ తలెత్తి చూసాడు. ఆమె ఏమీ జరగనట్టు, మామూలైన ముఖభావంతో అతన్ని చూసింది.

"I am sorry!"

ఆమె నవ్వింది; నిశ్శబ్దమైన నవ్వు. పెదిమలు స్వల్పంగా ఒక పక్క కదిలాయి; ఆ నవ్వులో పూర్తిగా విరక్తి కనిపించింది.

"నేనివాళ చాలా నీఛంగా నడచుకున్నాను . . . ."

"మీకు మరేం తెలుసు?"

అతను గట్టిగా పళ్ళు కొరికాడు. ఆమెను తేటిపార చూసాడు. "అవును, నేను నీఛమైనవాడినే . . . నీకు ఇష్టం లేదంటే నన్ను వదిలి వెళ్ళి పో! . . . I say, you can get out!"

కోకిలా కిందపెదవిని కొరుకుతూ, తల వంచి, చురుగ్గా ఆలోచించింది. తటాలున తలెత్తి, లేతగా నవ్వి, నిలకడగా మాటాడింది. "సరే, నేను వెళ్తాను. ఇది వినడానికే నేను చాలా రోజులు కాచుకొనివున్నాను. ఇప్పుడైనా మీకు ఆ ధైర్యం వచ్చిందే, మంచిది . . . " అని చెప్పి 'ఇక మరేం మాటాడవద్దు!' అని నిర్ణయించినట్టు అక్కడనుంచి నిష్క్రమించింది. ఆమె నిర్ణయంని అంగీకరించడమా లేక నిరాకరించడమా అని తెలియక అనంతరామన్ కొన్ని నిమిషాలు తికమకలాడాడు; ఆ తరువాత మొండిగా కేకలు పెట్టాడు.

"పో! . . . పోవే! . . . వద్దని ఎవరు నీ కాళ్ళని కట్టిబెట్టారు? . . . పో! . . . పో! నాకేం నష్టం లేదు . . . రేపే, నేనింకో పెళ్ళి చేసుకుంటాను . . . ఈ పది సంవత్సరాలూ . . . (ఇప్పుడు అతనికి ఏడవాలనిపిస్తోంది) . . . ఈ పది సంవత్సరాల నష్టాలు నేను భర్తీచేసుకోగలను . . . నీకే నష్టం . . . You are the loser! . . . ." అతని పెదిమలు, దేహం వొణికాయి.

కోకిల ఒక చెయిలో గిన్నెతో బాత్ రూమ్ గడప దాటి ఒక అడుగు పెట్టింది.

"మిస్టర్ అనంతరామన్, వినండి . . . "

'ఇది కోకిల కాదు' అని అతనికనిపించింది.

ఆమె నిదానంగా ఎవరో అన్యదేశస్థుడుతో మాటాడుతున్న ధోరణిలో చెప్పింది: "మీరు ఏ లోకంలో ఉన్నారని గుర్తుందా? మీరన్నట్టు నేనూ మాటాడగలను, తెలుసా? కావాలంటే, అదీ చెయ్యగలను . . . నన్ను కన్నవాళ్ళు కూడదన్నప్పుడు వాళ్ళని లెక్క చెయ్యక - మీకోసం - ఆ బంధం వదులుకున్నాను. ఇప్పుడు మీతో నా బంధం తెంచుకోడం ఏం పెద్ద పని కాదు!" అని అతని బుగ్గలో వాయించినట్టు స్పష్టంగా పలికిన తరువాత తనలో ఏదో ములుగుతూ ఆమె బాత్ రూమ్ లో మాయమైంది.

అనంతరామన్ అలాగే స్తంబించిపోయాడు.

ఇటువంటి జగడాలు తరచుగా జరిగేవే, కాని ఈసారి ఈ పరిస్థితి విపరీతంగా హద్దుమీరి పోయిందని అతను గ్రహించాడు.

'ఛీ! దీనితో మొదలు బెట్టితే, ఇది తప్పకుండా హద్దు మీరుతుందని నాకు తెలుసుగా? మరెందుకు నేనలా చేసాను? పొరబాటు నాదే . . . " అని అనంతరామన్ తన్నే నొచ్చుకున్నాడు; కాని కోకిల మాటల్లోని గూఢమైన అర్థం అతను గుర్తించలేదు.

అలవాటుగా ఆఫీసుకి వెళ్లినప్పుడు దారంతా ఆ ఘటన గురించే ఆలోచిస్తూ, ఆ తరువాత ఆఫీసు పనుల్లో అనంతరామన్ అవన్నీ పూర్తిగా మరచిపోయాడు.

ఇవాళ పొద్దున్న -పెందలకడనే - 'వాడు' అనంతరామన్ ఇంటికి రావడం జరిగింది; అలాగే నిన్న సాయంకాలం, అంతకు ముందు, ప్రతీ రోజూ ఏదో నెపంమీద 'వాడు' అక్కడకి వస్తూవున్నాడు.

'వాడు' రావడం తన్ను చూడడానికి కాదు అనే కారణం వలన అతని రాకని ఏమాత్రం లెక్కచెయ్యక, కోకిలతో మాటాడుతూ అతను కనిపిస్తే 'Hello' అని మౌనంగా నవ్వేసి అనంతరామన్ తన పని తను చూసుకుంటాడు.

'వాడు' కోకిలకి దూర బంధువు అనో, కుటుంబ స్నేహితుడనో, సహపాఠి అనో - లేక ఈ అన్ని కారణాలవలన - అతనికి తను మర్యాద చూపాలని అనంతరామన్ తెలుసుకున్నాడు.

పదవ క్లాసువరకూ వాడు కోకిలతో చదివి, ఆ తరువాత పెద్ద చదువుకని కాశీకో, బొంబాయికో వెళ్ళి తన అత్తతో - నివసించడం; పది సంవత్సరాల తరువాత

ఒక Air Pilot గా తిరిగి రావడం; ముప్పైఐదేళ్ళు నిండినా తనకి తగిన అమ్మాయి దొరకలేదంటూ పెళ్ళి చేసుకోకపోవడం - ఇవన్నీ మందకొడి విషయాలు, తనకి వాటితో ఎటువంటి పొత్తూ లేదని తెలిసినా - కోకిల పదే పదే తన భర్తకి ఈ సంగతులు వాడుకగా వల్లించడం వలన అనంతరామన్ భార్య మూలం ఈ వివరాలన్నీ తెలుసుకున్నాడు.

ఆరంభంలో, అనంతరామన్ని పెళ్ళిచేసుకోవాలని కోకిల తన తల్లిదండ్రులని విరోధించుకుందని తెలుసుకొని ఆ విరోధభావం మార్చి, వాళ్ళమధ్య సమరసమైన బంధం కుదిర్చే ఒక రాయభారిగా వాడు వస్తూ, పోతూ, ఉండేవాడు.

మొట్టమొదట కోకిల తల్లిదండ్రులకి ఆమెపై ఎందుకు ద్వేషం అని తెలుసుకొని అతను ఎగతాళి చేసాడు కూడా.

"కోకిల ఏంచేసిందో తెలుసా? వేరొక జాతి మనిషితో register marriage చేసుకొని మా వంశం పేరు చెడగొట్టింది!" అని కోకిల తల్లి వాపోయినప్పుడు కోకిల ఎక్కడో బోర్నియో ద్వీపంలో ఉన్న ఒక అనాగరిక యువకుడని ప్రేమించిందేమో అని అతనికి అనుమానం కలిగింది. 'ఇంతకీ కోకిల ప్రేమించిన అనంతరామన్ అయ్యంగారు కాదు, అయ్యరు!' అని తెలియగానే అతను ఎలా నవ్వాడు!

ఒక సాయంకాలం వాడు కోకిలతో ముందు హాలులో కూర్చొని అనాగరికంగా కేకలు పెట్టడం చూసి - ఒక అన్య స్త్రీ దగ్గర అలాగ నవ్వడమంటే అందుకొక బాధ్యత లేక బందుత్వం ఉండి తీరాలి! - కోకిలకూడా వాడితో కలిసి నవ్వినప్పుడు అనంతరామన్ మొట్టమొదట అతన్ని చూసాడు. అందువలనే అంతరామన్ వాడిని అసహ్యించుకున్నాడు; కాని దానిగురించి కోకిలకి ఏమీ అనలేదు. అనంతరామన్ ఆ వైరం తనలో  ఎంత జాగ్రతగా దాచుకున్నా, తన స్నేహితుడు వచ్చినప్పుడెల్లా తన భర్త మనస్థితి గభీమని 'తారుమారు అవడం' కోకిల గమనించింది. 'ఇది తరచుగా నా భర్తలో కనిపించే విపరీతం, ఇదేం కొత్తకాదు!' అని ఉద్దేశంతో, 'ఇది నా కర్మ!' అని కోకిల లోలోపల  నొచ్చుకుంది;  దాన్ని లెక్కచెయ్యక, 'ఈ పది సంవత్సరాల దాంపత్యంలో నాకు అలవాటైన బూటకమైన నటనలో ఇదొక కొత్త ఘట్టం!' అని దాన్ని  అనుభవించింది.

తన భర్త భావావేశాలు ఆమె గుర్తించలేదనికాదు; కాని వాటిని ఖాయపరచి తన జీవితం అవమానపరచుకోడం ఇష్టం లేక అతని ప్రవర్తనలకి సర్దుకొంటూనే మెలగడానికి ఆమె అలవాటు చేసుకుంది.

అనంతరామన్ తో అదే కార్యాలయంలో పని చేస్తూ కోకిల అతని ఖ్యాతిలో మురిసిపోయింది; అతనిలాంటి intellectual - మేధావి - తనకి సహకారిగా దొరకాలని ఆశించింది; అతనివంటి ఆధునిక ప్రతినిధి సేవకి తన్ను అంకితం చేసుకోవాలని చాలారోజులు తపించిపోయింది. ఎంతకాలమైనా తన ఆశ సఫలమవుతుందనే వైరాగ్యంతో కాచుకొని ఉండడానికి పూనుకుంది. తన ఆశ యీడేరుతుందని ఆమె కలకూడ గనలేదు, కాని మనసులో ఆ కోరికని పోషించుతూనే రోజులు గడిపింది; కొన్ని సమయాలలో 'ఈ అబద్ధంలోనే నా జీవితం సాగనీ, అదే వివేకం,' అని ఆమె విసుగ్గోడమూ జరిగింది.

కాని ఆ నమ్మకం నిజమైన తరువాతనే అదొక పెద్ద అబద్ధమని ఆమెకు బోధపడింది; అది అబద్ధమవకూడదని కోకిల అన్ని ప్రయత్నాలూ చేసింది; ఆమె కోరినది రక్షణ, పరాభపం కాదు; ఒక అందమైన పుష్పంలాగ అతని పాదాలని తన్ను అర్పించుకోలాలనుకుంది; కాని అనంతరామన్ మోటుగా దాన్ని అణగదొక్కడంతో ఆమె తనే ఎరుగని స్థితిలో ఒక ముల్లుగా మారిపోయింది.

అతనికోసం ఆమె ఎంత సర్దుకొనిపోయింది! అతనికోసం తన తల్లిదండ్రులని త్యజించినప్పుడు; అతనికోసం తన ఉద్యోగం రాజీనామా చేసినప్పుడు; అతనికోసం తన రెండు జడల జుత్తుని అల్లకుండా అలాగే వదిలేసినప్పుడు; తన్ను అతను ఇంటిలో ఒకే గదిలో బంధించి బయట తిరుగుతున్నప్పుడు - అవన్నీ అతని కోసమే అనే నిజాన్ని గ్రహించడానికి కూడా కోకిల భయపడింది. కాని కాలక్రమంలో ఆ యధార్థం ఆమెకు మింగుడు అయింది. ఆ సత్యం తన కళ్ళకి కనిపించనట్టు, తనకేర్పడిన శిక్షలాగ, ఆఖరివరకూ, రహస్యమైన ఒక వ్యాధిలాగ దాన్ని భరించి - తను నాశనమైన తరువాత తనతో ఆ రహస్యమూ నాశనమవ్వాలని - ప్రయత్నించింది. 'ఆఖరికి ఆ ప్రయత్నాలన్నీ వృధా! అంతేకాదు. ఇప్పుడు నా స్థితి ఇంకా అధ్వానం!' అని ఇప్పుడే ఆమె తెలుసుకుంది.

ఇదెలా జరిగింది?

'ఇంత గొప్ప ప్రజాదరణకి, కీర్తికి పాత్రుడై, జీవితం పూర్తిగా వర్ధిల్లుతున్న సమయంలో అతనెందుకు నా విషయంలో, తన్నే అగౌరవపరచుకొని, ఒక పురుగులాగ తన జీవితాన్ని ఒక అడుసు బురదగా మార్చుకొని, రోజూవారీ అందులో దొర్లడం సాధ్యమైంది?' - అని కోకిల తనలో అంగలార్చుకున్నప్పుడు, తన ఫిర్యాదు ఈ ప్రపంచంలో ఏ ఆస్థాన మంటపమూ అంగీకరించదని ఆమెకనిపించింది. అనంతరామన్ అటువంటి వ్యక్తి అని ఎవరైనా చెప్తే, ఇంకొకరి మూలం వినివుంటే - ఆమె నమ్మివుండదు; తమ ఇద్దరికి మాత్రం సంబంధించిన ఆ విచారణలోని తాత్పర్యం - మరే న్యాయమూర్తికి బోధపడదు. ఇటువంటి దాంపత్య విచారణలలో ఎటువంటి న్యాయమూర్తి ఐనా సరే - అతనొక మూడవ మనిషే కనుక అతని తీర్పు రెండు పక్షాలలో ఎవరో ఒకరికి ఎదురుగా కనిపిస్తే, అది అధర్మం అన్నమాట. అందువలనే ఏ మూడవ మనిషికీ తన ఫిర్యాదు బహిరంగమవకూడదని కోకిల మూర్ఖంగా ఉంది.

తన గౌరవంకి, అభిమానంకి అర్హుడైన 'వాడి'తోనూ తన దాపత్య జీవితం అద్భుతంగానే ఉందని వాలాయించిన కోకిల ఈ రోజువరకూ విజయమే సాధించింది.

కాని ఇవాళ ఉదయం జరిగిన సంఘటన . . .

'ఇక నేను మరెవరికి తెలియకుండా ఇది దాచలేను! ఇంతకు మీరి నేనిక సర్దుకోడం అసాధ్యం! ఇక నేను చెయ్యవలసినది తలెత్తి చూడడమే. ఇక నా జీవితం ఇంతే అంటే నేనెందుకు కొంచెం తలెత్తి చూడకూడదు? అదొక అవమానం అంటే దాన్నీ భరించడానికి నేను సిద్ధంగా ఉన్నాను . . . నాకెందుకు భయం? నా విజయ పతాకం కూలిపోయిన తరువాత మరే అనుమానమూ నన్నిక బాధించదు!' - ఇలా కోకిల ఒక కొత్త దిశలో ఆలోచించినా తనిక భవిష్యత్తులో ఏం చెయ్యాలో తెలియక ఆమె కలవరపడింది.

నిన్నవరకూ ఇటువంటి తడబాటు ఆమెకి కలగలేదు; ఇటువంటి రచ్చలు ఇంతకుముందు ఎన్నోసార్లు జరిగినా అవన్నీ ఇవాళలాగ హద్దుమీరలేదని అనంతరామన్ లాగే కోకిలకూడా గ్రహించింది.

అన్నిటికీ హద్దులున్నాయి. ఇద్దరే వ్యక్తులైనా - ఈ పెద్ద సామాజిక నిర్వహణకి ఆధారమైన, ఇద్దరికి సంబంధించిన దాంపత్యంలోనూ - కొన్ని హద్దులున్నాయి.

ఒడంబడికలు అనే మాట వచ్చినప్పుడు రెండు పక్షాల మధ్య, రెండు దేశాల మధ్య, సామరస్యం, స్నేహం, పెరగడానికి అవి దోహదం చేస్తాయి. అలాగే దాంపత్యంలోకూడా ఇద్దరూ ఒకరికొకరు ఆ ఒడంబడికలకి లోబడి నడుచుకుంటేనే వాళ్ళ జీవితం రమ్యంగా సాగుతుంది. ఇది ఉద్దేశపూర్వంగా, సులభంగా అందరికి బోధపడుతుంది. కాని ఎందుకో యథార్థ జీవితంలో చాలామందికి ఇది చేతకాదు.

అనంతరామన్ వంటి బుద్ధిజీవులు కూడా తమ వ్యక్తిగత జీవితంలో ఈ హద్దులను ఆక్రమించుతూనే ఉన్నారు.

ఆమె తనకి సొంతం అనే ఒడంబడిక ఏర్పడిన ఆ మొదటిరోజే అనంతరామన్ తన హద్దులను మీరాడు. ఆమె తన మానసిక తెరలో అతనిగురించి వ్రాసుకున్న అందమైన చిత్రాలు ఎన్నో! వాటి చెమ్మ ఆరడానికి ముందే - అజాగ్రతతతో అతనన్న మాటలు విని, కలవరపడి, ఆ కలలని వదులుకొని - కోకిల, ఆ చిత్రాలని వికారం చేసుకుంది.

ఆవేశాల హద్దులు మీరేవారు కావాలన్నా వెనకాడలేరు; అక్కడే నిలబడి, దానికోసం దుఃఖపడి, దుఃఖపడి, మళ్ళీ, మళ్ళీ ఆ హద్దులు దాటడం అలవాటుగా చేసుకుంటారు. ముఖ్యంగా దాంపత్య జీవితంలో హద్దులు పాటించకపోతే అది మనిషినే మింగే అడుసులాగ మారుతుంది.

అటువంటి భావేశాలలో లీనమైపోయి, దాంపత్య జీవితంలోని సౌందర్యాలు పోగొట్టుకొని, తన జీవితమంతా పోట్లాటలు, గొడవల మధ్య సాగుతున్నట్టు అనంతరామన్ పదేపదే బాధపడేవాడు.

అటువంటి సమయాల్లో, 'నా ప్రతిభ చూసి కోకిల తన చిత్తం పోగొట్టుకుంది; నన్ను ప్రేమించింది; అంతకి మించి అది మరేం పొరబాటు చెయ్యలేదే? కాని నేను ఎంత క్రూరంగా ఆమె జీవితం పాడు చేసాను! . . . దాని హృదయంలోని కలలన్నీ చిందరవందర చేసాను! . . . " అని అనంతరామన్ కొన్నిసార్లు రహస్యంగా కన్నీరు కార్చేవాడు. అది కోకిలకి తెలుసు. కాని నిత్యమూ గాయపడి, రక్తం కారుతున్న హృదయంతో నొగులుతున్న ఆమెకి అతని కన్నీరు ఉత్తి సాహసంగా కనిపించడంవలన కోకిల దాన్ని లెక్కచెయ్యలేదు. కాని భర్త తృప్తికోసం అతన్ని ఓదార్చుతుంది. అది నిజం కాదని అతని మనసుకు తెలుసు. 'మా దాంపత్యం

ఒక బూటకం, అది సారం లేకుండా, శారీరక రీతిలో సాగుతోంది. ఐనా భార్యా, భర్తలుగా మాకది చాలు!" అనే మనోభావంలో వాళ్ళిద్దరూ తృప్తిపడ్డారు.

చాలాసార్లు తన చేష్టలకి అనంతరామన్ కోకిలదగ్గర క్షమాపణ కోరుకున్నాడు; ఆమె దాన్ని అంగీకరించడమూ ఒక నటనే అనాలి. 'దాని మనసులో నేను పోగొట్టుకున్న స్థానం మళ్ళీ నేను సంపాదించగలనా? ఆ పాత కలలన్నీ తిరిగి సంపాదించడం ఎలాగ?' అని తహతహలాడినప్పుడు అతనే కోకిలకంటే తన జీవితంలోని శూన్యత ఎంత పెద్ద భారమని గ్రహించాడు. ఆమె తనతో ఎప్పుడూ నిష్కపటంగా మెలుగుతుందని అతనికి నమ్మకం ఉంది. ఆ నమ్మకంతోనే ఆమెని ఒకరోజు అడిగాడు: "నువ్వు నన్ను ఎప్పుడూ ప్రేమించలేదని నాకనిపిస్తోంది. అవునా?"

ఆమె జవాబు చెప్పింది: "అవును."

"నువ్వు ఇప్పుడు అంటున్నది నిజం. అవునా?"

"అవును. అదే నా మనసులో ఉంది."

అది వినగానే చిరచిరలాడుతూ, పళ్ళు కొరుకుతూ అతను అడిగాడు: "అలాగైతే మరెందుకు మనం కలిసివున్నాం?"

తనూ అదే ప్రశ్న అడగాలన్నట్టు కోకిల తలెత్తి అతన్ని చూసింది; అతను ముందు అడిగేసాడనే కారణంవలన దానికి జవాబు చెప్పింది: "ఈ ప్రపంచంముందు అటువంటి బంధం మనం ఖాయపరచుకున్నాం - అందువలనే."

"చూసావా? పెళ్ళి, registration అనే ఆచారాలు - అవి ఎంత ప్రాచీనమైనా, నవీనమైనా - రెండు జీవులు సంగమించకపోతే - రెండు శరీరాలని మాత్రం బిగువుగా బంధించే మృగంగా మారిపోతుంది!" అన్నాడు అనంతరామన్.

ఆ తరువాత రాబోయే ఆలోచన ఇద్దరి మనసులోనూ ఒకేసారి లేచింది, కాని దాన్ని మౌనంగానే పరివర్తన చేసుకున్నట్టు, దేనికో భయపడుతున్నట్టు, ఒకరినొకరు రెప్పవాల్చకుండా చూసుకున్నారు.

అనంతరామన్ దీర్ఘమైన నిట్టూర్పు వదిలాడు.

"ఇక మనం ఏం చెయ్యాలి? దానిగురించి నువ్వు ఆలోచించావా?" అని అతను అడిగినప్పుడు కోకిల దానిగురించి తను స్థిరంగా నిష్ణయించినట్టు విరక్తితో జవాబు చెప్పింది.

"నా ఉద్దేశంలో నేనిలాగే జీవించాలని పూనుకున్నాను. నేను మోసం పోయానని లోకంలో బాహటంగా అందరికీ తెలియజేయడానికి నాకు అవమానంగా ఉంది. నా తల్లిదండ్రులు ద్వేషంతో నన్ను వదలుకున్నారు, కాని నేను నామట్టుకు సంతోషంగా ఉన్నానని వాళ్ళు రహస్యంగా తృప్తి పడుతున్నారు. ఆ ఊరడింపు వాళ్ళు అనుభవించనీ . . . అంతే కాదు. నలుగురు మగవాళ్ళ వినోదం, విలాసంకి వశమైపోవడంవలన నా మనసుకి సుఖం రాదని నేను తెలుసుకున్నాను . . . నేనిలా అనడంవలన దయచేసి నేను మీకోసం ఏదో త్యాగం చేసానని జాలిపడకండి! ఇది నా కర్మ! ఇది నాకు నేనే ఇచ్చే మర్యాద! ఇందులో మరెవరికీ వాటా లేదు . . . "

స్త్రీవాదం వెలుగుతున్నట్టు ఆమె శరీరం ప్రకాశించించడం గమనించి దాని నీడలో అతను శరణుకోరాడు.

"కోకిలా . . . నువ్వు నాకు కావాలి!" అని తన్ను మరచి అతను పిచ్చిమాటలాడినప్పుడు కోకిల తన్ను మరవలేక జవాబు చెప్పింది.

"అదే నేనున్నానుగా?"

"నువ్వు లేక నేను ఉండలేను."

"అందుకే నేనున్నాను."

తను ఎంత భావేశంతో మాటలాడినా ఆమె మినుకుగా, సారహీనంగా జవాబు చెప్తోంది అని తెలుసుకొని అనంతరామన్ బాధపడ్డాడు; ఆఖరికి ఆమెలాగ తను కూడా తన జీవితం గడపాలని అతని మనసులో విరక్తి చోటుచేసుకుంది.

మనసులో ఎటువంటి ఉత్సాహం లేకుండా సాగుతున్న కోకిల మొద్దుబారిన జీవితంలో గభీమని ఆమె బాల్యమిత్రుడు రావడం జరిగింది. తమిద్దరి జీవితాల్లో చాలా మార్పులు - ఆశించినవీ, ఎదురుచూడనవీ -వచ్చిన తరువాత కూడా అతను ఆ స్నేహం మరచిపోకుండా తన్ను చూడడానికి వచ్చాడని కోకిల మురిసిపోయింది.

అతను కోకిలతో ఎడబాటు కలిగినరోజుల్లో కోకిలకి ఒక ఉత్తరం కూడా రాసాడు; ఆ తరువాత దానిగురించి ఆలోచిస్తూ, తన పసితనంకి తనలో నవ్వుకున్నట్టు కోకిలకి చెప్పాడుకూడా. అది గుర్తుచేసుకొని ఈ దినాల్లో కోకిల లోలోపల ఏడుస్తోంది, కాని బయట ఉత్తికే నవ్వుతోంది.

అనంతరామన్ని కోకిల పెళ్ళి చేసుకున్నరోజునుంచి కోకిలకి ఆమె పుట్టినిల్లుతో రాకపోకలు ఆగిపోయాయి; ఇతనే ఒక దూతగా వచ్చి ఆ బంధం బాగుచేసాడు.

ఆరు మాసాలముందు - పది సంవత్సరాల తరువాత - కోకిల అనంతరామన్ అనుమతితో పుట్టినిల్లుకి వెళ్ళింది. ఒంటరిగా వెళ్ళిన తనతో తన భర్తగురించి ఆనవాయితీగా కూడా తన తల్లిదండ్రులు ఏమీ అడగలేదని వాళ్ళ మొండితనం గ్రహించి "ఇక ఈ ఇంటికి వస్తే మా ఆయనతోనే వస్తాను!" అనే నిర్ణయంతో ఈ ఆరు నెలలూ కోకిల పుట్టినిల్లుకి వెళ్ళనేలేదు. అందువలన 'వాడే' కోకిలని చూడడానికి ఇక్కడికి రావడం జరుగుతోంది.

కోకిల భర్త తనతో ఎక్కువగా మాటాడకపోవడం, తనూ కోకిలా ఏమైనా సరసమైన సంభాషణలో ఉన్నప్పుడు అతను విడివడిగా ఉండడం - ఇవన్నీ చూసి వాడు అనంతరామన్ని అపార్థం చేసుకోలేదు. ఎందుకంటే తన భర్తగురించి వాడి మనసులో మంచి అభిప్రాయం ఏర్పడాలని కోకిల అతనికి ఒకప్పుడు చెప్పింది:

"మా ఆయన నిత్యమూ ఆ పత్రిక, తను రాసే వ్యాసం గురించే ఆలోచిస్తూంటారు . . . నాకూ అదే భయం . . . అతను ఎప్పుడు దేనిగురించి ఆలోచిస్తున్నారో ఎవరికి తెలుసు? మనం ఏదైనా చెప్పి దాన్ని పాడుచెయ్యకూడదుకదా? అతను భోజనం కూడా మరిచిపోతారు . . . ఎదుట వస్తున్న మనుషులు అతని కళ్ళకి కనిపించరు . . . అది తెలియక చాలామంది అతన్ని అపార్థం చేసుకుంటారు . . . "

ఆరంభంలో ఆ మిత్రుడు తను వచ్చినప్పుడల్లా అనంతరామన్ చూపే ఉపేక్ష చూసి కొంచెం బాధపడేవాడు; ఇప్పుడది అతనికి అలవాటైపోయింది. కాని కోకిల మాత్రం తన స్నేహంకి పాత్రురాలు అనే కారణం వలన ఆమెకోసమే అతను వస్తున్నాడు. అతను ఒక నెలలో చాలా రోజులు ఇతర నగరాలు, కొన్నిసార్లు విదేశాలలో గడుపుతాడు. అందువలన అతని సంభాషణలలో, అనుభవాల్లో కోకిలకి

గొప్ప ఆసక్తి ఉంది. అతనితో మాటాడానికి టోలెడు సంగతులున్నాయి. అతనితో మాటాడుతున్నప్పుడు ఆమె మరవకుండా అతను త్వరలో పెళ్ళి చేసుకోవాలని తరచుగా చెప్తుంది. దానికి అతను ఒక్కొక్కసారి, వేరే వేరే విధంగా, తన మనసుకి తోచినట్టు, జవాబు చెప్తాడు. కాని వాటిలో, ప్రతీ దానిలో, ఒక గూఢార్థం ఉంటుంది.

కొన్నిసమయాల్లో అతను కారులో వస్తాడు; కొన్నిసార్లు స్కూటర్ లో వస్తాడు. కాని ఎప్పుడూ ఒట్టి చేతులతోనే వస్తాడు. కోకిలకి మనసులో ఒక ఆశ: 'వీడు ఏవేవో దేశాలకి వెళ్తున్నాడే, నాకోసం ఏదైనా కొని తీసుకురాడేం? ప్రపంచంలో వీడికేదీ చోద్యంగా కనిపించదా?' అని ఆలోచించేది. కాని అలాగ అడగడానికి తనకెటువంటి హక్కులేదనే కారణం వలన తనతో మాటాడానికైనా ఆ మిత్రుడు వస్తున్నాడు కదా తృప్తి పడేది.

అంధకారమైన కోకిల జీవితంలో అతను వచ్చినప్పుడల్లా ఒక దీపం వెలిగినట్టు ఆమె మొహంలో ఒక శోభ తేలుతుంది; అతను రాని రోజుల్లో ఆ శోభ కొంచెం కొంచెం తగ్గుతూ వస్తూ ఆ మొహంలో పాత చీకటి చోటుచేసుకుంటుంది. కోకిలకే తెలియకుండా జరిగే ఈ మార్పు అనంతరామన్ మాత్రం - నిస్సందేహంగా తన అనుమానం తనే పరీక్షించి - 'అవును, అది నిజం!" అని ఖాయపరచుకున్నాడు.

అతను రావడం తన భర్తకి చీదరగా ఉందని కోకిలకి తెలుసు, కాని తెలియనట్టు ఆమె నటించింది. ఒకప్పుడు ఇదొక పెద్ద ప్రశ్నగా మారుతుందని ఆమె ఎదురుచూసింది; కాని దాని గురించి ఆమె భయపడలేదు.

కోకిలపై ఆమె భర్తకి ఎటువంటి నీచమైన అనుమానాలు గాని, ఆమె తనకి ద్రోహం చేస్తుందని భయం గాని రవంతైనా లేదు. అలాగ ఏమైనా జరిగినా కూడా అతను బాధపడడు. ఎందుకంటే త్యజించలేని బంధంని విముక్తం చెయ్యడానికి అది దోహదం చేస్తుందని అతను సంతోషిస్తాడు.

ఒకసారి అనంతరామన్ కోకిలతో వాడి గురించి అడిగాడు. 'వాడు రాగానే ఆమె మొహంలో అగుపడే ఆ శోభని నేనూ వాడిగురించి మాటాడి ఆ శోభని రప్పించగలను,' అనే ఆలోచన రాగానే అనంతరామన్ లోపల చిఱచిఱలాడాడు. కోకిల తన్ను మరచి వాడిగురించి భర్తతో మాటాడుతోంది. అనంతరామన్ తన భావనలన్నీ అణచుకొని ఆమెని అడిగాడు:

"మీరిద్దరూ ఒకరినొకరు చూడకుండా చాలా కాలం గడిపారు కదూ?"

"అవును. చాలా రోజులు . . . "

"పది సంవత్సరాలనవచ్చా?"

". . . ఇంకా ఎక్కువే . . . "

"ఆ రోజుల్లో నీకు వాడి గుర్తు ఉండేదా?"

"హూం . . . నేను వాడిని పూర్తిగా మరిచిపోయాను! . . . చిన్నప్పుడు మనం ఎంతమందితోనో మెలగుతాం కదా?"

"మీ ఇద్దరిమధ్యా ఆ ఎడబాటు లేకపోతే నువ్వు వాడిని పెళ్ళిచేసుకొని ఉంటావ్, అవునా?"

ఆ ప్రశ్నతో కోకిల తన ఊహాలోకంనుంచి దిగివచ్చింది. తను మాటాడుతున్నది తన ఎదుట ఉన్న తన భర్తతో అని గ్రహించింది.

ఆ పడకగది దీపంలో నీరసంగా కనిపించే ఆ వెలుతురులోనూ ఆమె మొహం గభీమని మబ్బుగుపడడం అనంతరామన్ గమనించాడు. ఇప్పుడు ఎరుకతో కోకిల అతనికి జవాబు చెప్పింది:

"అదెలాగ చెప్పగలం? అదృష్టం బాగుంటే ఇంకా మంచి వరుడు వచ్చి ఉంటాడేమో, ఎవరికి తెలుసు?"

"నువ్వు వాడిని మళ్ళీ కలుసుకున్నప్పుడు - నీ పెళ్ళి విషయంలో నువ్వు తొందర పడినట్టు - ఆలోచించి బాధపడ్డావ్, అవునా?"

"లేదు." అని చెప్పి ఆగక, ఆమె ఇంకా మాటాడింది. "నాకు పెళ్ళైన రోజే . . . " అని అంటూంటే నోటిలో మరే మాటా పెగల్లేదు. మాటలు గొంతులోనే చిక్కుకున్నాయి. తలగడలో తలని ఒత్తుకొని ఆమె వెక్కి వెక్కి ఏడ్చింది.

అనంతరామన్ నిష్టూరమైన ధ్వనితో, మండిపడుతూ ఆమె వీపుని చూస్తూ మాటాడాడు:

"I am sorry! వాడిగురించి నేనిలాంటి ప్రశ్న అడగ్గానే నువ్వు ఇలాగ బాధ పడతావని నాకు తెలియదు!"

ఆమె తటాలున ఏడవడం ఆపుకొని, తలెత్తి, అతన్ని రెప్పవాల్చకుండా చూసింది. "అతని గురించి ఏది గుర్తుకి వచ్చినా సరే నేను బాధపడను. అతను నా

జ్ఞాపకంలో ఎలా ఉన్నారని నేను మీకు చెప్పనక్కరలేదు." ఇంకా ఏమేమో చెప్పాలని అనిపించింది. కాని ఎలా చెప్పినా తన భర్త అపార్థమే చేసుకుంటాడనే ఉద్దేశం వలన మరేం అనక, పెదిమలు వణుకుతూ, మౌనం దాల్చింది. ఆఖరికి అతనికి చెప్పింది.

"ఎద్దైనా సరే, బాహాటంగా మీరు నన్ను అడగవచ్చు. నేనూ నిష్కపటంగా మీకు జవాబు చెప్తాను. కాని మీకది బోధపడదు!" అని అతనికి అర్థమైనట్టు ఆంగ్లభాషలో చెప్పింది.

"నువ్వు మాటాడే దిక్కుమాలిన ఇంగ్లీషు నాకు అర్థమౌతుందిలే!", అని ఆమెను అనంతరామన్ ఎత్తిపొడిచాడు. "సరే, చెప్పు, వింటాను."

"నాకు మిమ్మల్ని చూస్తే జాలిగా ఉంది, అందుకే ఇది చెప్తున్నాను. నా మనసులో అతను ఒక గణ్యమైన మనిషి. ఇంతకుముందే మీకు భార్యగా ఉన్న ఒక స్త్రీని ఎరజూపే నీచుడుగా అతన్ని నేను గణించలేను. మీకటివంటి ఏ భయమూ వద్దు. నాగురించీ మీకేం భయం వద్దు. నేనిది చాలా సార్లు మీకు చెప్పివున్నాను. దీన్ని పదే పదే ఏ భాషలో చెప్పినా నాకు అలసటగానే ఉంది."

ఆ తరువాత అనంతరామన్ వాడిగుంచి కోకిలతో ఏమీ మాటాడలేదు. వాడి రాకవలన అతనేం ఎక్కువగా బాధపడలేదు.

కాని ఇవాళ ఉదయం -అనంతరామన్ కళ్ళు తెరిచి నిద్రనుంచి లేచినప్పుడు - వాడు వచ్చాడని తెలుసుకున్నాడు.

ముందు హాలులో ఒక పేము కుర్చీలో వాడు కూర్చొని ఉన్నాడు; వాడి వీపు మాత్రం అనంతరామన్కి కనిపించింది. తెల్ల నిజారు బయట దట్టమైన వెండ్రుకలతో కనిపించే వాడి పెద్ద తొడదగ్గర నిలబడి ఆతురతతో మాటాడుతూ - వాడితో ఎది మాటాడినా దానికి ఆతురతే కదా? - కాఫీయో. ఓవల్టిన్నో కోకిల చల్లార్చుతోంది.

పడకనుంచి లేచి అనంతరామన్ గది తలుపుదగ్గర నిలబడి వాళ్ళిద్దరినీ తేరిపార చూసాడు. కోకిల లేక వాడు తన్ను గమనించలేదనో లేక మరేం కారణం వలనో మండిపడి తలుపుని దడాలున మూసి బాత్ రూమ్ కి నడిచాడు.

తన మనసులోని క్షోభ వాళ్ళకి తెలియజేసినట్టు అతని భావన; కాని వాళ్ళు అది తెలియక తమ సంభాషణ సాగిస్తూనే ఉన్నారు.

పెర్రి ఉద్రేకంతో బాత్ రూమ్ లో ఒంటరిగా నిలబడిన అనంతరామన్ చెవులకి వాళ్ళ సంభాషణలో అక్కడక్కడ చోటుచేసుకున్న నవ్వులు తన్ను ఎగతాళి చేస్తున్నట్టు అనిపించింది.

తన భార్య ఒక పరాయి మగవాడితో తన్ను మరచి హాయిగా మాటాడుతోంది; వాడి ప్రత్యక్షంలోనే అతీతంగా ఆమె సంతోషించుతోంది. అది ఈ నిమిషం అనంతరామన్ భరించలేకపోయాడు.

తనవంటి ఒక ఆధునిక మగవాడికి ఇటువంటి ప్రవర్తన అనుచితం అని అనంతరామప్ గ్రహించాడు. కాని ఈ జీవితమే ఒక భారమని బాధపడుతూ, 'ఇది నా కర్మ!' అని విరక్తితో తన భార్య ఖైదీలాగ అతను రోజులు గడుపుతున్నాడు. ఈ క్షణంలో కోకిల 'వాడి' ముందు తన కటువంతా మాధుర్యంగా మార్చుకొని సుఖానుభవంలో తేలడం అనంతరామన్ సహించలేకపోయాడు.

పది నిమిషాలవరకూ బయటకి రాకుండా అనంతరామన్ బాత్ రూమ్ లోనే నిలబడ్డాడు. 'ఛీ, పొద్దున్నే ఇదొక పెద్ద గొడవ!' అని తనలో విసుగ్గున్నాడు; Wash Basin లోనుంచి నీళ్ళు తీసుకొని మొహం తుడుచుకున్నాడు; నోరులో నీళ్ళు బాగా నింపుకొని రెండు మూడు సార్లు పుక్కిలించాడు; కావాలనే కొంచెం ఎక్కువగానే సద్దు చేస్తూ రెండు మూడు సార్లు ఉమ్మాడు; ఆ తరువాత పక్కనేవున్న తువ్వాలులో తన మొహాన్ని హాయిగా ఒత్తుకున్నాడు.

అప్పుడే 'వాడు' కోకిల దగ్గర శెలవు పుచ్చుకునే మాటలు వినిపించాయి. ఆ తరువాత కొన్ని నిమిషాలలో స్కూటర్ బయలుదేరే శబ్దం వినిపించింది.

అనంతరామన్ బాత్ రూమ్ తలుపు తెరిచాడు.

ముందు హాలులో నిలబడి చెయిలో గిన్నెలతో కిటికీద్వారా వీధిని చూస్తున్న కోకిల అప్పుడే తిరిగిచూసింది.

'వాడు' స్కూటర్ లో వెళ్ళే సొగసుని చూసి ఆమె అలాగే మురిసిపోయిందా?'

"అతను కైరోకి వెళ్తున్నారట!" అని ఏమో ధోరణిలో భర్తకి చెప్పాలని కోకిల అతని మొహం చూసింది. కాని అందులో ఎటువంటి అనుసరణ కనిపించలేదని గ్రహించి 'మనం ఎందుకు చెప్పాలి?' అని తన్నే నోచుకుంది.

'అదేంటి, నా మొహం చూడగానే ఆమె మొహం నల్లబారిపోతోంది? పాపం, దాన్ని తప్పుపట్టకూడదు; 'పోనీలే!' అని నన్ను చూసి నవ్వుతోంది! కాని ఆ నవ్వు పెద్ద అబద్ధం! ఆమె నవ్వకుండా ఉంటే బాగున్ను!'

అలవాటుగా కోకిల అతనికి కాఫీ ఇచ్చింది. అతను మౌనంగా దాన్ని తాగాడు. మధ్య రెండు మూడుసార్లు తలెత్తి ఆమెను చూసాడు. అప్పుడే తటాలున ఆమెను అడిగాడు:

"మనిద్దరం మనకిష్టంలేని జీవితం గడుపుతున్నాం, అవునా?"

దానికి సముచితంగా ఆమె జవాబు చెప్తుందనే అపేక్షతో అనంతరామన్ ఎదురుచూసాడు. కాని ఆ తరువాత జరిగిన ఘటనలన్నీ ఇప్పుడు గుర్తుచేసుకొని 'ఎన్నిసార్లు దెబ్బ తిన్నా నాకు బుద్ధి రాదు!' అని తన్నే నొచ్చుకున్నాడు.

ఆఫీసుకి వచ్చిన తరువాత అతను వేరేమనిషిగా మారిపోయాడు.

ముందటివారం అనుబంధంలో తన 'ప్రపంచంలో నా ఎఱుక' శీర్షికకి వచ్చిన ఉత్తరాలు చదివినప్పుడు అనంతరామన్ తన వ్యక్తిగత జీవితంలోని అవమానాలన్నీ పూర్తిగా మఱచి, బుద్ధిజీవి అనే అహంకారంలో మునిగిపోయాడు; ఆ మత్తుతోనే ఈ వారం వ్యాసం రాసి పూర్తిచేసాడు.

'ఈ అచ్చు యంత్రాల ఘోషలోనూ ఈ ఆఫీసు జీవితం ఎంత నిమ్మళంగా, హాయిగా ఉంది!'అనుకుంటూ ఇక రాబోయే తన ఆత్మీయ జీవితంలోని సాధింపులు, సణుగులకి బలి అవడానికి అతను సిద్ధమైయ్యాడు; ఇంటికి బయుదేరాడు.

ఇటువంటి తుఫాను చెలరేగిన తరువాత కొన్నిరోజులు అతని దాంపత్య జీవితంలో ఒక శాంతి చోటుచేసుకుంటుంది. కాని ఆ శాంతి ఇంకొక తుఫానుకి ఆనవాలు అని ఆ దంపతులకి తెలిసినా ఆ శాంతిలోనే ఇద్దరూ ఒక విధమైన సుఖం అనుభవిస్తారు.

సాయంకాలం ఇంటికి తిరిగివచ్చినప్పుడు అనంతరామన్ మనసు నెమ్మదిగానే ఉంది. కోకిలతో తన బదిలీగురించి మాటాడాలి, అందువలన తన జీవితంలో ఒక కొత్త మలుపు రావొచ్చు అనే నమ్మకంతో అతను ఇంటికి వెళ్ళాడు.

తనకి సంబంధించిన ఏ విషయంలోనూ తనే ఏదీ నిర్ణయించక కోకిలని సంప్రతించడం తనకి అలవాటని అతను సంతోషించాడు. కాని కోకిల దాన్ని గుర్తించలేదని బాధపడుతూ, వొంచిన తలతో మెట్లు ఎక్కుతున్నప్పుడు - ఆ మెట్ల మలుపులో అతనికి తన ఇల్లు తలుపులో తాళం కనిపించింది. తక్షణమే చికాకూ, ఆ తరువాత గభీమని దిగులూ అతని మనసులో చోటుచేసుకున్నాయి.

' అబ్బా, కోకిల ఎంత పని చేసింది!'

"అంకుల్, అమ్మ మీకు ఇవ్వమంది!"

యంత్రంలాగ తిరిగిచూసిన అనంతరామన్ తనకి తాళంచెవి అందిస్తూ నిలబడిన అమ్మాయిని చూసి అది అందుకున్నాడు. అతని చూపు ఆ అమ్మాయిని దాటి పొరుగింటి కిటికీదగ్గర నిలబడే స్త్రీమీద వాలింది. మరేమైనా సంగతి ఆవిడ చెప్తారేమో అనే ఆతురతతో ఆవిడని చూసాడు. 'ఎందుకు? తలుపు తెరచి లోపలికి వెళ్తే ఆ సంగతి తెలిసిపోతుంది!' అనే ఆలోచన రాగానే అతని దేహం తొందర పడింది. తన ఆవేశం బయటకి తెలియపరచకుండా, తల వంచి, మెల్లగా మెట్లెక్కి అతను నడిచాడు. ఆ ఇంటి ముందు హాలులో కాలుబెట్టగానే ఆ సంగతి అతనికి తెలిసిపోయింది.

హాలులో ఉన్న పేము కుర్చీలో రాసి, చితగగొట్టిన రెండు మూడు కాగితాల బంతులు కనిపించాయి. అనంతరామన్ తన చెయిలోని brief case ని పక్కనేవున్న మేజామీద పెట్టి ఆ బంతులలో ఒకటి తీసి చదివాడు.

"My dear . . . " అని ఇంగ్లీషులో ఆరంభించి, అలాగ కాదన్నట్టు దాన్ని కొట్టి పారేసినట్టు కనిపించింది.

ఇంకొకటి తీసి చదివాడు. అందులో కట్టెవిరచినట్టుగా ఇలా రాసివుంది: "నేను వెళ్తున్నాను; ఎక్కడికి వెళ్తున్నానని మీకిష్టం వచ్చినట్టు నిర్ణయించుకోండి." అదికూడా కొట్టి పారేసినట్టు కనిపించింది.

ఇంకొకటి ఏమీ అర్థం కాకుండా రాసిన తరువాత తునకలు తునకలుగా చింపేసినట్టు కనిపించింది. కాని అందులో ఆమె చాలా రాసింది. ఆ తునకలన్నీ కూడదీసి, అతికించి చదవడానికి అతనికి ఓపిక, అపేక్ష లేదు. ఆ చెత్తని పోగుచేసి తొట్టిలో పారేసి తన గదికి వెళ్ళాడు.

ఆమె గదిలో బీరువా తెరిచివుంది. కోకిల దాన్ని మూడడానికి మరిచిపోయిందా లేక అసలు మూడవద్దని అలాగే వదిలేసిందా? ఆ ఖాళీ బీరువా చూడగానే మూల విగ్రహం లేని ఒక కోవిలని దర్శించినట్టు అతని భావనలు శూన్యాన్ని అందుకున్నాయి.

ఆ గదిలో కట్టబడి, వేలాడుతున్న ప్లాస్టిక్ తీగలో - నిత్యమూ తోరణంలాగ కనిపించే ఆమె దుస్తులేవీ - ఇప్పుడు లేవు.

ఆ గదికున్న ఇంకొక తలుపుని అనంతరామన్ తెరిచి చూసాడు.

కొన్ని గంటలముందు ఆ ఇంటిలో ఒక స్త్రీ ఉన్నట్టు ఏ సూచనా కనిపించక అదొక బ్రహ్మచారి గుహలాగ కనిపించింది; అతను మళ్ళీ తన గదికి తిరిగి వచ్చాడు.

ఆ గదిలో కిటికీకి సమీపంలో ఉన్న Dressing Table లో ఒక జంట ఫోటో ఫ్రేముకి ఆడుగున ఒక కవరు కనిపించింది. అలవాటుగా కనిపించే అలంకార వస్తువులేవీ అక్కడ లేవు. ఆ జంట ఫ్రేములో తలకొకటిగా దూర్చబడిన రెండు ఫోటోల్లో ఒకటి తీసుకొని వెళ్ళడానికి ఆమె మరిచిపోయిందా? లేకపోతే 'కావాలంటే అతనే దాన్ని తీసి పారేయనీ' అని ఆమె ఉద్దేశమా?

అతను ఆ జంట ఫోటో ఫ్రేముని కొంచెం సేపు తేరిపార చూసాడు. వాళ్ళ పెళ్ళికి ముందు తీసిన ఫోటో అది; ఆమె మొహంలో కనిపించే ఆ కాంతి ఆమె మనసులో తన భవిష్యత్తుగుంచి కన్న కలల ప్రతిబింబం! అతని ఫోటో కూడా చాలా సంవత్సరాలముందు తీసినదే! కాని ఆ మొహంలో వైరుధ్యం లేదు; ఒక మేధావికి సహజమైన గంభీరభావం అందులో కనిపించింది.

'ఇప్పుడు ఇవన్నీ పాత కథలు!'

అతను ఆ రెండు ఫోటోలని మళ్ళీ మళ్ళీ తిరిగి చూసాడు. ఒక కవరుమీద భారంగా ఉన్న దాన్ని మళ్ళీ Dressing Table మీద పెట్టినప్పుడు కింద జారిన ఆ కవరుని తన చెయిలో తీసుకున్నాడు; ఎదుటనున్న అద్దంలో అతని ప్రతిబింబం కనిపించింది.

'కోకిల ఎంతపని చేసేసింది!' అని తనకే వినబడనట్టు తన పెదిమలు వొణకడం అతను అద్దంలో గమనించాడు. అప్పుడే తనేదే తనలో గొణుక్కున్నట్టు అతను గ్రహించాడు. పూర్తిగా శోకంలో మునిగిపోయినట్టు తన మొహం మారిపోయి,

అసహాయంతో ఏడ్చి తీర్చిన ఒక పిల్లవాడిని చూస్తున్నటు తన కళ్ళు తడిసిపోవడం గుర్తుచేసుకున్నాడు.

తన మనస్సులోని శూన్యతని అతను ఒక నిట్టూర్పులో వదిలాడు; గొంతుకని రెండుమూడుసార్లు బలంగా సవరించుకొని తన చూపుని అద్దంనుంచి మళ్ళించుకున్నాడు; అర్థంలేకుండా తనలో తనే నవ్వుకున్నాడు.

అతని చేతులు ఆ ఫోటో ఫ్రేముని మళ్ళీ అందుకున్నాయి. దాన్ని చూస్తూంటే అతనికి గభీమని కోపం వచ్చింది; పటపటమని పళ్ళు కొరికాడు.

ఆ రెండు ఫోటోలూ ఆ ఫ్రేములో ఉండడం తనకిష్టం లేదంటే చాలా సులభంగా దాని వెనుకనున్న కొక్కిని తీసేసి ఆ ఫోటోని తీసి పారేయవచ్చు అనే సంగతికూడా అతను మరిచిపోయాడు. మొండిగా తన బలమంతా ఉపయోగించి ఆ ఫ్రేముని కిందకీ మీదికీ మెలిదిప్పుతూ దాన్ని రెండు భాగాలుగా ఎడబాటు చేసాడు. ఆ తొందరలో అందులోనున్న మేకు తన చిటికినవేలుని తాకి రక్తం కారడం అతను గమనించలేదు.

ఈ గడబిడలో తన చెయినుంచి జారి నేలవాలిన కవరుని వెతికి, దాన్ని మంచం అడుగునుంచి తీసాడు. కిటికీద్వారా వచ్చే వెలుతురులో ఆ కవరుని ఎత్తి పరిశీలించాడు. అందులో - మడతపెట్టినట్టు, ఏదో నీడలాగ - ఒక ఉత్తరం కనిపించింది.

'నేనిది ఎందుకు చదవాలి? కోకిల నన్ను వదలి వెళ్ళిపోయిందని తెలుసుకోవాలని నేనీ ఉత్తరం చదివితీరాలా? ఆమె ఎక్కడికి వెళ్ళిందని ఈ ఉత్తరం చెప్తోందా? అది ఎక్కడికి వెళ్తే నాకేం?' అని ఆలోచిస్తూ అనంతరామన్ ఆ కవరుని తేఱిపార చూసాడు.

దానిమీద 'మిస్టర్ అనంతరామన్' అనే పేరు మాత్రం ఉంది.

'మిస్టర్ అనంతరామన్ . . . ' గరగరమని సద్దుతో తన పేరుని ఒక సారి తనే వల్లించుకుంటూ అతను ఆ ఉత్తరంని విసిరి పారేసాడు; అది ఎక్కడ వెళ్ళి పడిందని లెక్కచెయ్యకుండా అదే వేగంతో తన షర్టుని విప్పి పారేసాడు.

తనకెందుకు ఇంత కోపం, చికాకు? కోకిల అతన్ని వదిలి వెళ్ళిపోయిందనా? 'అలాగేంకాదు!' అని తనకి తనే రూఢీ చేసుకున్నట్లు, తన భావనలు సవరించుకున్నట్టు ఒక కూని రాగం పాడుకుంటూ వంటగదికి నడిచాడు.

కాని అలాగ వెళ్ళినప్పుడు తనకి ఎటువంటి సుఖ సంతోష సమయాల్లోనూ కూనిరాగం పాడే అలవాటు లేదని గుర్తుచేసుకున్నవెంటనే అతను గభీమని నోరు మూసుకున్నాడు.

వంటగదిలో అల్మారానుంచి ఒక ఫ్లాస్క్ తీసి చూసాడు; అది ఖాళీగా ఉంది. దాని ప్లాస్టిక్ మూతతో కొళాయినుంచి నీళ్ళు నింపి కొంచెం తాగాడు. వలకన్ను వేసిన ఇంకొక అటకలో ఉన్న బిస్కట్ టిన్ను అందుకొని మళ్ళీ Dressing Table ఉన్న గదికి వచ్చాడు.

బిస్కట్ టిన్నుని మేజామీద పెట్టి గభీమని పక్కనేవున్న రేడియోలో ఏదో విందామని చాలా సేపు మీటని నొక్కుతూ కాలం గడిపాడు. సంగీతంకి బదులు చిరాకు పుట్టే సందడి వినబడుతోందని విసుగ్గుంటూ రేడియో ఆపేసాడు. మరేం చెయ్యాలో తెలియక మంచంమీద ఎక్కి కాలుమీద కాలు వేసుకొని కూర్చున్నాడు. ఒక సారి పెద్ద నిట్టూర్పు వదిలాడు. గభీమని ఏదో ఆత్మజ్ఞానం - ఒక పెద్ద నవ్వు! 'So, Everything is over!' అని సణుక్కుంటూ రెండు చేతులతో మొహం తుడుచుకున్నాడు.

జరిగిన సంఘటనవలన తనకెటువంటి బాధా, విచారం లేనట్టూ, తను నిజంగా సంతోషమే అనుభవిస్తున్నట్టూ నమ్మడానికి అతను చాలా శ్రమపడ్డాడు.

'ఇదొక గడచిన విచారణ' అని నేను రాజీ పడవలసిందే! కాని దాన్ని నిమ్మళంగా, అరమరగా పరిశీలించాలి!' అని అతను నిర్ణయించాడు. మంచంమీదే పడుక్కొని, రెండు చేతులని తన మెడ కింద వొనిచ్చి గతించిన పది సంవత్సరాల దాంపత్యంలోని తను అనుభవించిన ఘర్షణలు, పోట్లాటలు - సులభంగా, తన భావావేశంలో ఎటువంటి తత్తరపాటు లేకుండా - ఆరసించడానికి సిద్ధమయ్యాడు.

దానికి దాడిగా తను ఇంతకుముందు పారేసిన ఆ కవరు గుర్తుకి వచ్చింది.

తనలాగే కోకిలకూడా ఇవన్నీ ఆలోచించే ఆఖరికి ఆ త్తరం రాసివుంటుంది అనే భావన రాగానే అతనికి ఆ ఉత్తరం జ్ఞాపకం వచ్చింది. కాని అందుకోసం దాన్ని వెతికి, అందులో ఏముందో చదివి కోకిలని గౌరవించడానికి అతను సిద్ధంగా లేడు.

అందువలనే ఆమె ఆ ఉత్తరంలో ఏమిటి రాసివుంటుందని ఊహించడానికి అనంతరామన్ తొందరపడ్డాడు.

'నేనెందుకు ఇక్కడనుంచి వెళ్ళిపోవాలని నిర్ణయించాను?' అని కోకిల వివరంగా అందులో రాసిందేమో?

'నన్ను త్యజించడానికి మీకు ధైర్యం లేదు! ఆ ధైర్యం నాకుందని మీరు సంతోషించండి!' అని చమత్కారంగా తన బాధ్యతని నాకు అంటగట్టిదేమో?'

లేకపోతే, ఇవన్నీ కాకుండా 'ఆ బీరువాలో అది ఉంది', 'ఈ పెట్టెలో ఇది ఉంది,' అని ఈ పది సంవత్సారల దాంపత్యంలో తను బాధ్యత వహించని సంగతుల జాబితా ఆ కవరులో ఉందేమో?

లేకపోతే . . .

'నా భావనలన్నీ తోసిపారేసి, నేను నిజంగానే మండిపడాలని . . . ఒక వేళ 'వాడి'గురించి, భవిష్యత్తులో తన తీయని కలల  గురించి రాసిందేమో?' అని ఆలోచించాడు.

ఎది, ఎలా ఆలోచించినా ఆఖరికి అతని ఊహలో 'నేను 'వాడి 'గురించి అనుమానించినదే నిజం కాబోలు !' అనే అనుమానం చోటుచేసుకుంది.

తన సంసారం ఎన్నెన్నో పరివర్తనలకి గురి అయి ఆఖరికి ఇలాగ కూలిపోయిందనే ఆలోచన రాగానే అనంతరామన్ కళ్ళు బాగా తడిసిపోయాయి; రెండు చెవులు అంచుల్లోనూ  కన్నీరు కారింది. భరించలేని బాధతో తలగడలో తన నెత్తిని ఒత్తుకొని వెక్కి వెక్కి ఏడ్చాడు. తలగడ బాగా తడిసిపోయి తేమగా మారినప్పుడు అతనికి ఒక విధమైన సుఖం కలిగింది. ఈ పది సంవత్సారల దాంపత్యంలో దొరకని సుఖం అందులో అతను అనుభవించాడు. 'ఇప్పుడు నేను ఏడుస్తున్నది కోకిల కనికరంకోసం కాదు, ఈ ఎడబాటుకోసం కాదు! ఇది నా స్వతంత్రత కోసం!' అనే నమ్మకం వలన అతను  హోరున ఏడ్చాడు.

వ్యర్థమైన తన జీవితంలోని చాలా ముఖ్యమైన పది సంవత్సరాలు గుర్తుచేసుకొని అతను ఏడ్చాడు; ఆ అబద్ధం గురించి వాపోతూనే ఏడ్చాడు; ఏడుస్తూనే అలాగే నిద్రపోయాడు.

గభీమని కళ్ళు తెరిచి అతను నిద్రలేచినప్పుడు గదంతా చీకటిమయంగా ఉంది. గోడమీద గడియారం చూస్తే సమయం ఏడు గంటలని తెలిసింది.అతను లేచి వెళ్ళి దీపాలు ముట్టించాడు. బాగా ఆకలేస్తోంది; అతను ఆలోచించాడు: 'ఇలాగే ఆకలితో నిద్రపోవడమా? లేక బయటకి హోటలుకి వెళ్ళడమా?' అని.

ఇంతలో పొరుగింటి బాలిక "మీకోసం మేం తీసుకున్నపాలుని ఉడకబెట్టాలా వద్దా?" అని అడుగుతూ వచ్చింది. 'నా కోసం వాళ్ళకెందుకు బాధ?' అని ఆలోచిస్తూ అనంతరామన్ "వద్దు! నేనే చూసుకుంటాను!" అని వార్త పంపించాడు; ఆ బాలిక వెళ్ళిన తరువాత పది సంవత్సరాలుగా తన కాపురంతో పరిచయమున్న ఆ ఇంటి దంపతులని గుర్తుచేసుకోగానే అతనికి కొంచెం భయం కలిగింది.

పది సంవత్సరాలు ముందు తనూ, కోకిలా పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించగానే, కాపురంకోసం ఈ ఇంటికి రావడం అతను గుర్తుచేసుకున్నాడు.

ఆ ఇంటి యజమాని వీరిద్దరిని చూడగానే దంపతులని అపార్థం చేసుకొని "పిల్లలు ఎంతమంది?" అని అడగ్గానే కోకిల సిగ్గుతో ఎఱ్ఱబడిన తన మొహం భర్త వీపు వెనక దాచుకుంది; ఆ శృంగార దృశ్యం ఇప్పుడు అనంతరామన్ జ్ఞాపకం చేసుకున్నాడు.

ఆవిడ ప్రశ్నకి జవాబుగా తమ వివాహ ఆహ్వాన పత్రిక అందించగానే ఆ ముత్తైదువ వారిద్దరిని నిలుచోబెట్టి అన్నారు: "మీరు ఈ ఇంటికి కాపురం రావడం మంచి ముహూర్తం. వినండి, ఇది నా దీవెన! వచ్చే సంవత్సరంలో మీకు సంతాన భాగ్యం కలుగుతుంది."

ఆ మాటలు జ్ఞాపకం రాగానే అనంతరామన్ నిట్టూర్పు వదిలాడు.

'ఇప్పుడు మా దాంపత్యం కూలిపోవడం ఆవిడకి తెలిస్తే?' అనే ఆలోచన రాగానే ఆవిడ ఎంత బాధపడుతుందని అతనికి బోధపడింది. 'ఇతరుల తృప్తికోసం కొన్ని కష్టాలని భరించుకోవడంలో కలిగే సుఖం నేను కోల్పోయాను . . . ఇవన్నీ ఆలోచించక వట్టిపోయిన హృదయంతో కోకిల నన్ను వదలి వెళ్ళిపోయింది . . .

ఇదెలా దానికి సాధ్యమైంది? ఆవిడతో ఏమైనా చెప్పిందేమో? ఒక వేళ ఆవిడకి అన్నీ తెలుసునేమో? ఛీ, ఛీ . . . ఆవిడకి తెలియదు, తెలియకూడదు! . . . ఈ ఇంటికి నేనూ, కోకిల చేరికగా వచ్చాం, అలాగే ఇప్పుడు మేం జతగా నిష్క్రమించి, మా జీవితం వేరే వేరే దారుల్లో సాగుతే ఎంత బాగున్ను!' అని అతను వాపోయాడు.

"నేనే పాలు వేడిచేసేసాను . . . మా అమ్మాయి కింద పడేస్తుంది . . . ఖాళీ ఫ్లాస్క్ ఇక్కడ ఉందా?" అని అడుక్కుంటూ వంటగదివరకూ పొరుగింటి ముత్తైదువ వచ్చేసారు.

ఫ్లాస్క్ లో పాలు పోసి మూత మూసినతరువాత ఆవిడ గడప దాటి వెళ్ళే ముందు - మంచంమీద కూర్చున్న అనంతరామన్ని- చూసి "మీరు టోంచేసేరా? మీకు వేడిగా రెండు దోశలు పంపిస్తాను," అని చెప్పి అతని జవాబుకి ఆగకుండా వెళ్ళబోతూ, మళ్ళీ ఆగి "కోకిల ఎప్పుడు వస్తుంది?" అని అడిగారు.

"తెలీదు, వాళ్ళ ఇంటికే వెళ్ళింది . . . దానికి ఇష్టం వచ్చినప్పుడు రానీ! . . . " అన్నాడు అనంతరామన్; కోకిల అక్కడికి వెళ్ళివుండదు అని తనకి నిశ్చయంగా తెలిసినా కావాలనే ఆ అబద్ధం చెప్పాడు.

"అవును . . . బాగా చెప్పారు . . . ఇన్ని సంవత్సరాల తరువాత మనసులు మారడం మంచిదేకదా? ఏది ఎలాగైనా చుట్టరికాలు అంత సులభంగా తగ్గిపోవుగా!" అని తనకి తనే చెప్పుకుంటూ ఆవిడ వెళ్ళారు.

ఇప్పుడే అనంతరామన్ కోకిల ఎక్కడకి వెళ్ళివుంటుందని ఆలోచించాడు.

తప్పకుండా ఆమె పుట్టినిల్లుకి వెళ్ళివుండదు; ఒకసారి వెళ్ళివచ్చిన తరువాత తనకేర్పడిన కటువైన అనుభవం భర్తకి కోపంతో ఆమె చెప్పలేదూ? అదిప్పుడు అనంతరామన్ గుర్తుచేసుకున్నాడు.

తనమూలంగా కోకిల చాలా సుఖాలు పోగొట్టుకుంది అని అతనికి తెలుసు; ఇప్పుడు ఈ దర్శనంతో కోకిల మనసులో మళ్ళీ ఆహ్లాదం చోటుచేసుకుంటుందని అతను ఎదురుచూసాడు.

'కోకిలకి సంతోషమా?'

ఆమె తిరిగి రాగానే అందులోనూ ఆమెకి అపజయం అని కోకిల మొహం చూడగానే అతనికి తెలిసిపోయింది. పది సంవత్సరాల తరువాత తన తల్లిదండ్రులని

కలుసుకున్న అనుభవం ఆమె తనకి పరవశంతో, వివరంగా చెప్తుందని అతను ఎదురుచూసాడు. కాని కోకిల ఎక్కడికో వెళ్లి తలవంపుతో తిరిగివస్తున్నట్టు మౌనంగా, తన గదికి వెళ్ళి ఒంటరిగా కూర్చోడం చూసాడు.

'What's wrong? ఏమైంది, దీనికి?" అని గొణుక్కుంటూ అనంతరామన్ ఆమె గదిలోకి ప్రవేశించాడు. అవాంఛితగా ఏదో జరిగిందని తెలిసినా దాన్ని బయటకి తెలియపరచక ఆమెను అడిగాడు: "సరే, నువ్వు వెళ్ళి వాళ్ళని చూసావ్, వాళ్ళెప్పుడు ఇక్కడకి వస్తారు?"

కోకిల ఒక నిమిషం అతని మొహం చూసింది; పెదిమలు మాత్రం కదిలాయి, మరేం చలనం లేదు. దృఢమైన కంఠధ్వనితో ఆమె మాటాడింది: "వాళ్ళు ఇక్కడికి రారు. నేనూ ఇక అక్కడికి వెళ్ళను."

"They didn't treat you well? ఎందుకు? ఏమైంది?"

"అవన్నీ సరిగ్గానే చేసారు . . . పొరబాటు నాదే . . . నేను ఒంటరిగా వెళ్ళివుండకూడదు."

"నువ్వేమంటున్నావ్? అసలు ఏం జరిగింది?"

ఆ ఘటనగురించి మాటాడానికే ఇష్టం లేక, మొహం ముడుచుకొని, విసుగ్గుంటూ కోకిల చెప్పింది:

"అంతా అయోమయంగా ఉంది. . . నన్ను గౌరవించాలంటే నేను మరొక ఇంటికి వెళ్లివచ్చాననే రీతిలో వాళ్ళు నాకు మర్యాద చూపాలి. అందువలన ఆ ఇంటికి ఇకెప్పుడూ మీరు లేకుండా వెళ్ళకూడదని నిశ్చయించుకొని నేను వచ్చేసాను. మనిద్దరినీ రమ్మని వాళ్ళు పిలవనీ, అప్పుడు మనం వెళ్గాం."

ఆమె మాటలు విని అక్కడ ఏం జరిగివుంటుందని అనంతరామన్ ఆలోచించాడు; అంతలోనే కోకిల ఏడ్చే కళ్ళని తన చీర కొనతో తుడుచుకొని, వెక్కుతూ వివరించింది:

"అమ్మ మాత్రం నేను గడప దాటి వీధిలోకి దిగినప్పుడు నన్ను మెల్లగా "నువ్వైనా తరచుగా వస్తూ పోతూ ఉండు . . . నువ్వు మళ్ళీ ఎప్పుడు వస్తావ్?" అని అడిగింది. నాకెంత కోపం వచ్చిందో తెలుసా? . . . అవును, అమ్మదగ్గరే నేను

నా కోపం చూపించగలను . . . 'లాంఛనప్రాయంగా మా ఇద్దరినీ పిలవండి, అప్పుడే వస్తాం అని గట్టిగా చెప్పి వచ్చేసాను!"

"ఎందుకలా చెప్పావ్?"

"చెప్పాను, ఇంకా ఏమేమో చెప్పాలనుకున్నాను . . . పది సంవత్సరాల తరువాత నేను అన్నీ మరిచిపోయి వెళ్ళాను. 'నువ్వు ఒంటరిగా వచ్చావా? మీ ఆయన రాలేదా? ఇక వచ్చేటప్పుడు అతనితో నువ్వు రావాలి!" అని అంటారనుకున్నాను . . . వాళ్ళు ఏమీ అనలేదు . . . వాళ్ళకి మనమీద అభిమానం లేదని తెలిసిపోయింది, మరి మనం ఎందుకు వెళ్ళాలి?"

"Nonsense! నాకోసమా ఇదంతా? వాళ్ళు పిలుస్తే నేను వచ్చేస్తానా?"

అతని మాటల్లో చొరపడుతున్నట్టు కోకిల మాటాడింది: "అది వేరే సంగతి. వాళ్ళు మిమ్మల్ని గౌరవించాలని నేనన్నది మీకోసం కాదు. వాళ్ళు మిమ్మల్ని గౌరవించినప్పుడే నన్ను గౌరవించినట్టు అర్థం!" అని ఆమె అన్నప్పుడు అనంతరామన్ తన సహజ గుణం వెంటనే తెలియజేసాడు. "అంటే నీకు నేనంటే అంత గౌరవం అన్నమాట!" అని ఎత్తిపొడిచాడు.

"అవును, మీకెందుకా అనుమానం? మనలో ఎన్నో ఉండవచ్చు, ఇతరులకి వాటితో ఏ సంబంధమూ లేదు. ఇది నాలుగు గోడలమధ్య నేను అల్లాడుతున్న నా సొంత ప్రశ్న! నోరు తెరిచి నేను అది ఎవరికీ చెప్పను, తెలిసిందా? మనిద్దరం పెళ్ళిచేసుకున్నాం, అది సరేనా లేక తప్పా అనేది మన ఇద్దరి ప్రశ్న, ఇతరులకి దానితో ఎటువంటి సంబంధమూ లేదు!" అని ఆమె అన్న మాటలు అనంతరామన్ ఇప్పుడు గుర్తు చేసుకున్నాడు.

కోకిల తప్పకుండా తన పుట్టింటికి వెళ్ళివుండదని అతను దృఢంగా నమ్మాడు.

'అంటే . . . మరెక్కడ వెళ్ళివుంటుంది? 'వాడి'తో . . . 'వాడు' కైరోకి వెళ్ళిపోయాడే! . . . అబ్బా, ఏం పిచ్చి ఆలోచనలు!' అని అతను కలవరపడుతూంటే పొరుగింటి ముత్తైదువ వచ్చి అతనికి ఒక ప్లేటులో రెండు దోశలు అందించారు. "కొంచెం ఆగండి! తాగడానికి నీళ్ళు తెస్తాను!" అని చెప్పి ఒక గ్లాసులో నీళ్ళు అందిస్తూ ఆవిడ మళ్ళీ అన్నారు: "ఈ రెండు మూడు రోజులూ

మీరు హోటల్లో భోజనం చెయ్యవద్దు! ఇక, కోకిల వచ్చేవరకూ మా ఇంట్లోనే మీ భోజనం!" అని చెప్పి అతని జవాబుకి కూడా కాచుకోకుండా బయటకి నిష్క్రమించారు.

ఆమెగురించి ఎటువంటి జ్ఞాపకం లేని ఒక సమయంలో - మూడురోజుల తరువాత - ఒక ఉదయం అనంతరామన్ టాక్సీలో ఆఫీసుకి వెళ్తున్నప్పుడు - కిక్కిరిసిన ఆ నగర వీధుల్లో కాలిబాటలో నడిచే మనుషులని చూసినప్పుడు కోకిలని చూసాడు. ఆ పెద్ద వీధిని దాటడానికి గీయబడిన బాటలో పాదచారులు త్వరగా నడిచినప్పుడు టాక్సీ ఆగింది; అప్పుడే ఒక చెయిలో ప్లాస్టిక్ సంచితో, కూలింగ్ గ్లాస్ ధరించి - అతన్ని పెళ్ళి చేసుకొనే ముందు తను ఒక Receptionist గా ఉద్యోగం చేసినప్పుడు కనిపించిన ఆ భంగిమలో ఇప్పుడు - కోకిలని చూసాడు. అలా చూసిన కొన్ని నిమిషాల తరువాతే ఆమెగురించి ఆలోచించాడు. ఆమెని వెంటనే పిలవాలనో, లేక ఆమెతో మాటాడాలనో అతనికి తోచలేదు. కోకిల, తక్కిన పాదచారులు ఆ కాలిబాట గడచిన తరువాతనే గబీమని "డ్రైవర్, టాక్సీ ఆపు!" అని గట్టిగా అరిచాడు. డ్రైవర్ చికాకుతో తిరిగి చూసాడు. వీడు తోవలో పోతున్న ఒక స్త్రీని తేరిపాటి చూడడం గమనించి డ్రైవర్ అపార్థం చేసుకొని తనలో నవ్వి ఊరుకున్నాడు. టాక్సీ వెళ్తూనే ఉంది. కోకిల జనసమూహంలో కలిసిపోయింది, కాని అనంతరామన్ దృష్టి ఆమె మీదనే ఉంది. "I say, stop here!" అని అనంతరామన్ గట్టిగా అరిచాడు.

"సార్, ఇక్కడ టాక్సీ ఆపడం వీలుకాదు!" అని జవాబు చెప్పి డ్రైవరు టాక్సీని వేరే దిశలో మార్చి నడిపాడు. ఇంతలో కోకిల అనంతరామన్ చూపులోనుంచి మాయమైపోయింది; ఆఖరికి డ్రైవరు ఒక bus stop దగ్గర టాక్సీని ఆపాడు.

చెయిలోని చిల్లరని తొందరగా లెక్కచెయ్యకుండా డ్రైవరుకి అందించి, అనంతరామన్ ఎదుట వచ్చిన జనసమూహంని రలాయించుకొని, ఆ పొటుగాటి వీధిలో పరుగెత్తాడు;ఒక ఫర్లాంగు దూరంలో కోకిల ఎర్రరంగు చీరని సరిపోల్చుకొని నడుస్తూంటే అతని మనసులో ఆ ఆలోచన లేచింది: 'కోకిల ఎక్కడకి వెళ్తోంది? ఏదైనా ఉద్యోగం కోసం వెదుకుతోందా?' వెంటనే అతనికి ఆమెపై జాలి కలిగింది. ఇరవై అడుగుల దూరంలో ఆమె దగ్గరపడగానే తన నడక వేగం తగ్గించుకున్నాడు.

పరగెత్తుకొని వచ్చిన అలసట, ఉద్వేగం వలన, అతనికి చెమట పట్టేసింది. కంఠంలోనుంచి బిగువుగా వేలాడుతున్న Tie కింద చెమట అత్తుకుంది. కోటు పాకెట్టునుంచి రుమాలు తీసుకొని అనంతరామన్ మొహాన్ని బాగా తుడుచుకున్నాడు. ఇక ఆమెను ఎలా కలుసుకోవడం అనే ప్రశ్నతో మెల్లగా నడిచాడు. అతని బూట్సునుంచి వచ్చే శబ్దం తన వెనుక రావడం కోకిల కూడా గ్రహించింది. అది తన దగ్గరకి వస్తున్నపాదాల శబ్దమే అని తెలియగానే ఆమెకూడా చటుక్కున తిరిగిచూసింది.

చాలా దూరం వేరుగా అయిపోయిన ఇద్దరూ ఇప్పుడు చటాలున ప్రత్యక్షంగా ఒకరినోకరు చూసుకొని దిమ్ముపట్టినట్టు నిలబడ్డారు.

ఆమె తన కూలింగ్ గ్లాసుని తీసి చీరకొనతో తుడుచుకుంది; అతను మళ్ళీ రుమాలుతో తన మొహం తుడుచుకున్నాడు. ఆ తరువాత ఇద్దరూ కలిసి మౌనంగా నడిచారు. ఇద్దరి మనసులోనూ పరస్పరం ఒకరిగుంచి ఇంకొకరు ఏమనుకుంటున్నారో అనే భావనే అధిగమించింది.

పాతరోజుల్లో వాళ్ళిద్దరూ ఒకే ఆఫీసులో పనిచేసినప్పుడు అలవాటుగా టీ తాగాలనే నెపంమీద గంటలకొలదీ కాలక్షేపం చేసే ఆ రెస్టారెంట్ ఇప్పుడు దారిలో కనిపించగానే అనంతరామన్ ఆగాడు; స్నేహభావంతో ఒక స్త్రీని అడుగుతున్నట్టు మర్యాదగా అడిగాడు:“How about some tea?”

ఆమె తన ఏకీభావం తెలియజేయాలని అనుకున్నా ఏదో అన్యపురుషుడుతో మెలుగుతున్న అలవాటుకి లోబడినట్టు మరేం అనక అతని వెంట నడిచింది.

ఆ రెస్టారెంట్ ఒక భవనం మేడమీద ఉంది. వాళ్ళిద్దరూ ప్రవేశించినప్పుడు హాలంతా ఖాళీగా కనిపించింది. అక్కడికి వచ్చే అభిమానులు - జనం జాగా రద్దీగా ఉన్నప్పుడుకూడా - తమ ఏకాంతం రక్షించుకోడానికి - మేజాలన్నీ చాలా ఎడబాటులో పరచి ఉంటాయి. ఇప్పుడు ఆ పెద్ద హాలుని  మౌనం పూర్తిగా ఆవరించుకుంది. హాలు చివరన తెల్ల దుస్తులతో ఒక వెయిటర్ మాత్రం కనిపించాడు. క్రమ క్రమంగా కనిపించే No Service నోటీసు బోర్డులు దాటి అనంతరామన్, కోకిల ఒక మూలవున్న మేజాలో ఒకరికోకరు  ఎదురుగా కూర్చున్నారు. కోకిల తన ప్లాస్టిక్ సంచిని మేజామీద ఉంచినప్పుడు అందులో

ఏముందని అనంతరామన్ గమనించాడు. ఒక పేరు పొందిన తమిళ పత్రిక, అనంతరామన్ ఉప సంపాదకుడుగా పనిచేసే ఆంగ్ల పత్రిక అనుబంధం కనిపించాయి. ఆ అనుబంధం నాలుగు మడతలతో ఉంది; ఒక పడతమీద కనిపించే వాక్యం చదివి అందులో తను ఐకమత్యం గురించి రాసిన వ్యాసం ఉందని అనంతరామన్ తెలుసుకున్నాడు.

'దాన్ని కోకిల తప్పకుండా చదివి ఉంటుంది. నేను రాసిన - *'ఇంటిలో ఒక మనిషిగా, వీధిలో ఇంకొక మనిషిగా, తనకు తానే వేరొక మనిషిగా . . .'* అనే వాక్యాల్లో ఆమె నన్ను సరిపోల్చుకుందేమో?' అని అనంతరామన్ తలవొంచి ఆలోచించాడు. అప్పుడే సర్వరు వచ్చి తన పక్క నిలబడడం గమనించాడు.

"Tea and Biscuits!" అని అంటూ అనంతరామన్ తలెత్తాడు. సర్వరు నిష్క్రమించాడు.

తన రెండు అరచేతులూ రుద్దుకుంటూ, ఎదుటవున్న కోకిలని అనంతరామన్ దీర్ఘంగా చూసాడు; ఆమె కళ్ళు ఆ మేజా గాజు పైతట్టునీ, దాని అడుగున కనిపించే తేయాకు ప్రకటనలని అపేక్షతో చూస్తున్నాయి.

"It's all right . . . I want to thank you! . . ." అని అనంతరామన్ గభీమని ఆరంభించాడు. "నీ వలన మన ప్రశ్నలకన్నీ ఎంత సులభంగా ఒక జవాబు దొరికిందో చూసావా? నీకున్న ధైర్యం, దృఢ సంకల్పం నాకు లేదని నాకు సిగ్గుగా ఉంది. నీ నిర్ణయంతో నేను ఏకీభవించినా దాన్ని నువ్వు అమలు చేసే విధం నాకు విరుద్ధంగా ఉంది. ఇద్దరు కలిసి ఒక వ్యాపారం ఆరంభించారనుకో, అందుకు తగిన నియమాలు పాటించుతేనే వాళ్ళు దాన్ని ఆరంభించగలరు. ఆ తరువాత ఆ ఒడంబడికని మార్చుకోవాలంటే అందుకు ప్రత్యేకంగా కొన్ని శాసనాలున్నాయి. ఆ ఇద్దరిలో ఎవరో ఒకరు - ఆ శాసనాలేవీ లెక్క చెయ్యకుండా - ఎన్ని కారణాలున్నా సరే - ఆ ఒడంబడికని మీరితే - అది నేరమౌతుంది. వాళ్ళిద్దరూ రాజీపడి, Handshake చేసుకొని, మర్యాదగా వేరే వేరే దారిలో వెళ్ళాలి; అదే మనం మర్యాదస్థులుగా చెయ్యాలని నేను అంటున్నాను. అటువంటి నాగరిక ప్రవర్తన ఒక వ్యాపార ఒడంబడికలో ముఖ్యమంటే ఇక దాంపత్య జీవితంలో అది ఎంత ప్రధానం అని వేరే చెప్పాలా?"

ఒక ట్రేలో తేనీరూ, బిస్కట్లూ, తెచ్చి మేజామీద పెట్టి సర్వరు వెళ్లిపోయాడు; అతను హాలులో తన కళ్ళనుంచి అదృశ్యమయ్యేవరకూ అనంతరామన్ వాడిని చూసాడు. అతను మళ్ళీ తన దృష్టిని ఆమెమీద మళ్ళించినంతవరకూ కోకిల తల వంచుకొని కూర్చొని ఉంది. ముందునించి ఆమె మనసు కలవరబడుతోంది: 'దేవుడా, ఇతను నన్ను ఏం అడుగుతారో, ఇక్కడ ఏ అసభ్యత జరుగబోతుందో?' అని భయపడుతూ ఉన్న కోకిల 'నువ్వు ఈ మూడు రోజులు ఎక్కడున్నావ్?' అనే మొదట అడుగుతాడని ఎదురుచూసింది. 'ఆ ఉత్తరం చదవగానే తనకి అలవాటైన క్రోధంకి లోబడి అతను వీధిలో గొంతు చించుకొని అరుస్తాడు, దానికి బదులు ఈ హోటలే మంచిది!' అనే భావనతో ఆమె ఈ రెస్టారెంట్ లో ప్రవేశించింది.

'కాని, ఆశ్చర్యం, అతను ఎంత బాగా, మెల్లగా, నిమ్మళంగా, నాగరిగత గురించి మాటాడుతున్నారు!' అని వింతగా కోకిల అతన్ని చూస్తూనే ఉంది. అతని చూపు తనమీదుందని గ్రహించి, తనకి పరిచయం లేని మగవాడిని చూసినట్టు తల వంచుకుంది. ఆమెను చూస్తూనే అనంతరామన్ మాటాడాడు:

"గభీమని నన్ను డెల్లీకి బదిలీ చేసేసారు. దానిగురించి నా అధికారులు నాతో సంప్రదించారు. నేనూ ఒప్పుకున్నాను. నిజం చెప్పాలంటే ఈ transfer నాకు సంతోషంగా ఉంది; నేను ఒక ఇక్కట్టునుంచి తప్పించుకున్నాను!"

కోకిల గోరు కొరుక్కుంటూ అతన్ను చూసింది.

ఇప్పుడే ఇద్దరూ ఒకరినోకరు దీర్ఘంగా చూసుకున్నారు. అనంతరామన్ సందేశం వ్యవహార రీతిలో సాగింది:

"వచ్చే గురువారం నేను డెల్లీకి వెళ్తున్నాను. నాకున్న విచారం ఒకటే ఒకటి. పాపం, మన పొరుగింటి ఇల్లాలు . . . ఇప్పుడు దారిలో నిన్ను చూసినతరువాత నీతో మాటాడకుండా నేను వెళ్ళిపోవాలనుకున్నాను, కాని ఆవిడ జ్ఞాపకం రాగానే నా మనసు మార్చుకున్నాను . . . నేను కడుపు నిండుగా భోజనం చేసినప్పుడెల్లా నాకు ఆవిడే గుర్తుకి వస్తారు . . . చూసావా, ఈ ప్రపంచంలో, కొన్ని సమయాల్లో, ప్రేమానురాగాలు ఎంత సులభంగా మనకి దొరుకుతాయని? నువ్వొకరోజు అన్నావ్: 'మనలో నాలుగు గోడలమధ్య ఎన్నో ప్రశ్నలు ఉండవచ్చు, ఇతరులకి వాటితో ఏ సంబంధమూ లేదు!' అని. నీకది జ్ఞాపకముందా? మనిద్దరం శాశ్వతంగా వేరైపోతాం

అన్న సంగతి వింటే ఆవిడ భరించలేరు. ఆవిడ మనిద్దరినీ కలిసి చూసారు. ఆ ఇంటిలో మనం దంపతులుగా కాలం గడిపాం. అలాగే మనం ఆ ఇంటినుంచి నిష్క్రమించడం మంచిది. ఆ తరువాత సముద్రం వంటి ఈ జనసమూహంలో మనిద్దరం వేరే వేరేగా ఎలా జీవించినా లేక బాధపడినా ఎవరూ లెక్కచెయ్యరు! Who cares? . . . Sorry! నాకెవరూ లేరని నేనంటున్నాను! ఆవిడ తృప్తికోసం నేను నీ దగ్గర . . . I want a favor, please!"

"ఇప్పుడు నేనేం చెయ్యాలి?"

చాలా సేపు మౌనంగా ఉండడంవలన కాబోలు ఆమె కంఠధ్వని పగిలినట్టనిపించింది.

"ఇదేం ప్రశ్న? మనం ఎది చేసినా అందులో ఒక నియమం ఉండాలికదా? అదే నువ్వూ చెయ్యాలి. ఇది నేనేదో అధికారం చెలించడంవలన కాదు . . . న్యాయతగా మనం divorce చేసుకోవాలి. అంతవరకూ నువ్వు భారం మొయ్యాలని కాదు. నాలుగురోజుల తరువాత నేను వెళ్ళిపోతాను. ఆ తరువాత మనకి వసతిగా ఉన్నప్పుడు దానిగురించి మనం ఆలోచించుదాం . . . కాని ఇప్పుడే నువ్వు చెయ్యవలసిన పని ఒకటుంది . . . మన పొరుగింటి ఆవిడ ఒక చిన్న ప్రపంచం అనుకో. నువ్వు పుట్టినిల్లుకి వెళ్ళావని ఆవిడ మనసులో ఉంది. ఈ మూడురోజులూ ఆవిడ నీగురించే నన్ను పదే పదే అడుగుతున్నారు. నేనూ మూడురోజులుగా ఎన్ని అబద్ధాలు చెప్పగలను? అందుకే . . . " తను ఊరుకి వెళ్ళేవరకూ కోకిల తనతో వచ్చిఉండాలని అడగడానికికూడా అనంతరామన్ జంకాడు. తనింతసేపూ మాటాడిన తరువాత కోకిల అందుకు తనంతట తానే ఏకీభవిస్తుందని అతను ఎదురుచూసాడు; ఆమె మౌనంగా తలవొంచడం చూసి స్నేహభావంతోనైనా కోకిలకి తనతో ఒద్దిక లేదని గ్రహించి బాధపడ్డాడు.

"నేను నిన్ను బలవంతపెడుతున్నాను, అందుకు క్షమించు! మనిద్దరికీ సంబంధించిన ఈ మార్పు మనకి అనుకూలంగా ఉండాలని నా ఆశ. మన divorce గురించి ఆవిడకి తెలియవద్దని నా ఉద్దేశం. ఎందుకంటే ఇది ఎవరూ కోరతగ్గిన సంగతికాదు. అందుకే నేను తొందరగా ఇక్కడనుంచి పారిపోవాలని నిశ్చయించాను," అని అతను అంటూంటే కోకిల చెయి చాచి "తాళంచెవి ఇవ్వండి!"

అని అడిగింది. "Thank you!" అని అంటూ అనంతరామన్ తన కోటు పాకెట్ నుంచి తాళంచెవి తీసి మేజామీద పెట్టాడు.

ఆమె తాళంచెవిని తీసుకోడం గమనించకుండా అతను రెండు కప్పుల్లో తేనీరు నింపాడు.

తను మౌనంగా తాళంచెవిని తీసుకోవడం చూసి అతను అపార్థం చేసుకుంటాడేమో అనే ముందుజాగ్రత్తతో కోకిల అడిగింది: "మీ ప్రయాణం ఎప్పుడు?" అతను టీ తాగుతూ, కన్నులెత్తి "వచ్చే గురువారం, ఇంకా నాలుగు రోజులే బాకీ. నీకేం భయం వద్దు . . . ఆ తరువాత నువ్వెరో, నేనెవరో?" అని ఆమెకి హామీ ఇచ్చాడు.

** ** **

ఆ ఇంటి మేడకి వెళ్ళేమార్గంలో ఉన్న గోడలోని గూడులో ఒక ప్రమిదె వెలుగుతూ ఉంది.

అనంతరామన్ రెండురోజులుగా ఆఫీసుకు వెళ్ళలేదు. కాని అతను ఇంటిలోనూ లేడు. డెల్లీకి బదిలీ అయి వెళ్ళడానికి ముందు చెయ్యవలసిన కొన్ని ఏర్పాట్లు ఈ రెండురోజులూ చూసుకుంటున్నాడు. అతను ఆఫీసు విందులో పాల్గొని ఇంటికి తిరిగివస్తున్న సమయం అతన్ని చూసి పొరుగింటి ముత్తైదువ తొందరగా తన ఇంట్లోకి ప్రవేశించారు. తన భర్తని చూసి "అదిగో, మీరు వెళ్ళి అతనికి చెప్పండి!" అని ప్రోత్సాహించింది. మేడమెట్లు ఎక్కుతున్న అనంతరామన్ని చూస్తూ ఆమె భర్త "అతను వెళ్ళిపోయారే?" అని అన్నారు. "బాగుంది! అతన్ని పిలవండి!" అని అతని భార్య గద్దించింది. అతను అనంతరామన్ని "సార్!" అని పిలిచారు. అనంతరామన్ మెట్లమీదనుంచి అతన్ని చూసాడు; ఒక పదహారేళ్ళ పడుచు పిల్లలాగ అతని భంగిమని చూసి తనలో నవ్వుకున్నాడు. "అతనే వస్తున్నారు . . ." అని చెప్పి ఇక ఏం చెయ్యాలో తెలియక భార్య ఆజ్ఞకోసం అతను నిలబడ్డారు.

"బాగుంది! . . . అతన్ని రేపు మనింటికి విందుకి రమ్మని పిలవండి . . . నోరు తెరిచి మాట్లాడరేం?" అని ఆవిడ కోపంతో భర్తని నొచ్చుకున్నారు. అతను అనంతరామన్ని చూసి "మా ఆవిడ ఏదో చెప్తోంది . . . రండి!" అని ఆహ్వానించి, లోపలికి వెళ్ళి ఒక కుర్చీని లాగి కూర్చోమన్నారు.

"అవును . . . నేను చెప్తున్నాను! పొద్దున్నుంచి మన ప్లాను మీకు తెలుసుకదా? వెళ్ళి ఆ తలుపు వెనుక దాంకోండి! . . . ఈ ఇంటిలో నేనే మగవాడన్నమాట! . . . 'అతని భార్యని నేను పిలిచేసాను, మీరు అతన్ని పిలవండి!' అని అన్నాను . . . ఇతనేమో 'మా ఆవిడ ఏదో చెప్తోంది . . . ' అని అంటున్నారు . . . మీరు నిలబడతారేం, కూర్చోండి!" అని ఆవిడ అనంతరామన్ని వేడుకున్నారు.

"'మీకు వేరే Engagement ఉందేమో?' అని నేను భయపడ్డాను . . . "

"లేదు. పార్టీలన్నీ ఇవాళతో ఐపోయాయి. రేపంతా, ఇక రైలు ప్రయాణం చేసేవరకూ, ఇంట్లోనే ఉండాలని నా ప్లాను. మూటాముల్లె అంతా dispose చేసేసాను. కాని ఇంకా కొన్ని చిల్లరపనులు బాకీ ఉన్నాయి," అని చెప్పి అక్కడ కూర్చోకుండా అనంతరామన్ మెట్లెక్కి ముందుకు సాగాడు.

గత మూడురోజులుగా ఆ ఇంటిలో వాడుకైన వాతావరణం, ఇంతకుముందు లేని శాంతం చోటుచేసుకున్నాయి. ఆ ఇంటిలో కోకిల ఉందని అతనికి తెలుసు. కాని ఆ ఏ మూల ఆమె పొంచివుందని అతను చూడనేలేదు.

ఎప్పటిలాగే పొద్దున్నే అతని మంచం సమీపంలో కాఫీ ఉంటుంది. అదెలా సాధ్యమో, అతను ఎప్పుడు లేచినా అగి వేడిగానే ఉంటుంది. అతని రాకని ఎదురుచూస్తున్నట్టు బాత్ రూమ్ లో వేడినీరు సిద్ధంగా ఉంటుంది; సబ్బు, tooth brush లో paste కాచుకొని ఉంటాయి. అతను స్నానం చేసి రాకముందే అతని దుస్తులు బీరువానుంచి గెంతివచ్చి అతని అందుబాటులో సిద్ధంగా కనిపిస్తాయి. సరిగ్గా తొమ్మిదిన్నర గంటలకి తనకోసం కాచుకొనివున్న కోకిల, ఆ డైనింగ్ టేబిల్ మీద సిద్ధంగా ఉన్న భోజనం చూసి 'ఆమె ఇక్కడ ఉంది!' అని అతనికి బోధపడుతుంది, కాని ఎప్పుడూ అతను తలెత్తికూడా చూడడు.

ప్రతీ రోజు మొదటి భాగం ఇలాగే గడిచిపోయింది. కాని సాయంకాలం, రాత్రి వేళల్లో మానవ హృదయాలు పోరాటంలోపడి తన్నులాడడం మామూలేకదా? అందువలనే ఇద్దరూ తమ తమ మానసిక క్షోభని ఒంటరిగా అనుభవించారు.

తను మాత్రం అలా పెనగులాడుతున్నట్టు అనంతరామన్ అనుకున్నట్టే కోకిలకూడా బాధపడింది. ఇద్దరూ తమ తమ భావేశాలు తమలో దాచుకున్నారు. వాళ్ళ మౌనంలో మొండితనమే చోటుచేసుకుంది.

ఒక ఇంటిలో నాలుగు గోడలమధ్య రెండు ప్రపంచాలు జీవించడం సాధ్యం అని ఈ మూడు రోజుల్లో అనంతరామన్ తెలుసుకున్నాడు.

అనంతరామన్ తన గదికి వెళ్లి దుస్తులు మార్చుకున్నప్పుడు వంటగదిలో ఉన్నకోకిల ఈ మూడు రోజుల్లో అతనితో మొదటిసారి మాటాడింది:

"రేపు వాళ్ళ ఇంట్లో మనకి విందు అని ఆవిడ మీకు చెప్పమన్నారు."

"అవును . . . నాకూ అతను చెప్పారు . . . " కోకిల తన్ను సూటిగా చూడకుండా ఎక్కడో చూస్తూ చెప్పివుంటుందనే భావనతో అనంతరామన్ కూడా ఆమెను చూడకుండా ఎక్కడో చూస్తూ జవాబు చెప్పాడు.

'మా ఇద్దరిమధ్య ఎందుకీ పగ, ద్వేషం?' అని ఒక క్షణం కోకిల ఆలోచించింది. ఆ విరోధం తగ్గించాలనే ఉద్దేశంతో - ఈ మూడురోజుల్లో కాఫీ, టిఫను తెచ్చి మౌనంగా వెళ్ళిపోయినట్టు కాకుండా - "ఇప్పుడు టిఫను తీసుకుంటారా?" అని అడిగింది.

పది సంవత్సరాలుగా తను వింటూన్న అదే కంఠధ్వని ఇవాళ ఎంత కొత్తగా వినిపిస్తోంది! ఆమె గభీమని తనతో మాటాడుతుందని అనంతరామన్ ఎదురుచూడలేదు;అందువలనే అతనికి ఇప్పుడు ఆశ్చర్యం కలిగింది. ఐతే అందువలన అతనేమో మితిమీరి ఏమైనా కల్పించుకుంటాడేమో అనే భావనతో కోకిల అడిగింది: "మీకివాళ ఆఫీసులో పార్టీ ఇచ్చారు కదూ? అందుకే అడిగాను."

"అవును. నాకు కాఫీ చాలు," అని అంటూ అనంతరామన్ బాత్ రూముకి నడిచాడు.

అతను నడుస్తూంటే కోకిల ఒక నిమిషం ఆతన్ని తేరిచూసింది; ఈ పరిస్థితి ఆమెకి బాధగా కనిపించింది.

'ఇంకా ఒక రోజే బాకీ . . . పది సంవత్సరాలుగా నేను పడిన మానసిక వ్యధకి ఇదేం ఎక్కువ?' అని గొణుక్కొని, నిట్టూర్పు వొదులుతూ వంటగదికి వెళ్ళింది.

ఆమె తెచ్చిన కాఫీ తాగిన తరువాత అనంతరామన్ ఇక రేపటి ప్రయాణంకి మూటలు కట్టడం ఆరంభించాడు.

చాలా రోజులుగా మూయబడి ఆ ఇంటిలో ఉన్న తన తాత ముత్తాదలకి చెందిన ఒక పాత బీరువాని తెఱచి చూడగానే అందులో చాలా వస్తువులు ఎవరికి సొంతం - తనకా, కోకిలకా? - అని తెలియక అనంతరామన్ కలవరపడ్డాడు. ఆ బీరువా లోతట్టులో చింపిగుడ్డలతో చుట్టబెట్టివున్న బొమ్మల్ని ఎవరు తీసుకుంటారు? నూరు సంవత్సరాలముందు కొన్న బొమ్మలతోబాటు గత పది సంవత్సరాలలో తనూ, కోకిల కొన్న బొమ్మలూ ఆ గుంపులో ఉన్నాయి; అతనిప్పుడు ఒక కుటుంబంలోని స్త్రీల సంపదని చూస్తున్నాడు. 'వీటిగురించి నాకేం హక్కు ఉంది?' అని నివ్వెఱపోయాడు.

తనూ, కోకిల పెళ్ళిచేసుకోవాలని నిశ్చయించినవెంటనే అనంతరామన్ తన సొంత ఊరుకి - పాల్ఘాట్టు సమీపంలో ఉన్న ఏదో గ్రామంకి - వెళ్ళి తన పిత్రార్జిత ఆస్తికి చెందిన వీటిని వాళ్ళ అనుమతితో తీసుకువచ్చాడు. అప్పుడు కోకిల ఆ వింత వస్తువులు చూసి ఎలాగ మురిసిపోయింది! 'మా దాంపత్య జీవితంలో ఎంత వైరుధ్యం ఉన్నా ఒక ఇల్లాలుగా కోకిలలో అన్ని లక్షణాలూ ఉన్నాయే! ఈ బొమ్మలపై నాకు హక్కు ఉన్నా, వాటిని నేను ఆమెలాగ కాపాడగలనా?' అని అనంతరామన్ ఆలోచించాడు.

తెఱచిన బీరువా తలుపు మూడకుండా అతను కోకిలని వెతుక్కుంటూ వంటగదికి నడిచాడు. డైనింగ్ టేబిలు దగ్గర కూర్చొని ఏదో చదువుతున్న కోకిల తలెత్తి అతన్ని ఎప్పటిలాగే చూసింది.

"కొంచెం లేచి ఇలా రా . . ." అని అతను చెప్పి తిరగ్గానే కోకిల అతని వెనుక నడిచి వచ్చింది. ఆ గదిలో ప్రవేశించి నేలమీదున్న బొమ్మలు చూడగానే, వాటి మహిమవలన ఎప్పటిలాగే ఆమెలో పరవశం చోటుచేసుకుంది.

ఆమెను సూటిగా చూడకుండా అనంతరామన్ మాటాడాడు:

"ఈ బీరువాన్ని ఏం చెయ్యాలో నాకు తెలీదు. ఇది అమూల్యమైనది. దీన్ని అమ్మకూడదు. మరేం దారి లేదంటే పొరుగింటికి దీన్ని వదిలేద్దాం . . . కాని ఇందులో నీకిష్టమైన వస్తువులున్నాయి . . . నువ్వు పోగుచేసినవి ఉన్నాయి . . .

కావాలంటే ఇవన్నీ నీకే సొంతం . . . లేకపోతే నీకెవి కావాలో వాటిని మాత్రం తీసుకోవచ్చు . . . "

అతని మాటలు విన్నతరువాతే 'నిజంగా ఇదొక పెద్ద ప్రశ్న' అని కోకిల గ్రహించింది.

ఆ గదిలో మరేం మూటాముల్లెలు లేవు. రెండు రోజులుగా అనంతరామన్ నేలమీద Hold All పరచి నిద్రపోతున్నాడు. డైనింగ్ హాలులో ఉన్న టేబిల్, కుర్చీలు, ముందు హాలులో ఉన్న సోఫా సెట్ - ఇవన్నీ - మరుదినం వేలం జరిపిన అతను వచ్చి తీసుకొని వెళ్ళిపోతారు. కాని ఈ బీరువా?

"అవును, నిజం! అతను చెప్పినట్టు అది అమూల్యమైనది, దాన్ని అమ్మకూడదు . . . " అని కోకిలకూడా ఆలోచించింది. కాని, అతను 'నీదీ', 'నాదీ' అని ఏమేమో అంటున్నారే? ఎందుకలా అంటున్నారు?

"నాదనీ, నాకు సొంతమని ఈ ఇంటిలో ఏదీ లేదు!" అని కోకిల ఇంగ్లీషులో చిరచిరలాడింది.

అనంతరామన్ ఆమెను తిరిగిచూసాడు. నిమ్మళంగా మాటాడాడు.

"నా మనసులో ఎటువంటి దుర్బుద్ధి లేగు. మన divorce గురించి మనిద్దరికీ ఎటువంటి మనోవేదన లేదనే నమ్మకంతో నీ సలహా అడుగుతున్నానని నువ్వు తెలుసుకోవాలి. నీకెందుకింత కోపం?" అని ఇంగ్లీషులోనే అడిగాడు.

'నాకేం వద్దు! అని నేను వెళ్ళిపోయాను. నన్ను ఈడ్చుకొనివచ్చి 'నీకు ఇది కావాలా? 'అది కావాలా?' అని అడుగుతే నాకు కోపం రాదా?' అని కోకిల తనలో గొణుక్కుంది. కాని తన ప్రవర్తనకి సిగ్గుపడి తలవంచుకుంది.

అతను మళ్ళీ చెప్పాడు:

"మనిద్దరికీ - ఒకరితో ఒకరు దెబ్బలాడడానికి గాని, ఓదార్చడానికి గాని - ఇక ఎటువంటి హక్కులూ లేవని నీకు ఇంకా తెలియదా?"

'దానిగురించి మరేం మాటలాడవద్దు!' అని అతన్ని బతిమాలుతున్నట్టు కోకిల తలెత్తి, అతన్ని చూసి "I am sorry," అని క్షమాపణ కోరింది.

"It's all right," అని అనంతరామన్ సహజభావంతో అన్నాడు. "ఇక మనం friends గా ఉందాం. ఈ రెండురోజులూ నువ్వు నీకు చాలా సాయం చేసావ్. అది

నేనెప్పుడూ మరిచిపోను. ఈ అమూల్యమైన వస్తువులు నీకు అప్పగించాలని నాకేమో అనిపించింది, అందుకే అడిగాను. కాని నువ్విలా చిరాకుపడతావని నేను ఊహించలేదు . . . సరే, ఇక నువ్వు వెళ్ళవచ్చు" అని చెప్పి అతను తన తక్కిన పనులు చూసుకోవడానికి సిద్ధమయ్యాడు.

కోకిల అక్కడనుంచి కదల్లేదు; ఆతన్ని చూస్తూ అలాగే నిలబడింది. ఈ పదేళ్ళ దాంపత్య జీవితంలో తను పొరబాటు చేసినట్టు - ఇప్పుడే, మొట్టమొదటిసారి - ఆమె గ్రహించింది. ఆ పొరబాటుని అతను ఎంత నాజూకుగా, నాగరికంగా తనకి తెలియజేసారని ఆమెకి ఆశ్చర్యం కలిగింది. 'ఇలాగే ఈ పది సంవత్సరాల దాంపత్యంలో ఇతను నా తప్పులు తెలియజేసి ఉంటే? . . . ' అనే ఆలోచన రాగానే భయపడింది. 'ఈ నిమిషం వరకూ మా దాంపత్యం కూలిపోవడానికి అతనే కారణమని నేను నిర్ణయించాను; అది న్యాయం కాదేమో?' అని కలపరపడింది.

ఒర స్టూల్ మీద నిలబడి ఆ బీరువామీదనుంచి ఒక పెద్ద పుస్తకాల కట్టని అతను కిందకి దించినప్పుడు కోకిల "May I help you?" అని అడిగింది.

"Please . . ." అని అంటూ అతను వొంగినప్పుడు ఆ పుస్తకాల కట్ట అతని చెయినుండి జారి నేల వాలింది; నాలుగేళ్ళ ధూళి లేచింది.

నేలపడిన పుస్తకాలని కోకిల తీసుకోని ధూళిని దులిపి, పోగు చేసినప్పుడు అందులో ఒక photo album కనిపించింది. దాన్ని తీసి పేరేగా పక్కన పెట్టింది.

ఆ పుస్తకాలని సమకూర్చి అతనికి అందించింది. ముటికిగా, పొగపాటిగా ఉన్న చేతులు కడుక్కోవాలని బాత్ రూముకి నడిచింది. చాలా సేపు మనసుని ఎత్తి పొడిచిన ఆ photo album ని అనంతరామన్ రహస్యంగా చూసాడు. కోకిల వచ్చే సద్దు వినగానే దాన్ని ఆమె ఉంచిన జాగాలోనే మళ్ళీ పెట్టేసి, ఆమె వెళ్ళడానికి ముందు తనున్న జాగాలోనే మళ్ళీ నిలబడ్డాడు. అతని చూపు ఇప్పుడు ఆ రోజు కోకిల రాసిపెట్టిన ఉత్తరంతో కనిపించిన Photo album మీద వాలింది. ఆ రోజు అతను దాన్ని చూసి మండిపడీనది గుర్తుచేసుకున్నాడు. దాని రెండు ఫ్రేములు కోపంతో తను విడదీసినప్పుడు అది నిలకడ లేకుండా వాలిపోయింది. తన అల్పబుద్ధికోసం ఇప్పుడు సిగ్గుపడి దాన్ని సవరించాడు.

తడిసిన చేతులు తుడుచుకుంటూ అక్కడికి వచ్చిన కోకిల ఆ album తీసుకొని తన గదికి వెళ్ళినప్పుడు "ఇది నేను ఉంచుకోనా?" అని అడిగింది.

అనంతరామన్ వెంటనే ఏమీ అనలేదు; "నీకేం కావాలో నువ్వు తీసుకోవచ్చు" అని తను ఇంతకుముందు చెప్పినప్పుడు కోకిల పైనబడిన దృశ్యం ఇప్పుడు అతను గుర్తుచేసుకున్నాడు. ఆమెకి ఏం జవాబు చెప్పాలని కలవరపడుతూనే "కావాలంటే ఇదీ నువ్వు తీసుకోవచ్చు" అని ఆ రెండు ఫోటోలున్న ఫ్రేముని చూపాడు. కోకిల తల వొంచి కొంచెసేపు ఆలోచించింది: 'నేనెందుకు ఇతని అనుమతి అడగాలి? కావాలంటే నేను ఇదీ తీసుకుంటాను, అది నా ఇష్టం!' అని గొణుక్కుంటూ album తో తన గదికి వెళ్ళింది.

డైనింగ్ హాలులో ఒంటరిగా కూర్చొని ఆ album లోని ఫోటోలు చూసినప్పుడు గత పది సంవత్సరాల ఎడబాటులో తన జీవితంలో అనుభవించిన ఆ నొప్పించే ఘటనలూ, చిన్నబోయిన అవస్థలూ మరిచిపోయి, తను ఇప్పుడే అతన్ని పెళ్ళి చేసుకొని కొత్తగా కాపురం ఆరంభించి ఒక నెల అయనట్టు కోకిల ఒక క్షణం కల్పించుకుంది. 'మనోహరమైన నా కలలన్నీ కూలిపోయినట్టే ఈ పది సంవత్సరాల ఎడబాటులో కటువైన ఆ పాత జ్ఞాపకాలు నా మనసులోనుంచి తొలగిపోతే ఎంత బాగున్ను! ఆ రోజుల్లో నేనూ, అతనూ చేసిన చిన్న తప్పులు మానుకొని ఆ రోజులని పునరుద్ధరించే విధంగా కాలచక్రం వెనక్కి తిరిగితే ఎంత బాగున్ను!' అని వాపోయింది. 'మరేం లాభం లేదు; ఇదొక పాత కథ!' అని ఒక నిట్టూర్పు వదిలింది.

'ఆ ఉత్తరం గురించి ఎందుకు అతను నన్ను ఏమీ అడగనేలేదు? అది నేను నిర్దయతో రాసాను. ఒక మగవాడిని కఠినంగా దూషించే విధంగా రాసిన తరువాత అతను నన్ను దానిగురించి అడగాలని నా ఆశ. అంటే నేను అతన్ని ఎంత నీచంగా అంచనా కట్టానని బోధపడుతుంది. అందుకు కారణం ఎవరు? నేను మాత్రం కాదు. అతన్ని నేను నా జీవితంలో, మనసులో, ఎంత గౌరవంగా పూజించాను!' అని కోకిల బాధ పడుతున్నా ఆ album లోని ఫోటోలు 'నువ్వూ కొంతకాలం సంతోషంగా గడిపావ్!' అని ఆమెకి జ్ఞాపకం చేసాయి.

'నేనెందుకు దీన్ని ఇన్ని సంవత్సరాలూ చూడనేలేదు? అంటే, జీవితంమీద నాకు అంత పగ, ద్వేషం ఉన్నాయన్నమాట! ఇంపైన అనుభవాలన్నీ అలాగే

తోసిపారేసాను . . . కళ్లు పోయిన తరువాత సూర్యనమస్కారం చేసినట్టు ఇప్పుడు ఇవన్నీ తలపోసుకుంటే ఏం లాభం? పదిహేనేళ్ళవరకూ నా జీవితం ఒక స్కూలులో - దానికి రుజువు ఒక certificate; ఆ తరువాత నా ఉద్యోగం - దానికి ఫలితం ఒక వివాహ ఆహ్వాన పత్రిక. ఆ తరువాత పది సంవత్సరాల దాంపత్యం, దానికీ ఒక రుజువు కావాలి, అవునా? మళ్ళీ దాంపత్యజీవితం కోరేవారికి అది అనవసరం. అందువలన ఇది నా దగ్గరే ఉండనీ!' అని దృఢంగా నిర్ణయించి కోకిల ఆ album తన పెట్టెలో ఉంచుకుంది.

ఆ రాత్రి చాలాసేపు ఇద్దరూ మౌనంగా ఆ మరుదినం ఇల్లు ఖాళీ చేసే ప్రయత్నంలో చురుకుగా పని చేసారు.

ఆ పెద్ద బీరూవాని కదల్పడానికి అనంతరామన్ కోకిలని సాయంకి పిలిచాడు. గోడకీ, బీరువాకీ మధ్యవున్న యిరుకైన ఎడబాటులో అనంతరామన్ చెయిని పోనిచ్చినప్పుడు కోకిల అతన్ని "జాగ్రత్త! . . .మెల్లగా . . . కాలు తీయండి!" అని హెచ్చరించిన తరువాతనే అనంతరామన్ బీరువా అడుగున ఉన్న తన కాలు వేలుని తీసాడు.

"మోటుతనం అంటే ఇదే!" ఆని కోకిల ఆతన్ని మందలించింది; అనంతరామన్ నవ్వి ఊరుకున్నాడు.

అప్పుడే - గోడకీ, బీరువాకీ మధ్యవున్న ఎడబాటు తొలగిన వెంటనే - ఆ కవరు ఆమె కళ్ళకి కనిపించింది. ఆమె ఎదురుచూడని విధంగా అది అలాగే తెరవకుండా కనిపించడం చూసి కోకిలకి ఎంత ఆనందం, ఎంత సంతోషం! 'అసలు, అతను అది చూడనే లేదేమో? అది గాలిలో తేలివచ్చి ఇక్కడ పడిపోయిందా?' అని ఆమెకి అనుమానం కలిగింది. దాన్ని తీసుకొని కోకిల తనదగ్గర దాచుకోవాలనుకుంది. అప్పుడే, "కోకిలా . . . " అని అనంతరామన్ అలవాటుగా పిలిచిన ధ్వని విని ఆమె నిర్ఘాంతబోయింది. కోకిల అతన్ని చూసినప్పుడు ఆ కవరు ఆమె చెయిలో ఆమె వీపు వెనక దాంకొని ఉంది.

అనంతరామన్ ఆమె దగ్గరకి రాకుండా, ఆ చిన్నగదిలో ఒక మూల నిలబడి ఆమెకి చెప్పాడు:

"రేపు తరువాత మనిద్దరం శాస్వతంగా ఎడబాయైపోతాం. మన పది సంవత్సరాల జీవితంలో 'ఇది నాది,' 'ఇది నీది,' అని ఎటువంటి భేదం లేకుండా మనం జీవించాం. కాని ఇప్పుడేమో దానికి వ్యతిరేకంగా . . . "

"మీరేమంటున్నారు?"

"నీ చెయిలో ఉన్న ఆ కవరు నాకు సొంతం అని అంటున్నాను."

కోకిల నవ్వింది. అటువంటి నవ్వుని అతను చూసి చాలా రోజులైపోయాయి. ఆ క్షణం అనంతరామన్ ఎక్కడోవున్న 'వాడి'ని గుర్తుచేసుకున్నాడు. అందువలనే అతనిలోని మొండితనం తగ్గలేదు. తన నవ్వుని చూసి కోకిల అపార్థం చేసుకుంటుందని "Please, దాన్ని నాకు ఇచ్చేయ్!" అన్నాడు.

"ఇది మీదంటున్నారా? ఇది నా ఉత్తరం!" అని అన్నప్పుడు ఆమె కళ్ళలో మాత్రం చిరునవ్వు కనిపించింది.

"ఉత్తరాలు రాసినవారికి సొంతం కాదు. దాని కవరుమీదున్న పేరు చదివి చూడు. అది ఎవరికి సొంతం అని బోధపడుతుంది."

"మీకెందుకీ పసితనం? . . . మీరేం ఆ ఉత్తరం చదవవద్దు."

ఆమె చిరునవ్వు, మాటలు విని అనంతరామన్ విసుగ్గున్నాడు. కాని తన పాత స్వరూపం చూపిస్తే తనకే అవమానం అనే ప్రజ్ఞతో ఆమెను ఒక క్షణం రెప్పవాల్చకుండా చూసాడు.

ఈ వాలకం, ఈ చిరునవ్వుతో కోకిల తన ముందు కనిపించాలని అతను ఎన్ని సంవత్సరాలుగా తపించుపోయాడు! ఇప్పుడు దీనికి ఇంత సాహసమా?

ఒక దృశ్యం అతని కల్పనలో లేచింది:

ఆకాశంలో ఒక గంధర్వ కన్య; ఆమె చూపుకోసం చిరకాలం తను నిరాశతో కాచుకొని ఉన్నాడు. ఆఖరికి, 'సరేలే, మనకి వద్దు!' అని ఓదార్చుకున్నతరువాత ఆమె తన కాళ్ళముందు పడి బతిమాలినా స్వాభిమానం ఉన్న ఒక మగవాడికి మరెన్నో కష్టాలు వచ్చితీరుతాయి.

అటువంటి శోకం ఇప్పుడు అతన్ని ఆవరించుకుంది. అతను కోకిలకి చెప్పాడు:

"ఆ ఉత్తరం నన్ను కాపాడుతుంది. ఇప్పుడు నువ్వు నాకు కనిపించే భావేశంతో నువ్వు దాన్ని రాయలేదని నాకు తెలుసు. స్థిరమైన మనసుతో, అన్నీ ఆలోచించి

మనిద్దరి మధ్య ఉన్న దాంపత్యం ఎంత పెద్ద అబద్ధం అని వివరంగా అందులో నువ్వు రాసివుంటావని నాకు తెలుసు. అందుకే దాన్ని చదవడానికి నాకు ధైర్యం లేదు. అదే నాకు నీపై ఉన్న బలహీనత అని తెలుసుకొని నేను భయపడుతున్నాను. ఇక భవిష్యత్తులో మనం వేరే వేరేగా ఉన్నప్పుడు ఆ బలహీనం నన్ను తారుమారు చెయ్యవచ్చు. అందువలన నేను కూలిపోయిన మన బంధం మళ్ళీ ప్రారంభించాలని నీ దగ్గరికి వస్తానేమో, ఎవరికి తెలుసు? సిగ్గు మాలి, ఒక పురుగులాగ, నీ దయ కావాలని బతిమాలుతానేమో? అటువంటి మనోవ్యధలో నేను ఈ ఉత్తరం చదువుతాను, ఇది నన్ను ఆ పతనంనుంచి కాపాడుతుంది . . . అందుకే ఆ ఉత్తరం ఇచ్చేయ్!" అని చెయి చాచి ఆమెను అడిగాడు. దాన్ని ఇవ్వడానికి కోకిలకి ఇష్టం లేదు; కాని ఏం చెయ్యాలో తెలియక కలవరపడింది.

ఆఖరికి, 'ఇటువంటి సమయంలో ఆమె మనసు నొప్పించకూడదు!' అని అనంతరామన్ పూనుకున్నా, నిర్దయతో ఆమెకి చెప్పేసాడు.

"నువ్వు తరచుగా నాకు చెప్పినది - I hate you! - నీకు గుర్తుందా? అది అబద్ధం కాదంటే ఆ ఉత్తరం ఇచ్చేయ్!"

కోకిల అతని దగ్గరకి వచ్చి, ఆ ఉత్తరం అతని చెయికి అందించి, మొహంకూడా చూడకుండా అతన్ని దాటి వెళ్ళిపోయింది.

అతను అన్నట్టు తన జుగుప్సని ఖాయపరచాలనే ఉద్దేశంతో కోకిల ఆ ఉత్తరం అతనికి ఇవ్వలేదు. అంతకుముందు అతను తను భయపడుతున్న 'బలహీనత' గురించి చెప్పలేదూ? అటువంటి దౌర్బల్యం వలన ఒక పురుగులాగ అతను తన ముందు ప్రాకులాడకూడదనే భయం వలనే ఆమె అలా చేసింది. అది అనంతరామన్ గ్రహించాడా? లేదు.

"మీరు కాపురంకి వచ్చిన రోజు నేను అడగలేదూ - 'మీకు పిల్లలు ఎంతమంది?' అని" పొరిగింటి ముత్తైదువ మళ్ళీ వాళ్ళకి గుర్తుచేసారు. "మీరు వెళ్ళిన పది మాసాలకి నాకు శుభవార్త తెలియజేయండి; నాకూ డెల్లీ, కాశీ అన్నీ చూడాలని ఆశ!" అని అన్న తరువాత తడిసిన కళ్ళతో దంపతులని దీవించారు.

ఈ ఐదారు రోజులూ ఇవన్నీ ఎలాగో భరించుకొని అనంతరామన్ ఊరుకున్నాడు. 'ఇప్పుడు ఈ పొరుగింటి స్త్రీ కూడా తన పాట పాడుతోంది!' అని

విసుగ్గుంటూ, ఆవిడ మాటలేవీ లక్ష్యం చెయ్యకుండా అనంతరామన్ మేడమెట్లు ఎక్కాడు.

కొంచె సమయం తరువాత కోకిల చెయిలో తమలపాకు, పళ్ళు, కొబ్బరికాయ, ఒక రవిక గుడ్డతో, విందు భోజనం చేసి, అలసటతో ఇంటికి తిరిగివచ్చినప్పుడు అనంతరామన్ ముందు హాలులో ఒక కిటికీ దగ్గర - అక్కడ మరేం కుర్చీ, మంచం లేదనే కారణం వలన - ఉత్తికే నిలబడి ఉన్నాడని గమనించింది.

ఆ క్షణం అతనికి బాహటంగానే కోపం వచ్చింది. కోకిలని చూడగానే అందరూ కుట్రచేసి తన్ను వధించుతున్నట్టు అతనికి భ్రమ కలిగింది. 'నేనేమో ఆ ఇంటి విందుకి ఒక సామాన్య పంచెతో వెళ్ళాను. నువ్వు నా భార్యగా నా వెనక వచ్చావ్! . . . మరి, నీకెందుకు ఇంత సొంపు, అలంకారం? ఇన్నిరోజులూ నేను పడిన కష్టాలు చాలవా? నీకున్నది నిజంగానే రాతి గుండె, అవునా?' అని నేరం మోపుతున్నట్టు ఒక చూపు చూసాడు.

అదేం లక్ష్యం చెయ్యక, కోకిల మౌనంగా ఇంటిలోకి వెళ్ళింది.

నిన్నరాత్రి ఈ ఉత్తరం అతనికి అందించిన తరువాత ఆమెను ఆవరించుకున్న మౌనం ఆమెలో స్థిరంగా నిలిచిపోయింది. 'ఇక మేమిద్దరం ఏమీ మాటాడుకోం!' అని నిలకడగా చేసుకున్న తీర్పు. 'ఇక మా సంభాషణకి అర్థం లేదు!' అనే సందేశమే ఆ మౌనంలో చోటుచేసుకుంది.

నిన్నరాత్రంతా ఇద్దరూ తమ తమ గదుల్లో ఒంటరిగా, నిద్రపోకుండా, ఉత్తికే కూర్చోడానికి ఇష్టం లేక, అప్పుడప్పుడు, గదిలోనే నడుస్తూ ఉన్నారు. నేరుగా వెళ్ళి ఒకరినొకరు చూడాలనే ఆతురతని ఇద్దరూ అణచుకున్నారు. అకస్మాత్తుగా, ఇద్దరూ ఒకేసారి, ఒకరినొకరు కలుసుకొనివుంటే ఆ మౌనం భంగమైపోయుంటుంది.

ఆ రాత్రి సమయంలోనే ఇద్దరూ ఒకరినొకరు కనికరంతో ఆలోచించారు.

'ఇది నేను తొందరగా చేసిన పొరబాటేమో?' అని కోకిల నూరుసార్లు జంకింది. అతనెందుకు ఆ ఉత్తరం చదవవేలేదు? నేను మూడురోజులు ఎక్కడ ఉన్నానని ఎందుకు అడగలేదు?' అని ఆమె మళ్ళీ మళ్ళీ ఆలోచించినప్పుడు ఈ పదేళ్ళ కాపురంలో తన భర్త తన దగ్గఱ మోటుగా, క్రూరంగా, ప్రవర్తించినందుకు తనే కారణమేమో అని కోకిల ఆత్మవిచారణ చేసుకుంది. 'అతను ఎంత పెద్ద మనిషి! నా

బంధుత్వంతో నేనే అతన్ని చులకన చేసేసాను; ఎంత శోచనీయం! 'నేను అతన్ని త్యజించాను' అని తెలుసుకున్నతరువాత అతని ప్రవర్తన నాకు ఎంత నాజూకుగా కనిపిస్తోంది!' అని అతనితో తను గౌరవంగా జీవించిన ఈ కొన్నిరోజుల వైభవం గుర్తుచేసుకుంది.

రాత్రంతా తలపోసుకుంటూ నిద్రపోకుండా ఆమె అల్లాడినప్పుడు స్త్రీ జాతికి తగిన భావనతో తన గది తలుపుని తెఱచుకొని అతని గదికి వెళ్ళిచూసినప్పుడు అది మూయబడివుండడం తేఱిపారి చూసింది.

తనే వెళ్ళి అతన్ని కలుసుకోడానికి అడ్డు ఆమె ఆత్మగౌరవం కాదు; అందువలన అతను చిన్నబుచ్చుకుంటాడనే భయమే కారణం.

ఇద్దరూ తమ తమ గౌరవాలని ఒకరినొకరు గుర్తు చేసుకొని, హద్దులేవీ మీరకుండా పదేళ్ళ దాంపత్య జీవితం ముగించే పనిలో ఉన్నారు; ఆ నిజాన్ని కోకిల ఒక మూడవ మనిషిగా చూస్తోంది. 'ఇదొక అంతులేని కధగా సాగితే ఎంత బాగున్ను!' అని పదే పదే అంగలార్చుతుంటూ నిట్టూర్పులు వొదులుతోంది.

అనంతరామన్ కూడా ఇంచుమించు అదే మానసికస్థితిలో ఉన్నాడు. కాని ఈ దాంపత్యం కొనసాగుతుందనే నమ్మకం అతనికి లేనేలేదు. ఇంపైన జీవితాన్ని అన్యాయంగా తను పోగొట్టుకున్నభావనే మళ్ళీ మళ్ళీ అతని మనసులో లేచింది.

'ఇది నిజమేనా? కోకిల నన్ను వొదిలి శాస్వతంగా వెళ్ళిపోతుందా?' అనే ఆలోచన రాగానే ఆ ఎడబాటు అతనికి నచ్చలేదు. కాని భవిష్యత్తులో కోకిల సంతోషంగా ఉంటుందని అతను హృదయపూర్వకంగా నమ్మాడు. ఇన్ని సంవత్సరాలు ఆమె జీవితాన్ని పాడుచేసినందుకు తను అనుభవించే శిక్షకి సిద్ధమైనట్టు కనిపించాడు. ఎప్పుడైనా అతను తన గది తలుపు తెఱచి చూసినప్పుడు - ఆమె కూడా తనలాగ ఒంటరిగా తన గదిలో నడుస్తోందని ఊహించినప్పుడు - 'కోకిల తన భవిష్యత్తుగురించే ఆలోచిస్తోంది, నాగురించి కాదు!' అనే అతను అనుకున్నాడు. తనకోసం కోకిల బాధపడుతోందని కల్పించుకోడానికికూడా అనంతరామన్ సిద్ధంగా లేడు.

అతనిలో, చిట్టచివరికి మొలకెత్తిన నమ్మకం, మొగ్గగానే వాడిపోవడానికి కారణం ఆ ఉత్తరంకి సంబంధించిన ఘటన.

'నువ్వు తరచుగా నాకు చెప్పినది - I hate you! - నీకు గుర్తుందా? అది అబద్ధం కాదంటే ఆ ఉత్తరం ఇచ్చేయ్!' అని తను కోకిలకి చెప్పినప్పుడు ఆమె కనీసం సహృదయభావంతో "నేను ఇవ్వను!" అని అనలేదు. ఎందుకు? స్నేహంకి, జుగుప్సకీ ఎంత తేడా ఉంది! ఇదికూడా దానికి తెలియంటే ఎవరైనా నమ్ముతారా? కోకిలకి నిజంగానే నేనంటే పగ, ద్వేషం, అందువలనే ఆ ఉత్తరం నాకిచ్చింది . . .'

'సరే, కావాలంటే ఈ ఉత్తరం ఉంచుకోండి . . . ఎందుకీ గొడవ?' అని ఆమె మరేం అనలేదే? మౌనంగా నాకు ఆ ఉత్తరం అందించి, నా కళ్ళకి కనిపించకుండా మాయమైందంటే ఆ ప్రవర్తన ఎంత సార్ధకమని నాకు తెలిసిపోయింది!' అని అనంతరామన్ వాపోయాడు. దానితోబాటు అతనికి కోకిలమీద అసూయ కలిగింది. 'ఆమెలాగ నాకు మానసిక బలం లేదు. నేనెందుకు దానిగురించి బాధపడుతున్నాను?' అని అనంతరామన్ సిగ్గుపడ్డాడు.

ఆ భావనతోనే అతను ఆ రోజంతా కోకిలని చూసినప్పుడెల్లా మొహం ముడుచుకున్నాడు. ఆమె గురించి అన్ని జ్ఞాపకాల్లోనూ తను మెల్లమెల్లగా జారుకున్నట్టు అతనికి నమ్మకం కలిగింది.

** ** **

రైలు ప్రయాణంకి ముందు కోకిల, అనంతరామన్ ఒక రెస్టారెంట్ లో కాఫీ తాగారు. అప్పుడుకూడా ఇద్దరూ ఒకరికొకరు ఎదురుగా కూర్చున్నా ఏమీ మాటాడలేదు. అప్పుడప్పుడు నిట్టూర్పులు వదిలారు. ఇద్దరూ తమ తమ ఊహాప్రపంచంలో మునిగివుండడంవలన ఎది చూసినా అది మనసులో పదిలమవకుండా ఉదాసీనతతో చూసారు. పక్కన ఎవరితోనూ మాటాడినా, లేక నవ్వినా అది యాంత్రికంగా కనిపించింది.

ఎవరో "మీ రైలు ఇంకా కొన్ని నిమిషాల్లో బయలుదేరుతుంది" అని గుర్తు చేసిన తరువాత అనంతరామన్ మెల్లగా లేచాడు. కోకిల కూడా అతని వెనుక నడిచింది.

సందడి, కూతలు నిండిన ఇటువంటి జన సమూహంలో నడుస్తున్నప్పుడు కోకిల - ఇంతకు ముందు ఇంటిలో నాలుగు గోడల మధ్య ఎంత కటుత్వం ఉన్నా - భర్తని తన దేహంతో బాగా అణచుకొని ముదుకు సాగడం అలవాటు చేసుకుంది. ఎప్పుడైనా, అకస్మాత్తుగా, ఆమె చెయి భర్త చెయిని తాకలేదంటే ఆ క్షణమే అతని

మొహం ఎలా మారిపోతుంది! అబ్బా, ఆ చూపులో ఎన్ని ప్రశ్నలు! అప్పుడు, కోకిలని మాత్రం కాదు, ఆ సమస్త జనసమూహాన్ని చీదరించుకున్నట్టు అనంతరామన్ కనిపిస్తాడు. తనకే సొంతమైన కుక్కపిల్లని పిలుస్తున్నట్టు అతను చెయి చాచిన ఆ క్షణం కోకిల - మనసులో అతనికి ఎంత దూరంలో ఉన్నా - వెంటనే అతని దేహంతో బిగువుగా తను కలిసిపోతుంది.

ఇప్పుడు ఇద్దరూ రెస్టారెంట్ వదిలి బయటకి రాగానే, అతను మాత్రం త్వరగా ఆ జనసమూహంలో ముందుకు పరుగెత్తినప్పుడు కోకిల అతని వెనుక పరుగెడుతూ ఆ పాత జ్ఞాపకాలు గుర్తుచేసుకుంది. కాని ఆ భావావేశం ఎలా వర్ణించడం? సంతోషమా లేక విచారమా అని ఆమెకి అర్థం కాలేదు.

ఆ A.C. compartment చేరుకున్నవెంటనే అనంతరామన్ అక్కడ నిలబడి తిరిగి కోకిలని చూసాడు. ఆమె వెనుక గార్డు పచ్చ జండాని ఎత్తి చూపాడు. నిన్న రాత్రివరకూ తను చూడకూడదని మానుకున్న కోకిల కళ్ళని ఆఖరిసారిగా చూద్దామని అనంతరామన్ సిద్ధమైయ్యాడు.

'ఆమె కళ్ళు ఎందుకిలా రక్తమయంగా కనిపిస్తున్నాయి? నా కళ్ళని చూడలేక అవి కిందకి జారిపోతున్నాయే?' అని అతను ఆమె చూపులో తన్ను చూసుకున్నాడు. అప్పుడే తన కోటు పాకెట్ లో ఆ కవరుని చూసాడు.

"ఓ, అదా సంగతి?" అని గొణుకుతూ ఆమెను చూసి ఒక చిరునవ్వు నవ్వాడు.

"Please" అని ఆ ఉత్తరం కావాలని ఆమె చెయ్యెత్తి బతిమాలడం చూసి అతనికి జాలి కలిగింది.

'ఇదేం గొడవరా?" అని విసుగ్గుంటూ అనంతరామన్ దృఢంగా ఆమెకి చెప్పాడు: "అది నాకు సొంతం."కాని అలా చెప్పిన తరువాత - ఇక ఎప్పుడూ తన జీవితంలో కోకిల కనిపించదు, కాని ఆమె మొహం తను తన హృదయంలో భద్రపరచుకోవాలనే ఆకాంక్షతో అతను ఆమెను చూస్తూన్నప్పుడు తన కళ్ళు తడిసిపోవడం అతను గుర్తించలేదు.

ఆమె అతన్ని సమీపించి మళ్ళీ అడిగింది:

"మనం మళ్ళీ ఎప్పుడైనా కలుసుకుంటే . . . "

'ఊ గార్డు ఎందుకు ఇంత తొందరపడుతున్నారు? తన వీపుని ఎవరో తాకినట్టు, కోకిల చటుక్కున తిరిగి చూసింది; తన దేహంలాగే రైలుబండిలో కూడా ఒక ఊపు!

ఆమెను చూస్తూనే వెనకాడుతున్నట్టు అనంతరామన్ రైలు ఎక్కాడు. ఆ ఉత్తరం కావాలని కోకిల పరుగెత్తుకొని వస్తోంది. ఆమెను అలాగే వదిలేయడానికి అతని పురుషత్వం ఏకీభవించలేదు: తను రైలునుంచి దిగాలి. లేకపోతే ఆమెను లాగ్గొని తనతో చేర్చుకోవాలి.

కాని ఇంతలో అందుకి అగత్యం లేకుండా కోకిల కదులుతున్న రైలుబండిని తన చెయితో అందుకుంది: "Please . . . Please"

అనంతరామన్ తన చెయితో కోకిల నడుముని పట్టుకొని ఆమెను తనతో చేర్చుకున్నాడు.

రైలుబండి వెళ్ళిపోయింది.

రైలు స్టేషన్ బయటకి రాగానే ఒక దీప స్తంబం వెలుతురులో ఆ ఉత్తరాన్ని - ముక్కలు, ముక్కలుగా తను చింపినది - అనంతరామన్ గాలిలో పారవేసాడు.

అంత ఖరారుగా, మొండితనంగా "ఇవ్వనే ఇవ్వను!" అని హఠం చేసిన ఆ ఉత్తరాన్ని అతనే ఇలాగ చింపి, ముక్కలు ముక్కలుగా గాలిలో అతను విసిరాడంటే . . .

కోకిల ఎంత పని చేసింది!

*******

# నలుగురు నడిచేదే బాట!

## పాఠకులకి ఒక చిన్న మనవి

ఈ కథ చదివేముందు మీకు కొన్ని సంగతులు చెప్పాలని నా అభిలాష. సాహిత్యాభిరుచి ఉన్న పాఠకులు జయకాంతన్ రచనావిశేషంని ఇంకా గొప్పగా శ్లాఘించడానికి దోహదం చెయ్యాలనే వాంఛతో నేను ఇది రాస్తున్నాను.

ఈ కథ కాలావధి కొన్ని గంటలు మాత్రమే. "కథానాయకుడు ముత్తువేలర్ అర్ధరాత్రి వేళ తన ఇంటిలో ఒంటరిగా ఏమేమో తలపోసుకుంటూ, ఇటూ అటూ నడుస్తున్నారు" అని కథ ఆరంభమవుతోంది; తన జీవితంలో రాబోయే ఒక పెద్ద మలుపు గురించి అతను ఆలోచిస్తున్నారు; ప్రాతఃకాలంలో ఒక కొత్త జీవితం అందుబాటులో ఉందని చాలా ఉత్సాహంతో ఉన్నారు.

కథలోని ఘటనలు, పాత్రలూ అతని పాత జ్ఞాపకాలుగానే పాఠకులకి పరిచయం అవుతాయి; దీనికే సాహిత్యంలో కాలక్రమ వ్యత్యయం (Flashback) అనే పేరుంది.

ఇక్కడ ఆ ప్రక్రియ మూడు జాడల్లో (tracks) సాగుతోంది.

1. ముత్తువేలర్ చేష్టలు, ప్రవర్తన, మనకి జయకాంతనే సూటిగా, అంటే సర్వసాక్షిగా[1] తెలియజేస్తున్నారు. ముత్తువేలర్ నిద్రలేమితో బాధపడడం, సమాజం అతనిమీద పైబడడం, ఊరులో అతను అనుభవించే అప్రతిష్ట, అతనిగురించి వదంతులు - ఇవన్నీ మనకి రచయితే సూటిగా, వివరంగా తెలియజేస్తున్నారు.

2. ధారావాహికంగా గతకాల జ్ఞాపకాలు ముత్తువేలర్ మనసులో చొరపడుతున్నాయి. వాటిని అంతరంగికంగా, సగతంగా (Internal monologue) గా అతను మాటాడుకుంటున్నారు: అతని తాత ముత్తాతలు, కుటుంబ సంప్రదాయాలు, బాల్య మిత్రుడు పైత్తా, వాడి అకాల మరణం, వాడి ప్రభావం, , తన జీవితంలో ప్రధాన

[1] ఈ సాహిత్య యుక్తికి Omniscient View అని పేరు

ఘట్టాలు - వీటి గురించి అతను ***ఆలోచిస్తున్నారని*** స్పష్టపరచడానికి నేను ఈ భాగాలని ఏటవాలుగా రాయబడే అక్షరాలతో (Italics) సూచించాను.

3. ఆ ఆలోచనల మధ్య ముత్తువేలర్ అడపాదడపా తనకి ముఖ్యమైన ఊహలూ, భావనలూ అని తోచినవి ఒక డైరీలో క్లుప్తంగా రాసుకోవడం అలవాటు చేసుకున్నారు. అతను ఆనవాయితీగా కాలేజీకి వెళ్ళి చదువుకోలేదు. కాని తన బాల్య మిత్రుడు - బ్రాహ్మణ యువకుడు పైత్తా - ప్రాబల్యం వలన - అతనిలో కళాత్మక దృష్టి, సాహిత్యాభిరుచి అతన్ని ఆక్రమించుకొనివున్నాయి. స్వయంప్రేరేపణ వలనే అతనొక మంచి చదువరి, విద్యావంతుడు. అతను డైరీలో రాసుకునేవి అతనికిష్టమైన సంక్షిప్త సందేశాలు. అవి రెండుమూడు వాక్యాలే కావచ్చు, కాని వాటి మహత్యం అతనికే తెలుసు. ఆ వ్రాతలు మాత్రం నేను బలమైన ఏటవాలు అక్షరాలతో (Bold Italics) సూచించాను.

ఈ పధకం పాఠకులకి సహాయం చేస్తుందని నా నమ్మకం.

********

# నలుగురు నడిచేదే బాట!

# నలుగురు నడిచేదే బాట!

ఆ అర్ధరాత్రి వేళ, ఏకాంతంగా, ఆ హాలులో - అదే అతనికి ఆఫీసు, గ్రంధాలయం కూడా - ముత్తువేలర్, తన రెండు చేతులూ వెనక్కి కట్టుకొని, మెల్లగా అడుగులు వేస్తూ నడుస్తున్నారు.

ఆ విశాలమైన చావడిలో, ఆ చీకటిలో, దూరంలో, ఆ హాలు మూల, అతని పడకకి పక్కనే ఉన్న మేజామీద ఒక దీపం బోర్లపడి ఉంది. దాని జ్యోతి పడకమీద పడి, దాని ప్రతిబింబంలో గదిలో ఉన్నవన్నీ అతనికి మరుగుగా కనిపిస్తున్నాయి. మాసిపోయిన ఆ వెలుతురులో, ఆ హాలులో వరుస వరుసగా ఉన్న పొడుగాటి పుస్తకాల బీరువాల మధ్య, జోళ్ళతో, తాటినార చాప మీద అతను ఒక చివరనుంచి ఇంకొక చివరకి నడుస్తున్నారు.

ఆ వొంటి పడక అతని నిద్రలేమికి నిదర్శనం అని తెలియజేస్తున్నట్టు దానిమీద పుస్తకాలే కుప్పగూడి ఉన్నాయి. పడకకి పక్కనే వీలుగా ఒక ఏటవాలైన కుర్చీ ఉంది. దానికి సమీపంలోనూ, ఒక పక్క, వరుస వరుసగా పుస్తకాలే ఉన్నాయి. పరుపుమీదనుంచే చదవడానికీ, రాయడానికీ, వసతిగా ఉన్న ఆ మేజాని చాలామట్టుకు పుస్తకాలే ఆక్రమించుకొని ఉన్నాయి. ఇంకొక పక్క ఒక వెండి కూజా, అతని నిద్ర మాత్రల సీసా, కలం, కళ్ళద్దాలు, శిరా బుడ్డి - ఇవన్నీ చిందరవందరగా కనిపిస్తున్నాయి.

ఆ పరుపుకి పైనవున్న ఆ పాత Electric Fan జోరుగానే తిరుగుతున్నట్టు కనిపిస్తోంది.

ఇన్ని ఉన్నా ఏం లాభం? ముత్తువేలర్ స్వభావంగా నిద్రపోయి చాలా కాలమైంది. ఎంత ప్రయత్నించినా అతనికి నిద్ర రాదు. నిద్రకి మనసు నింపాదిగా ఉండాలి, అవునా? నిత్యమూ ఏదో తలపోసుకుంటూ నిద్రలేమితో బాధపడడం ఒక మనోవ్యాధి అని అతను చదివి ఉన్నారు. చాలా రోజులకిముందే 'ఈ జన్మలోనే సమాజం నన్ను పిచ్చివాడని సరికట్టుతుందేమో?' అని భయపడి అతను డాక్టర్ని కలుసుకున్నారు.

డాక్టర్ చెప్పిన చికిత్స అతనికి ముందే తెలుసు. "చులకనగానే exercise చెయ్యండి, అది చాలు! రాత్రి నిద్రపోయేముందు వీటిగురించి ఏ ఆలోచనా వద్దు!" అని డాక్టరు అతనికి ఒక జాబితా కూడా ఇచ్చారు. "సరేలేండి, Thanks!" అని చెప్పి ముత్తువేలర్ ఇంటికి తిరిగి వచ్చేసారు.

కాని ఆఖరికి మరేం దారి తోచక అతను నిద్రమాత్రలు అలవాటు చేసుకున్నారు. కాలక్రమంలో అది తన దేహాన్ని బాధిస్తుందని అతనికి తెలుసు. 'ఐతేనేం, అసలు బతికి ఉన్నంతవరకూ మనిషి ఏదో బాధ పడవలసిందేకదా!' అని అని ధైర్యంగా తనకి తనే చెప్పుకొని నిద్రపోయేముందు అతను అర మాత్ర తీసుకుంటారు.

కాని 'ఈ రోజునుంచి నేను నిద్రమాత్రలు తీసుకోను!' అని అతను నిర్ణయించుకున్నారు. ఇక అవి తనకి అనవసరం; రేపునుంచి అతని జీవితం ఒక కొత్త స్త్రీతో ఆరంభమవబోతోంది. ఆమెతో ఉన్నప్పుడు అతనెప్పుడూ నిద్రమాత్రలు వాడలేదే?

'సరే, ఇక నేను రాయాలి' అని అతను గుర్తు చేసుకున్నారు.

ఇటీవల తన మనసులో అల్లాడుతున్నవన్నీ ఒలకబోయాలనే ఆవేశంతో అతను మేజామీద తీసిపెట్టిన letter pad లోని పేజీలు గాలిలో పటపటమంటున్నాయి.

'నాగురించి అందరికీ అన్నీ తెలుసు; కొత్తగా ఇక నేనేం చెప్పాలి?' అని అనుకుంటూనే అతను తన పడక దగ్గరకి వస్తున్నారు.

మేజాని చేరుకున్న తరువాత అతను వెనక్కి తిరిగి, హాలులోని ఇంకొక మూలని తేటిపార చూసారు. దీపం దగ్గర నిలబడి అతను పరిసరాలు చూసినప్పుడు కళ్ళు అంధమైనట్టు చీకటి హాలుని పూర్తిగా కప్పేసింది.

ఈ చీకటి, ఈ ఏకాంతం అతనికి కొత్త అనుభవం కాదు. కాని 'ఈ ఏకాంత అనుభవం ఈ రాత్రితో అంతమవబోతోంది; దీన్ని తప్పిస్తే ఇక ఒక రాత్రికూడా నేనిక్కడ ఉండను!' అనే నిశ్చలమైన ఆలోచన రాగానే అతని మనసులో ఈ రాత్రిని, ఈ హాలులో, ఆఖరి సారి, నిండుగా గడపాలనే ఆకాంక్ష చోటుచేసుకుంది.

వెంటనే అతను ఆ హాలులో ఉన్న అన్నీ దీపాలనీ వెలిగించాలని తొందర తొందరగా Switch Board దగ్గరకి వెళ్లి, ఒకటి తరువాత ఒకటిగా మీటలు నొక్కారు. గభీమని

హాలు నిండుగా  లేచిన ఆ దీపాల ప్రకాశంలో ఇంతవరకూ అతని కళ్ళకి కనిపించక, ఆ మేజా అడుగున నిద్రపోతున్న అతని మిత్రుడు సర్దార్ అతని అంతరంగిక గదిలో అన్యులెవరో చొరబడినట్టు, తలెత్తి, నిక్కపొడుచుకున్న చెవులతో ముత్తుపేలర్ కాళ్ళదగ్గరకి వచ్చి కాపలా కాస్తున్నట్టు నిలబడింది.

ఇరవై సంవత్సరాలు పాటుబడి ప్రపంచంలో అన్ని దిశలనుంచి అతను పోగుచేసిన పుస్తకాలన్నీ ఆ  పురాతన భవనంలో - అందులో అతని తాత ముత్తాతలు పామరులనే ఉత్పత్తి చేసారు -  ఇప్పుడు గ్రంధాలయంగా, ఒక అమూల్యమైన కళాత్మక సృష్టిగా, కనిపిస్తున్నాయి. అదొక్కటే తన అసాధారణ ప్రజ్ఞ అని ముత్తుపేలర్ గర్వపడుతున్నారు. ఇతని పూర్వీకులు నియతంగా లక్ష్మీదేవిని తమ కులదేవతగా ఆరాధించారన్నది నిజం. కాని ఇతను మాత్రం ఆ తోవనుంచి కొంచెం తప్పుకొని సరస్వతీదేవిమీద తనకున్న గాఢమైన ప్రేమతో ఆమె సేవలో తన్ను అర్పణ చేసుకున్నారు; ఊరంతా ఆ అపేక్ష వ్యాపించాలనే అతను ప్రయాసపడుతున్నారు.

ముత్తుపేలర్ ఆ ఊరులో చదువులేని తన పూర్వీకుల పేరులో ఒక కళాశాల, ఉన్నత, ప్రాధమిక బడులు స్థాపించారు. అది గుర్తుచేసుకున్నప్పుడు తన బాల్యమిత్రుడు, జ్ఞాన సంపన్నుడు - తన జీవితంని ప్రభావితం చేసి, అల్పాయుషులో కన్ను మూసిన ఆ బ్రాహ్మణ యువకుడు పైత్తాని - అతను కృతజ్ఞతతో తలుచుకున్నారు.

అతని నడుముని అంటుకొని నిలబడి ఉన్న కుక్క సర్దార్ని వాత్సల్యంతో తాకుతూ అతను  తన గురువు, మార్గ దర్శకుడైయిన పైత్తాని మనసులో పూజించుకున్నారు.

ఆ హాలు గోడలమీద టాగూర్, టాల్స్టాయ్, భారతి, షెల్లీ, సేక్స్పియర్, ఇక మరెన్నో సాహిత్య మేధావుల పటాలు కనిపిస్తున్నాయి. వాటిమధ్య పైత్తా పటం లేకపోవడం అతనికి చాలా బాధగా ఉంది. వాడు పోయిన తరువాత వాడి ఫోటోకోసం ముత్తుపేలర్ బ్రహ్మ ప్రయత్నం చేసారు, కాని లాభం లేదు. అతనుగాని పైత్తాని కలుసుకోలేదంటే ఈ పటాలకి ఈ ఇంటిలో ఏమైనా అర్ధం ఉందా?

ఈ గ్రంధాలయంలో ఉన్న ప్రతీ పుస్తకంలోనూ తన మనసులో శాశ్వతంగా చొచ్చుకు పోయిన పైత్తా కాపురం ఉన్నాడని అతని భావన. ఇంకా కొంచెం లోతుగా ఆలోచిస్తే వాడు తనలోనూ కలిసి ఉన్నాడని అతనికనిపిస్తోంది.

*'పైత్తాని నేను కలుసుకోలేదంటే ఈ సమాజంని, నా కుటుంబాన్ని వశపరచుకున్న మూఢత్వం తోసిపారేసి, హాయిగా, ఏకాకిగా, ఒక మేధావిగా జీవించడం నాకెలా సాధ్యం? తరతరాలుగా నా పూర్వీకులు ఎవరో సంపాదించి వదలిపెట్టిన ఆస్తిని నేను బతికి ఉన్నంతవరకూ లెక్కపెట్టుకుంటూ రోజులు గడపాలన్నమాట! అది ఎంత అసహ్యమైన, దారుణమైన ఆత్మహత్య!'*

*'ఇప్పుడు నా జీవితంలోకనిపించే అన్ని ప్రశ్నలకీ, మార్పులకీ, ఉన్నతికీ, అపకీర్తికీ, - ఈ సమాజం, నా సొంత జీవితం గురించి నా అవగాహనకి - ఈ జ్ఞానమే కారణమంటే ఆ జ్ఞానం పోషించిన కృతజ్ఞతకి ఆ పైత్తాకదా అర్హుడు?*

*అందువలనే దీనికి 'శ్రీ వైద్యనాధయ్యర్ గ్రంధాలయం' అని పేరు పెట్టి దీన్ని ఈ ఊరు కళాశాలకి విరాళంగా ఇవ్వాలని నిశ్చయించాను.'*

అలా అంటుంటే అతని కళ్ళు చెమ్మగిల్లాయి.

*'నా జీవితంని నేనెంతో సార్ధకతో అనుభవించాను. రేపునుంచి నా రెండవ జీవితం ఆరంభించడానికి నేను సిద్ధంగా ఉన్నాను. ఈ సమాజంకి గాని మనస్సాక్షి, కృతజ్ఞత అని ఏమైనా ఉంటే నాకు కానుకగా ఆ రెండవ జీవితం ఇచ్చివుంటుంది. సమాజంకి పెద్ద నోరుంది, కడుపుంది; అది వాగుతుంది, మింగుతుంది. సమాజం నన్ను ఎంత దూషించినా, నా ఈ రెండవ జీవితం నా మొదటి జీవితంకి నేను స్వచ్ఛందంగా తీసుకుంటున్న కూలీ అనే భావనలో నేను ఈ రెండవ జీవితంకి సమ్మతించాను.'*

ఇక కొన్ని గంటలలో ఒక నవల మొదటి భాగం అంతమై రెండవ భాగం ఆరంభమవుతున్నట్టు - అతని ఈ యాభైయేళ్ళ జీవితం సమాప్తమై, మరొక భాగం రాబోతోంది; అదెన్ని సంవత్సరాలో? అది కొన్నిసంవత్సరాలే కావచ్చు, కాని అది సార్ధకతో కొనసాగుతుందనే నమ్మకంతో ముత్తుపేల్ తనిక త్యజించబోయే అనుబంధాల గురించి ఓర్పుతో ఆలోచిస్తున్నారు.

ఆ రాత్రి నిశ్శబ్దంలో మిద్దెక్రిందనుంచి వచ్చే దగ్గు అతనికి స్పష్టంగా వినిపిస్తోంది.

*'దానికి ఇరవై సంవత్సరాలుగా asthma. అదేం మందూ తీసుకోదు; నియతంగా, వారావారం, ఉపవాసం ఉంటుంది; చల్ల నీళ్ళతోనే స్నానం చేస్తుంది; రోజంతా తన రోగం గురించే విసుగ్గుండా మాటాడడం దానికి అలవాటైపోయింది. తనంటే అందరికీ ఉదాసీనత అని, ఇతరులని తిట్టుతూంటే తన మనోవేదన తగ్గుతుందని, దానికి నమ్మకం. దాని నమ్మకం కోసం ఆ ఇంట్లో అందరూ - అంటే, దాక్షాయణి తప్పిస్తే! - భరించుతారు. అవును మరి, దాక్షాయణికి ఇదేం కర్మ ?'*

ముత్తువేలర్ మొదటి భార్య భాగ్యం దగ్గడం ఆరంభించందంటే ఆ సమయం ఒక గంట అన్నమాట. నిమిషానికి నిమిషం ఆ దగ్గు చప్పుడు ఎదుగుతుంది. రెండు దగ్గుల మధ్య వాపోవుతూ తన భర్తని ఆవిడ శపించుతుంటే ఆ దాడి ఆవిడ గది తలుపులని చీల్చుకొనివచ్చి అతన్ని తాకుతుంది. అప్పుడే ముత్తువేలర్ సీసానుంచి ఒక అర నిద్ర మాత్ర తీసుకొని - తను చదువుకుంటున్న పుస్తకంని వెంటనే మూసేసి, దీపం ఆర్పేసి, - నిద్రపోతారు.

ఇంతసేపూ వెలుగుతూ మేడమీద కనిపించే దీపం తన కంఠధ్వని వినగానే ఆఱిపోవడం చూసి భాగ్యం తన మొరని భర్త పూర్తిగా తిరస్కరిస్సున్నారని తెలుసుకొని ఇంకా బిగ్గరగా ఏడుస్తుంది.

ముత్తువేలర్ దిగజారిన కళ్ళతో ఆ నిద్రమాత్రలకి కృతజ్ఞత చెప్తున్నట్టు ఒక చిరునవ్వు నవ్వేసి నిద్రపోతారు.

కాని ఇవాళ ఆ దగ్గు విని అతను నిద్రమాత్ర తీసుకోలేదు, దీపం ఆర్పలేదు. 'ఇంకా ఒక రోజేకదా బాకీ, అదేం చెప్తోందో విందాం!' అని ఆలోచిస్తూ కిటికీ తెరిచారు. భాగ్యం కూడా అలవాటుకి విరుద్ధంగా దగ్గడం ఆపుకుంది. ఇక తను వాపోతే లాభం లేదనో, అందుకు అగత్యం లేదనో ఆవిడకి అనిపించిందేమో?

ముత్తువేలర్ తను నిలబడివున్నమిద్దె క్రింద ఆ పెద్ద గృహంలో ఉన్న బంధువులందరినీ - ఒక్కొక్కరినీ - ఇప్పుడు గుర్తు చేసుకున్నారు.

అతని మనసుని ఆ బ్రహ్మాండమైవ ఆ ఇల్లు స్పష్టంగా అలవరించుకుంది.

ఎంత పెద్ద ఇల్లు! ఆ గృహంలో అతను అన్ని విభాగాలు సంచరించి చాలా రోజులైపోయాయి. ధానిమీద తనకున్న బాధ్యతలు తగ్గడానికి ముందే అతనికి

మక్కువ, మమకారం తగ్గిపోయాయా? ఆ ఇంటి ముందు రెండు పక్కలా ఉన్న పొటుగాటి వసారాల్లో ఎవరెవరో నిద్రపోతున్నారు: ఆ గుంపులో అతిథులు, ఇంటి నౌకరులు ఉన్నారు; దారిన పోయే ప్రయాణికులూ ఉండవచ్చు.

ఆ తరువాత . . . అద్భుత కళా నైపుణ్యంతో, సున్నితమైన నగిషీ పనితో చెయ్యబడిన ఆ ఇంటి ప్రధాన కొయ్య ద్వారం నిత్యమూ మూయబడి ఉంటుంది. ఆ ద్వారంకి రెండు పక్కలా ఉన్న పెద్ద పెద్ద గదుల్లో ఎలుకబోనులూ, ధాన్యం నిండిన గోనె సంచులూ కనిపిస్తాయి. ఆ నడవ దాటివస్తే విశాలమైన అంగణం; తలెత్తి చూస్తే ఆకాశం కనిపిస్తుంది, కాని ఇంటికప్పు ఉక్కు తీగలతో మూసివుంటుంది. అంగణంకి నాలుగు పక్కలా పెద్ద పెద్ద గదులున్నాయి. ఒక గదిలో ముత్తువేలర్ రెండవ భార్య దాక్షాయణి ఉంటోంది. ఆవిడ పూజలూ, సపర్యాలూ అన్నీ ఆ గదిలోనే. దక్షిణ దిక్కుని చూస్తూ ఉన్న మరొక గదిలో ఆమె కూతురు వత్సలా, ఆమె భర్త ఉంటున్నారు. కూతురు మూలంగా ముత్తువేలర్కి ఇద్దరు ధౌహిత్రులు.

ఈ ముందు ప్రవేశం దాటితేనే ఈ గ్రంధాలయం ఉన్న మేడమీదెక్కి రావడానికి మెట్లు కనిపిస్తాయి. మెట్లకి అంటుకునే ఇంటి వెనకటితట్టు సాగుతోంది. ఇంచుమించు వెనకటితట్టు ఆకృతికూడా ముందు భాగం లాగే. ఆ మేడ కిటికీనుంచి చూస్తే అంగణంతోబాటు భాగ్యం ఉన్న గది కనబడుతుంది. దానికి ఎదురుగా ఉన్న మరొక గదిలో ఆమె కొడుకు సుందరలింగం, అతని భార్య గోమతి ఉంటున్నారు. అదేమో కాని స్వర్గం అనే నగరంనుంచి వెళ్లకొట్టబడినట్టు ఆ దంపతులు ఇక్కడకి వచ్చిన నిమిషంనుంచీ వాపోతూనే ఉన్నారు.

సుందరలింగం పట్టంలో ఒక స్నేహితుడుతో కలిసి ఏదో వ్యాపారం చెయ్యాలని నాలుగు సంవత్సరాలముందు అమెరికానుంచి రాగానే నాలుగు లక్షలు రూపాయలు ఇతన్ని అడిగి తీసుకొని వెళ్ళాడు; ఆ వ్యాపారం ఇంకా జరుగుతోందట.

కొన్నిరోజుల ముందు ఇతను పిలిచారని ఈ భార్యాభర్తలు ఇక్కడికి వచ్చివున్నారు. ఇతని కొడుకు తల్లి భాగ్యం పక్షం. కోడలు తను అత్తగారికి ప్రతిపక్షంలో ఉండాలనే పట్టుదలతో ముత్తువేలర్ రెండవ భార్య దాక్షాయణి పక్షం. దాక్షాయణికి ఒకటే కూతురు. ఆమెకి పెళ్ళైన తరువాత ఆ అల్లుడుకూడా ఇల్లరికంలోనే ఉంటున్నాడు.

తనకి చాలా దగ్గఱగా ఉన్న ఈ బంధువులని తప్పిస్తే, తన ఇద్దరు భార్యలూ ఒకరికొకరు పోటీపడుతూ, దారిన పోయే తమ తమ బంధువులని పిలిచి ఎంత ముందికి ఆ ఇంటిలో అతిథి సత్కారం జరుగుతోందని లెక్క పెట్టాలని ముత్తువేలర్ ఎప్పుడూ ప్రయాసపడలేదు.

ఇతన్ని చూడగానే వాళ్ళందరూ లేచి, మర్యాదగా నిలబడతారు.

". . . ఎప్పుడు వచ్చారు? ఊరులో అందరూ కులాసాగా ఉన్నారా? వానలు కురుస్తున్నాయా? పంటల పరిస్థితి ఎలాగుంది?" అని సహజంగా, నియమంగా, ఒక చిరునవ్వు నవ్వి అడగడం తప్పిస్తే అతనికి వాళ్ళగురించి ఏ లక్ష్యమూ లేదు. వారి మూలంగా తన కుటుంబంకి ఎంత లాభం, ఎంత నష్టం అని ఏ చింతా లేదు. తన ఇద్దరు భార్యలూ తమ తమ అభిలాషకి, సంతోషంకి, తగినట్టుగా, ఎది చేసినా సరే అని అతనికి పెద్దమనసు ఉన్నా వాళ్ళిద్దరూ సంతోషంగా లేరని - ఆ ఇద్దరి భార్యల మధ్య నిత్యమూ చెలరేగే గొడవలు, పోట్లాటలు - అతనికి తెలియజేసాయి. అందువలనే తన స్వేచ్ఛ, సంతోషం కాపాడుకోవాలని ముత్తువేలర్ వాళ్ళకి వొదిగివున్నారు. కాని ఆ కారణం వలనే అతని ఇద్దరు భార్యలూ అతనిపై పగ తీర్చుకోవాలని ఆవేశపడుతున్నారు.

ఇన్ని తిక్కటమక్కటల మధ్య అతను జీవించి ఉన్నారు; ఒక కుటుంబంకి అధికారిగా తన బాధ్యతలు నియమంగా నెరవేర్చివున్నారు; ఒక భాగ్యవంతమైన కుటుంబంకి వారసుగా, ఆ సంపదని అభివృద్ధి చేసారు. అదే సమయం తన పూర్వీకులలాగే తను ఆచరించవలసిన బాధ్యతలున్నా తన స్వధర్మంని కాపాడుకున్నారు. అంటే, ఎదుగుతున్న ఈ యుగంలో, సమాజంలో మారుతున్న కొలతలకి వశమయే రీతిలో తన మనసుని, ప్రజ్ఞని ఈ బాహ్య ప్రపంచంలో ఊరికినే విర్రవీగకుండా, లోతుగా, విశాలంగా, బుద్ధిసూక్ష్మతతో పెంచుకున్నారు. ఎదైనా సరే, ఇతనికి దానిగురించి స్పష్టంగా అవగాహన ఉంది. నిన్నవరకూ తన విచక్షణ మూలంగా తను అత్యంత స్థాయిలో కొనియాడిన ఆదర్శభావనలని, ఈ రోజు వివేకం, కొత్త అవగాహనతో, పడద్రోయాలంటే - వాటిని తప్పకుండా ద్వంసం చేసి తీరాలంటే - అదీ అతను ఎటువంటి భయమో, సంకోచమో, లేకుండా నిమ్మళంగా చెయ్యగలరు.

అందువలనే సామాజిక దోషాలకి అతను వశమవలేదు. సమాజంలో అతనికి మంచి గౌరవం ఉంది.

ఆ సమాజం తనకిచ్చిన బడాయి బిరుదులన్నీ ఇతను కృతజ్ఞతతో స్వీకరించారు: ఈ ఊరు కోవిలకి ఇతను ధర్మకర్త; Lions Club లో సభ్యులు; ఊరులో గౌరవార్థమైన ఒక న్యాయాధిపతి; కాని సమాజంలో ముఖ్యంగా ధనవంతులనే పీడించే దురలవాటులేవీ ఇతన్ని తాకనేలేదు. నూరు తాగుబోతులమధ్య, చపలం లేకుండా, మూతి ముడుచుకోకుండా గంటలకొలదీ మాటాడుతూ తన స్వధర్మం కాపాడుకొనే త్రాణ ఇతనికుంది.

ఈ విధంగా ఇతను తన్ను సరిదిద్దుకోడానికి ఒకటే కారణం, ఇతని ఆత్మలో నిగ్గుతున్న ఆకాంక్ష: నిత్యమూ అపూర్వమైన వివేకం, జ్ఞానం కోసం ఇతను తహతహపడుతున్నారు. కాలమంతా ఈ గ్రంధాలయంలో జీవించిన తరువాతకూడా ఇతనొక చిమ్మత పురుగుగా మారలేదు. ఇతని జ్ఞానంకి, ప్రవర్తనకి, ఎటువంటి విరుద్ధమూ లేదు.

ఈ నిర్ణయాలు, ఇటీవల వరకూ ఇతని సమాజం తిరస్కరించలేదు. కాని ఇప్పుడు - కొన్ని రోజులుగా - ఇతన్ని ఊరులో ఎలా దూషిస్తున్నారు!

కోవిల, చెరువుగట్టు, కాలేజీ, క్లబ్బు - ఇంతెందుకు, ఇతని ఇంట్లోనే - నలుగురు కలుసుకొనే ఏ జాగా ఐనా సరే - ఇతని గురించి ఎంత అమర్యాదగా అందరూ మాటాడుతున్నారు!

ఏం, ఎందుకు? ఇతని వివేకం, బ్రతుకుతీరు మధ్య వైరుధ్యం వచ్చేసిందా? 'అలాగేం కాదు, ఇది వ్యక్తిగత స్వేచ్ఛకి, ఈ సమాజం చెలాయించే ఆధిపత్యంకి మధ్య కలిగే వైరుధ్యం!' అని అనవచ్చా?

నలుగురు మూర్ఖులు కలిసి మొద్దుబారిన ఊహలు మోసుకొని తిరగడమే సమాజంకి చేసే సేవ అనే పరిస్థితి వచ్చేసిందంటే ఇక జ్ఞానుల ఉద్భవం ఒక దుశ్శకునంగా మారిపోవడం సహజమేకదా?

ఇతనొక సన్యాసిలాగ తన ఆస్తి, అంతస్తు, అనుబంధాలు త్యజించి, రెండవ జీవితం వెతుక్కుంటూ ఎక్కడికో వెళ్ళిపోతున్నారు. కాని రేపు ఈ సమాజంలో నలగురు

తనగురించి ఏమంటారో అని భయపడి ఇతను పారిపోతున్నట్టు ఎవరైనా మాటాడితే - వాళ్ళు తప్పకుండా అలాగ వాగుతారన్నది నిశ్చయం! - అది సాధ్యమవకూడదని ఇతను నిశ్చయించారు.

ఆ గ్రంధాలయంలో చాలా సేపు వెలుగుతూ ఉన్న అన్ని దీపాలని ఆర్పేసిన తరువాత ఆ బోర్లపడిన దీపం మాత్రం వెలుగుతోంది. సర్దార్ని వాత్సల్యంతో బుజ్జగిస్తూ మేజా అడుగున దాన్ని నిద్రపొమ్మని చెప్పేసి, పడకమీద కూర్చొని ముత్తువేలర్,

- ఇదిగో రాస్తున్నారు:

*"ఇది నేను నీకోసమే రాస్తున్నాను. నన్ను తప్పిస్తే నాకు ఇతరులందరూ అన్యులే కదా? అందుకే, నువ్వు ఎవరైనా సరే, ఇది నీకోసమే రాస్తున్నాను. నేను నిన్ను ఏకవచనంలో పిలిచి చెప్తున్నానని సంతోషపడు. ఏ గుంపుకీ నిజమంటే ఏమిటో బోధపడదు. గుంపుకి ఎది చూసినా మజావే! అది బడలినవారిని వేటాడుతుంది; నేరానికి తోడ్పడుతుంది; తనకిష్టం లేదంటే నీ ప్రాణంకి యూడైన చర్యలు న్యాయవిరుద్ధమని నీపై నేరం మోపుతుంది; ముద్దాయిగా నిన్ను కోర్టుకి ఈడ్చుతుంది, శిక్షింతుతుంది.*

*సమాజం అనేది స్వకీయమైన వ్యక్తుల కూటం. దానికి బలముంది; దుర్బలత కూడా ఉంది. కాని అది ఏకాకిగా ఉన్న వ్యక్తిలోని బలం సహించదు; అసమర్థత అంగీకరించదు. అదే సామాజిక న్యాయం, ధర్మం. స్వకీయమైన వ్యక్తికి ఇది తెలుసు, కాని అతను దానికి ఎదురుచెప్పడు, అందులో లాభం లేదు. ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగే న్యాయ విచారణలో సమాజం ఒక న్యాయమైన తీర్పు ఇవ్వవచ్చు, కాని ఒంటరి వ్యక్తికీ, సమాజంకీ మధ్య జరిగే ఉద్యమంలో సమాజంనుంచి న్యాయమైన తీర్పు ఎదురుచూడడంలో అర్థంలేదు. అందువలనే ఈ సమాజంలోని సభ్యులందరినీ వ్యక్తిగతంగా కలుసుకోవాలని నా కోరిక. వాళ్ళ తీర్పు కోసం కాదు, నా తీర్పుని ప్రకటించడానికి. కాని ఇది నేను ఈ సమాజంకి, వ్యక్తులకీ ఇచ్చే సందేశం కాదని వక్కాణించి చెప్తున్నాను. ఇది నేను కొనియాడేది స్వధర్మం అని మీకు బోధపడితే నాకది చాలు.*

స్వధర్మం అన్నది ఒత్తిడి వలన మనం మోసే ఒక నియమం కాదు. అప్రభావితంగా 'నేను నేనే!' అని సహజంగా మెలిగే ధోరణి అందులో ఉంది. అది స్వార్థం కాదు, ఆత్మత్యాగమూ కాదు. స్వధర్మం వలన తక్కిన ధర్మాలకి ఎటువంటి హానీ లేదు. స్వధర్మం పోగొట్టుకున్నవారు మరేం ధర్మమూ కాపాడలేరు.

నాగురించి తెలుసుకోడానికి ఏమీ లేదని నీ మనసులో ఉందేమో? నా గురించి ఎటువంటి తీర్పూ ఇవ్వడానికి నీకు బాధ్యత లేదని నువ్వు తప్పించుకున్నావంటే, నీకు నామీదున్న గౌరవంలాగ నాకూ నీమీద గౌరవం ఉందని చెప్తున్నాను. 'ఇతని గురించి అన్నీ తెలుసు!' అని అహంకారంతో నాగురించి పొరబాటుగా గణించే ఈ సమాజమనే నలుగురులో నువ్వూ ఒక వ్యక్తి అంటే మనిద్దరం ఒకరినొకరు అవగాహన చేసుకోడం మంచిదేకదా? నాకు నా గురించి పూర్తిగా అవగాహన లేదు; నీకూ నీగురించి పూర్తిగా తెలియదు; మరి నాగుంరించి నీకన్నీ తెలుసని నువ్వు నొక్కి చెప్పావంటే అది ఎంత అబద్ధం!

నాగురించి ఊరులో ఎన్ని కబుర్లు!

నలుగురు గౌరవంకి అర్హుడైన నేను ఇప్పుడు నాశనమైపోయానంటున్నారు; ఒకటి కాదు, ఇద్దరు సుగుణవతులు ఇంటిలో ఉన్నా నేను ఒక తుంటరి వలలో పడిపోయానట! మనవలు, మనవరాళ్ళ ముద్దు ముచ్చటలు చూడవలసిన వయస్సులో నాకు పరస్త్రీ మోహం వచ్చేసిందట! నేను పెద్దమనిషి అనే మారువేషంలో అందరినీ మోసం చేస్తున్నానట!

ఎటు తిరిగినా ఈ విమర్శలు నా చెవులకి వినిపించిన బాషలోనూ, చాలా సార్లు పరిచితులు నన్ను చూడగానే వాళ్ళలో గభీమని చోటుచేసుకున్న మౌనంలోనూ, ఇటీవల కొన్ని వారాలుగా నేను వింటున్నాను. వీటికన్నిటికీ నేను జవాబు చెప్పాలనే అగత్యం లేదని నాకు తెలుసు. కాని యాభై సంవత్సరాలుగా - ఇష్టమున్నా లేకున్నా - నలుగురి పొగడ్తలకి అలవాటుపడిపోయిన నాకు ఈ విమర్శలు మృదువైన హృదయంలో మన్ను పోసినట్టు గుచ్చుతూనే ఉన్నాయి.

అది నిజమేనా? నేనొక తుంటరి వలలో పడిపోయానంటున్నారు. అది నిజమేనా?'

మిద్దె క్రింద భాగం నుంచి భాగ్యం దగ్గు మళ్ళీ వినిపిస్తోంది. దానితోబాటు ఆవిడ విలపించే పాట కూడా స్పష్టంగా అతను విన్నారు. ముత్తువేలర్ రాయడం ఆపి, ఒక చిరునవ్వు నవ్వి, తలెత్తి చూసారు.

'మన సమాజంలో స్త్రీలు తమ ఏడ్పులు, పడుతున్నబాధలు ఒక విద్యగా నేర్చుకొని దాన్ని ఒక కళగా పోషించడం అలవాటు చేసుకున్నారు! How sadistic' అని అతను ఒక నిట్టూర్పు వదిలారు: 'పాపం! . . . భాగ్యం . . . '

భాగ్యం తన భార్య అని అతను శ్రమతో గుర్తు చేసుకుంటున్నారు. ఆ జ్ఞాపకం వచ్చే వయస్సుకి చాలా సంవత్సరాలకి ముందే అటువంటి చుట్టరికం ఆమెతో అతనికి ఖాయమైపోయింది. ఒక ఘనమైన కుటుంబంలో పెళ్ళి చేసుకొని, పడుచుగానే, వితంతువుగా, ముత్తువేలుకంటే ఒక సంవత్సరం చిన్నదైన బాలిక భాగ్యంతో పుట్టినిల్లుకి వచ్చేసిన ముత్తువేల్ అత్త ఆస్తి మరెక్కడా పోకూడదని పెద్దలు పాత సామాజిక నియమం ప్రకారం ఆ ఇద్దరు పిల్లలని భార్యాభర్తలనే భావనలోనే పెంచారు.

ముత్తువేల్ పదేళ్ళ బాలకుడుగా ఉన్నప్పుడు వాళ్ళ ఇంటిలో ఒక పెద్ద వేడుక జరిగింది. ఊరులో ఉత్సవం జరిగే ధోరణిలో ఊరంతా వాళ్ళ ఇంటిలోనే కాపురం చేసారు; వాళ్ళ వీధిని పూర్తిగా ఆవరించినట్టు బ్రహ్మాండమైన పందిరి వేసారు; పట్టంనుంచి వాద్యమేళం, తంజావూరునుంచి నాదస్వర బృందం వచ్చి ఒకరికొకరు పోటీపడుతూ శ్రోతలిని ఆహ్లాదపరిచారు; ముత్తువేలుకి మొకమకల తొప్పి, కోటు, షరాయి తొడిగించారు; కోటు జేబునిండా మిఠాయిలు విరగపడుతుంటే వాడికి ఏంత హాయిగా ఉంది! భాగ్యం కూడా పట్టు పరికిణీ, చోలీ తొడుక్కుంది. ఇద్దరు పిల్లలూ కలిసి ఏ గదిలోకి వెళ్ళి ఇష్టం వచ్చినట్టు ఒడిలో తినుబండారాలు నింపుకొని తినడం ఎంత మజాగా ఉంది! ఆ ఉత్సాహంతో ఆ పిల్లలు దాగుడుమూతలు ఆడారు. ఆటలో టక్కుగా దెబ్బలాడుకునేవారు . . .

"తాతయ్యా . . . ముత్తుని చూసారా? నా జుత్తుని లాగుతున్నాడు! . . . ఒరేయ్, ముత్తూ . . . నన్ను వదల్రా . . . " అని బాలిక భాగ్యం గోల పెడుతూంటే తాతగారు వాళ్ళిందరికీ ఆ కొత్త చుట్టరికం బోధపరిచారు.

"పొరబాటమ్మా! . . . వాడు నీ మొగుడు . . . నువ్వు వాడి పేరు చెప్పకూడదు, 'బావ' అని పిలవాలి . . . వాడు, వీడు అనకూడదు! 'రండి' అని మర్యాదగా పిలవాలి! . . . ఒరేయ్, ముత్తూ . . . నీకూ ఇదే పాఠంరా . . . భాగ్యం నీ పెళ్ళాం . . . దాన్ని ప్రేమతో చూసుకోవాలి . . . " అని ఇద్దరినీ దగ్గఱకి రమ్మని పిలిచి తాతగారు తన ఎదుట నిల్చోమన్నారు. బాలిక భాగ్యంని చూసి

"ఏదీ, చెప్పు చూద్దాం . . . 'బావ', రండి . . . "

"ఊహూం . . . నాకు సిగ్గేస్తోంది! . . . "

"ఒరేయ్ ముత్తూ . . . నువ్వు చెప్పు, చూద్దాం . . . "

"బావ, రండి . . . "

"ఛీ, వెధవా! అలాగ అది చెప్పాలిరా! అది నీ పెళ్ళాం. ఏదీ, నువ్వు దాన్ని పిలు, చూద్దాం? . . . "

"ఏమే, నా పెళ్ళాం భాగ్యం . . . "

ముత్తువేల్ అలాగ పిలవడం తాతయ్య మనసుకి నచ్చలేదు. కాని దాన్ని ఎలా సవరించడమని అతనికి బోధపడలేదు. 'సరే, కాలక్రమంలో సర్దుకొని పోతారు!' అని అతను ఊరుకున్నారు.

ఆ తరువాత, తన ఆశలన్నీ తీరిన తరువాత, అతను కాశీకి వెళ్ళి చాలా కాలం అక్కడే ఉన్నారు.

తాతయ్య తరువాత భాగ్యంకి, ముత్తువేలుకి మధ్య ఉన్న బంధుత్వం స్థిరపరచాలని కుటుంబంలో అందరూ చాలా శ్రమపడ్డారు.

చుట్టరికాలు మాటవరుసకి స్థిరంగా నిలబడిపోయాయి. కాని భాగ్యం, ముత్తువేలు హృదయాల్లో ఆ భావన వలన ప్రత్యేకంగా ఎటువంటి అవగాహన మొలకెత్తనేలేదు.

** ** **

వీధిలో, ఇంటిముందు, యెద్దుల బండి నిలబడి ఉంది. పెళ్ళికొడుకు ముత్తువేల్, అతని భార్య భాగ్యం బడికి వెళ్తున్నారు. సొగసైన దుస్తులులో తళతళలాడే ఇద్దరు పిల్లలని నౌకరులు ఎత్తుకొనివచ్చి బండిలో కూర్చోబెట్టారు. పెళ్ళి ఊరేగింపులాగ బండి బడికి ప్రయాణం చేసినప్పుడు ఆ ఇద్దరు పిల్లలకి ఆ ఆట మజాగానే ఉంది. ఆ బండి

అగ్రహారం మలుపు దాటి రహదారి ప్రవేశించినప్పుడు తన ఇంటి గుమ్మంలో మాసిపోయిన పంచె ధరించి, చెయిలో ఒక సంచిలో అల్పాహారంతో కాచుకొనివున్న ఆ బ్రాహ్మణ పిల్లవాడు వైత్తా, ఆ బండిని చూడగానే పరుగెత్తుకొనివచ్చి దానితో తన్ను - నౌకరులలో ఒకతని దయ వలన - చేర్చుకొని కొన్నిరోజులు ప్రయాణం చేసేవాడు.

బడిలో . . .

"ఒరేయ్ ముత్తూ . . . నీ చెల్లెలు ఏడుస్తోందిరా! . . . "

"అది వాడి చెల్లెలు కాదురా, వాడి పెళ్ళాం! . . . "

వాళ్ళిద్దరినీ కలిపి తక్కిన పిల్లలు ఎగతాళి చేస్తున్నారు. మొహం ఎర్రబారిపోయి ముత్తువేల్ ఏడ్చే సమయంలో వైత్తా ఒక మంచి సలహా ఇచ్చాడు:

"ఒరేయ్ ముత్తూ . . . ఇంటిలో అది నీ పెళ్ళాంగా ఉండనీ! . . . బడిలో నీకు చెల్లెలుగా ఉండనీ!"

ఆటలాడే హక్కు ఈ పిటికి సమాజంకి ఉంది; అలాగే ముద్దైన పసి హృదయాలకీ ఉంది.

ఇంటికీ, బడికీ మధ్య జరిగే ఈ ఆటల పోటీలో భాగ్యం ఐదవ క్లాసుతో చదువు ఆపేసింది. అప్పుడు ముత్తువేల్ ఏడవ క్లాసు చదువుతున్నాడు. వాడికి పదిహేడు నిండాయి; భాగ్యంకి పదహారు.

*'అయ్యో, అది ఎంత విపరీతమైన ఆట! నా తల్లిదండ్రులు, బంధువులు, ఎంత అసహ్యంగా, క్రూరంగా, ఒక బోనులో మా ఇద్దరినీ బంధించారు! ఆ క్రూరత్వం, గందరగోళం అప్పుడు నాకు బోధపడలేదు. అదొక కుప్పిగంతు, దాని ప్రభావం అప్పుడుకూడా మారనేలేదు. బాధ్యతలు మోయలేని వయస్సులో పూచీ లేకుండా నేనూ, భాగ్యం ఆ ఆటలో పాల్గొన్నాం. మా ఇంటి గోశాలలో ఆవులని జంటగట్టుతారే, ఆ దృశ్యమే కొన్ని సంవత్సరాల తరువాత మా దాంపత్య జీవితం గురించి ఆలోచించినప్పుడెల్లా నాకు గుర్తుకి వస్తుంది.*

*నా పద్దెనిమిదవ వయస్సులో నా కుటుంబం, ఆస్తి, గౌరవం, ప్రతిష్ఠ అనే అన్ని బాధ్యతలన్నీ నా భుజాలమీద ఎక్కించేసారు. నాకు వారసుగా అర్హత వచ్చేసిందట! నాన్నగారు పోయిన తరువాత నాకెందుకు చదువు? నాకున్న ఆస్తితో తొమ్మిది*

*తరాలు పూరికే కూర్చొని కాలం గడపవచ్చుకదా? ఈ 'కూర్చొని కాలం గడపవచ్చు' అనే సూత్రాన్ని వేద వాక్యంగా ఆరాధించే పరంపర సంప్రదాయాన్ని నేను ఉల్లంఘించడం ఎలాగ?*

*మందకొండితనం అనే ఒక మాట ఉందే, దానికి సమస్త అర్థం ఈ జీవితమే అనాలి.*

*"ఏమండోయ్, నేనెవరో మీకు గుర్తుందా?" అని ఒక పిలుపు విన్న క్షణమే - మరుగుపడిన మా చుట్టరికాన్ని పునరుద్ధరించాలనే ఉద్దేశంతో, బిగువైన పిలకతో, ఛాతీని కప్పుకున్న అంగవస్త్రంతో, ఛాతీమీద రెండుచేతులూ ఆనుకుంటూ, ఇంటిముందున్న పందిరి వెదురు స్తంబం దగ్గర నిలబడి నన్ను ఆకర్షించిన కళ్ళలోని ఆ తీక్షణత నేను గ్రహించాను; అదే నా అదృష్టం అనాలి. లేకపోతే నేను కూడా మందబుద్ధితో ఆ అడుసులో మునిగి చచ్చిపోయివుంటాను.'*

'ఇన్ని పటాలమధ్య వాడి పటం లేదే!" అని ఎప్పటిలాగే ముత్తువేల్ బాధపడుతుంటే , వాడి జ్ఞాపకంలో అతని కళ్ళు ప్రకాశించాయి; రాయడం ఆపి అతను తలెత్తారు.

ప్రాథమిక బడిలో చదువుతున్నప్పుడు పైత్తా పిలక, అల్లిన జడ, చొక్కాయి లేకుండా జందెం, కాలిచీలమండ వరకూ కప్పుకున్న తువ్వాలు, చెయిలో పుస్తకం, సంచిలో అల్పాహారం - వీటితో యెద్దుల బండికి వెనక పరుగెత్తుకొని వచ్చేవాడు. అలాగ పరిచయమైనవాడిని ఐదు సంవత్సరాల ఎడబాటు తరువాత గభీమని ఇప్పుడు అతను చూస్తున్నారు. ఆ భంగిమ - బాలకృష్ణుడు ధోరణిలో వాడి పిలుపు - అతని మనసులో ఇప్పుడు కూడా చెక్కుచెదరకుండా ఉంది.

"ఎవరు చెప్మా?" ఒక నిమిషం అతను పోల్చుకోలేదు.

"ఓహో, నువ్వా? . . . ఒరేయ్ పైత్తా, రా . . . రా . . . " అని బిగ్గరగా, ఊరులో అందరినీ జమకట్టే ధోరణిలో అతను వాడిని పిలిచారు.

ఇంతసేపూ, ప్రాథమిక బడిలో కలిసి చదువుకున్నందువలన అతని ముందు చనువుగా మెలగడానికి తనకేం విశేషాధికారం లేదని జంకుతూ దూరంలో నిలబడిన పైత్తాని ఆ ఆహ్వానం ఒకే యీడ్పులో లాగినట్టనిపించింది.

ముత్తువేలుకి వాడిని చూసి ఒకటే ఆశ్చర్యం. ఏమీ మాటాడకుండా ఇద్దరూ వొకరికొకరు మొహాలు చూసుకొని గభీమని నవ్వుకున్నారు.

"నీకు గుర్తుందా?" అని ఏదో జ్ఞాపకంతో ముత్తువేల్ నవ్వాడు.

"ఒక సారి మనం అమ్మవారి కోవిల పక్కనున్న తోటలో రేగుపళ్లు కోసాం . . . "

ఆ తరువాత మాస్టరుగారు బెత్తంతో తన్ను వాయించడం పైత్తా గుర్తుచేసుకున్నాడు.

ఆ పాత జ్ఞాపకాలన్నీ తలపోసుకుంటూ ఇద్దరూ ఆనందించారు; పైత్తా స్నేహంలో ముత్తువేల్ తన బాధలు, కష్టాలు, పూర్తిగా మరిచిపోయాడు.

'వీడు ఇంత ధనవంతుడుకదా, వీడికేం కష్టం ఉంటుంది?' అనే పైత్తా మొదట్లో అనుకున్నాడు.

ముత్తువేల్ కూడా తన అంతరంగిక భావనలు పైత్తాకి తెలియజేయకుండా దాచుకున్నాడు; వాటిగురించి మాటాడానికి అప్పుడు వాడికి త్రాణ లేదు.

తనకీ, భాగ్యంకీ దాంపత్యంలో ఏర్పడిన, తను పడుతున్న మానసిక వ్యధని బాహాటంగా చెప్పడానికి ముత్తువేల్ జంకాడు. ఆ యాతననుంచి తప్పుకోడానికి ఏదైనా మార్గం ఉందా అని వాడు వెతుకుతున్నాడు.

పాత జ్ఞాపకాలు నెమరువేసుకొని, ఈ కాలంకి తిరిగివచ్చిన తరువాత, ఒకరినొకరు అడిగి తెలుసుకోవలసిన కబుర్లు ఎన్నో ఉన్నాయని గ్రహించడానికే ఇద్దరికీ రెండు రోజులు పట్టాయి.

పైత్తాకి తెలిసినవారూ, దగ్గర బంధువులూ, ఎవరూ ఇప్పుడు ఆ ఊరులో లేరు. ముందటి వారం వరకూ ఒంటరిగా ఈ ఊరులో ఉంటున్న వాడి అమ్మమ్మ కన్నుమూసేసింది. ఆవిడ అంతిమక్రియలు చేసినందుకు వాడికి ఆవిడకున్న చిన్న ఇల్లు దొరికింది. ఇక తన పెద్ద చదువుకి ఆ ఇల్లు అమ్మాలని పైత్తా ఆలోచించినప్పుడు, ముత్తువేలుని గుర్తుటేసుకున్నాడట.

'వాడికి గాని నా జ్ఞాపకం ఉంటే స్నేహభావంతో మెలుగుతాను; లేకపోతే ఊరులో ఒక పెద్దమనిషితో వ్యాపారం చేస్తున్నట్టు ఆ ఇల్లు అమ్మడానికి సలహా అడుగుతాను!' అనే పథకంతో పైత్తా ఆ ఉరుకి వచ్చాడు.

"అసలు చదువుకి ఆధారం ఏమిటి? 'ఉదర నిమిత్తంకి మరేం దారి తెలియక నెలకొకసారి జీతంకోసం మనం అలవరించుకున్న శిక్షణ అది!' అనే నా ఊహని చెదరగొట్టిన బోధన విశ్వరూపం నేను వైత్తాలో గ్రహించాను.

నన్ను అనురాగంతో పిలిచి, పరుగెత్తుకొనివచ్చి, కౌగిలించుకున్నది వైత్తా కాదు. వాడొక జ్ఞానవంతుడు, నాకు గురువు. వాడి రాకతో నన్ను చుట్టుకొనివున్న అన్ని మతిభ్రమల తెరలూ చినిగిపోయాయి. భూస్వామిగా నా జీవితం ఎంత అసహ్యంగా ఉందని నేను గ్రహించాను: కూలీలతో వెట్టిచాకిరి చేయించుకోడం; పెత్తనం చెలాయించడం; వారి బతుకులతో చెలగాటమాడడం; డబ్బు కూడబెట్టుకొని, పొలాలు పోషించుకొని . . . 'ఇదేం పాడు జన్మ!' అని అన్నీ వొదిలేసి, వాడితో నేనూ పారిపోయి ఏ కాలేజీలో విద్యార్థిగా చేరితే? . . . ' అనే తృష్ణ నాలో లేచింది. కాని 'వాడు ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. ఏడవక్లాసుతో నా చదువు సమాప్తం!' అని నేను తడబడుతుంటే వాడు చెప్పిన ఉపదేశం నాకు ఆత్మబలం ఇచ్చింది; అది నేనెప్పుడూ మరిచిపోను.

వాడు చెప్పాడు:

"'బడులూ, కాలేజీలూ, అసలైన జ్ఞానవంతులని ఉత్పత్తి చెయ్యలేవు. చదువు గురించి నీ పూర్వీకుల మూఢ నమ్మకాలు నాకు చెప్పావ్. అవి పూర్తిగా అబద్ధం కాదు. ఈ రోజుల్లో మనం చదువుతున్న ఆంగ్లేయుల విద్యా విధానం మనకిచ్చినది మెకాలే అనే ఒక ఆంగ్లేయ ప్రభువు. అతను నాగరిక భాషలో చెప్పినదే నీ పూర్వీకుల పామర బాషలో చెప్పారు. 'ఇంగ్లాండుకి చాలా విశ్వాసం గల పౌరులని - ఇంగ్లీషే చదువుకున్న ఒక వంశాన్ని - ఉత్పత్తి చెయ్యాలనే ఆ పథకం' గుమాస్తాలనే ఉత్పత్తి చేస్తుందని నీ కుటుంబం ఆలోచిస్తే అదేం పొరబాటు కాదు. బుద్ధిని అభివృద్ధి చేసుకోడానికీ, శుద్ధ జ్ఞానం పొందడానికీ వయస్సు, అంతస్తు ఎప్పుడూ అడ్డురావు. అదే ఒక వ్యక్తి స్వధర్మం. నేనూ ఆ ఆంగ్లేయుల విద్యావిధానంలోనే పెరిగాను. నాకంటే స్వేచ్ఛగా విద్యావంతుడవడానికి అవకాశం నీకెప్పుడూ ఉంది, ఇంకా ఉంది. నేనూ క్లాసులో చదువుకోడం కంటే లైబ్రరీలో ఎక్కువగా చదువుతున్నాను. నాకుగాని డబ్బు

*ఉందనుకో . . . " అని అపేక్షించే వాడి తీవ్రమైన కళ్ళు హాయిగా ఊహాప్రపంచంలో తేలుతూంటే . . .*

*"డబ్బు ఉంటే? . . . " అని మధ్యలో నేను జోక్యం చేసుకున్నాను.*

*"జీవితంలో మరేం కావాలి?జీవితమంతా గడపడానికి ఒక లైబ్రరీ! . . . నీకు తెలుసా - ఈ లోకంలో ఎన్ని రకాల పుస్తకాలున్నాయో?" అని వాడు పుస్తకాలగురించి, వాటి యోగ్యత, వైరుధ్యం, ప్రశ్నలగురించి నాతో రోజంతా మాటాడాడు.*

*ఆ సమయం నన్ను చూడడానికి వచ్చినప్పుడు వైత్తా ఒక వారం నాతో ఉన్నాడు. ఆ తరువాత తరచుగా వచ్చాడు. వాడిని నేను నా గురువుగా స్వీకరించాను. వాడూ ఒక ఉపాధ్యాయుఁడులాగ నాకు సులభంగా, నాకు అర్థమయే విధంగా అన్నీ బోధించాడు; ఈ లైబ్రరీ స్థాపించినది వాడే.*

*ఆఖరికి మూడు సంవత్సరాల తరువాత - వాడు M.A., చదువుతున్నప్పుడు, శెలవులకి ఇక్కడకి వచ్చినప్పుడు నిమోనియా జ్వరంతో ఈ లైబ్రరీలో రోజులకొద్దీ పడియున్నప్పుడుకూడా, చదువుతూనే ఉండేవాడు. తను చదవలేకపోయినా, నన్ను పక్కనబెట్టుకొని చదవడం అలవాటు చేసుకున్నాడు . . .*

*అప్పుడు ఈ ముత్తువేలుని ఈ స్థాయికి పాఠకుడుగా చేసిన అభిమానంతో శాశ్వతంగా కళ్ళు మూసాడు . . . "*

'ఇదేంటి? నేను ఏదో రాయాలని ఆరంభించి ఇలాగ వైత్తా గురించే రాస్తున్నాను!' అని గభీమని తనకేర్పడిన ప్రజ్ఞతో గోడమీదున్న గడియారంమీద ముత్కువేలర్ టార్చ్లైటు ప్రయోగించారు.

రెండు గంటలకి ఇంకా కొన్ని నిమిషాలే బాకీ అని తెలిసింది.

చటుక్కున 'ఈ నిమిషం ఎంత అర్థవంతంగా కనిపిస్తోంది!' అని అతనికి ఆలోచన కలిగింది.

*'ఈ రాత్రితో నేను ఇదివరకూ జీవించిన జీవితం లెక్కలు పరిష్కరించుకున్నట్టు ఐపోతుంది. దీన్నిపూర్తిగా తెంచుకొని మరొక జీవితంకి నేను ఇప్పుడు సిద్ధంగా ఉన్నాను. నాగురించి అందరూ ఏమని మాటాడుకుంటారో? ఇప్పుడు నేను ఎన్నెన్ని మాటలు వింటున్నాను! నాతో, నా ప్రవర్తనతో ఇతరులు ఏకీభవించినా,*

ఏకీభవించకపోయినా నా మనసు విప్పి అన్నీ చెప్పాలనేకదా నేను పూనుకున్నాను? నాకు నాగరించి ఉన్న అవగాహన మరెవరికీ లేనప్పుడు, నా సందేశం మీకు వినిపించడం నా బాధ్యత అని ఇది రాస్తున్నాను . . . ఇప్పుడు ఆ పాత జ్ఞాపకాలు గుర్తుచేసుకుంటే నాకెటువంటి విచారమూ లేదు, నా మనసు సంతోషంగానే ఉంది. వ్యక్తిగతంగా నాకు జీవితంలో ఎన్నో కొఱతలు ఉన్నా నేను అందుకోసం బాధపడను. నాకు పన్నెండేళ్ళు నిండగానే నాకూ భాగ్యంకి పెళ్ళి చేసి నా పదిహేడవ వయస్సులో దాంపత్య జీవితంలో నన్ను నిర్బంధిచినది ఎంత పెద్ద ఘోరం! అప్పుడు భాగ్యకి పదహారు నిండాయి, అప్పుడే అది పూర్తిగా ఎదిగిన స్త్రీగా కనిపించింది. కాని మనసులో అదికూడా నాలాగే ఒక బిడ్డ . . . బిడ్డలని తెలిసే కాబోలు పెద్దలు కొందరు చులకనగా, జాడగా, మరికొందరు సాహసంతో నాకు కామశాస్త్ర బోధనలు చేసారు! వీళ్ళందరూ ఆ ప్రజ్ఞలోనూ ఎంత అపక్వమైన బిడ్డలుగా ఉండేవారని ఇప్పుడే నేను తెలుసుకున్నాను! Sex! దాని గురించి ఎన్ని పుస్తకాలు! Sigmund Freud, Havelock Ellis తో ఆరంభించి ఇటీవల Dr. Kinsey వరకూ ఎంతమంది Sex గురించి పరిశోధనలు చేసి గ్రంధాలు రాసివున్నారు! ఒక బీరువా నిండా Sex గురించే ఎన్ని పుస్తకాలు! ఆ Kinsey గ్రంధంలో 5,940 స్త్రీలని వేరేవేరేగా కలుసుకొని వాళ్ళ లైంగిక జీవితం, లైంగిక అనుభవం, అందులోని లోపాలు, వంకరలు, మాఋపాట్లు గురించి లోతుగానూ, బాహాటంగానూ రాసివున్నారు! మన ధేశం స్త్రీలు - తమిళనాడు స్త్రీలెవరైనా - అంత ధైర్యంగా తమ అంతరంగ జీవితాలని తెలుసుకోగలరా? ఈ ఆధునిక యుగంలో లేచిన లైంగిక అనుభవాలు, ప్రశ్నలు ఎదుర్కొనడానికి ఆ స్త్రీలు ఎంత ముందుకి సాగియున్నారు! మరి, ఇక్కడో? భర్త తన పెళ్ళాం మనసులో ఏముందో తెలుసుకోడమే అసాధ్యంగా ఉంది! Sex అనేది ఇక్కడ ఒక అనివార్యమైన పాపం అనే భావన వలన, దాన్ని రహస్యంగా, కపటంగా భద్రపరచి, దానిగుంచి తెలుసుకోడం, మాటాడం అసహ్యం అని మనం శాస్వతంగా అజ్ఞానంతో పొర్లుతున్నాం. పుస్తకాల్లో Sex గురించి చదివినప్పుడు మనం కల్పించుకున్నట్టు లేదు . . . నన్నడిగితే నాకు Sex అనేది ఒక అనుభవం కాదు, అది జ్ఞానంగానే నిలిచిపోయింది! కాని ఇటీవల - నా యాభైయ్యో వయసులో - నాకు ఒక అనుభవంగా కనిపిస్తోంది . . . నా దాంపత్య జీవితంలో Sex

*అనేది స్వాభిమానంని పాడుచేసే, అవమానకరమైన, హీనమైన, చిన్నబోయిన అనుభవం ఐపోయింది . . .*

భాగ్యంతో గడపిన ఆ భయంకర రాత్రులు . . . ఏం, ఎందుకు, అలాగ? ఆ మొదటి అనుభవం తరువాత దానిగురించి అతను ఎప్పుడు గుర్తు చేసుకున్నా . . .

తన అంతరంగ లైంగిక జీవితం ఎందుకు నిరాశగా మారిందని అతను ఆలోచిస్తున్నారు. దానికి జవాబు అతనికి బోధపడినట్టు ఇతరులకి బోధపడదు. అందుకు అగత్యమూ లేదు. తప్పనిసరి అంటే బోధపడుతుంది.

భాగ్యం పదహారేళ్ళ యువతిగా కాపురంకి వచ్చింది. ఆమె పూర్తిగా గ్రామీణ వాతావరణంలో పెరిగింది. ముప్పైసంవత్సరాలముదు తమిళ దేశం గ్రామంలో ఏది సొగసో, ఏది నాగరికమో, అవన్నీ ఆమె భారంగా మోసింది. నిన్నవరకూ - ఎందుకు, ఇవాళ ఉదయం కూడా - ఆమె ముత్తువేల్ తో జగడమాడినప్పుడు అత్త వచ్చి దాన్ని మందలించింది:

“ఏమే, భాగ్యం . . . వాడు నీ మొగుడని మరిచి పోయావా? ఎందుకు వాడితో ఎప్పుడూ దెబ్బలాట? అందరూ చూసి నవ్వుతున్నారు . . . ”

“అవును మరి . . . వాడెందుకు నామీద నీళ్ళు పోస్తున్నాడు?”

“ ‘వాడు’, ‘వీడు’ అని అనకూడదని నేను నీకు వెయ్యిసార్లు చెప్పాను! ‘అతను’ అని అనాలి!’ అని అత్త కొంచెం కోపంతోనూ, గారాబంతోనూ ఆమె బుగ్గ గిల్లింది.

“అవునులే . . . పెద్ద మొగుడు!” అని పెదిమలు మెలిదిప్పుకుంటూ, తనకెవరో చెప్పిన బోధన, నిర్బంధం కోసం తల వొంచి భాగ్యం ఆ గదిలో ప్రవేశించినప్పుడు ముత్తువేల్ గుండె వేగంగా కొట్టుకుంది.

ఇవన్నీ ఎందుకని వాడికి తెలుసు. భాగ్యంకీ తెలుసు. కాని ఇద్దరి మనసులోనూ దానిగురించి ఇష్టం లేదు. ఇద్దరికీ ‘అది పెద్దలు రహస్యంగా చేసే ఒక అసహ్యం!’ అనే భావన మారని వయస్సు. ఉదయం నుంచే ముత్తువేల్ మనసులో ఎక్కడైనా పారిపోవాలనికూడా అనిపించింది. కారణం లేకుండా ఏడ్పూ వచ్చింది. కాని ఎలాగైనా ఈ కుట్రనుంచి తను తప్పించుకోడం అసాధ్యమని తెలిసినతరువాత ఆ అనుభవం వాడికి ఎంత భయంకరంగా అగుపించింది! ఆ తరువాత ఒక ఆలోచన: ‘నేనెందుకు

భయపడాలి? అది మన భాగ్యమే కదా? ఈ రాత్రి కొంచెం బాధగా ఉంటుంది, ఆ గొడవ తరువాత మేమిద్దరం నిద్రపోతాం, అంతేకదా?

ఇంతలో భాగ్యం వచ్చింది. ఆమె గదిలో ప్రవేశించగానే ఆమె వెనుక తలుపు మూసుకుంది. ఆ క్షణమే తన్ను ఆవరించుకున్న జంకు, భయం మాయమైనట్టు భాగ్యం తలెత్తి చూసింది. ముత్తువేల్ రెప్పవాలచకుండా ఆమెను చూసాడు.

"అబ్బా, ఇదేంటి పిచ్చి మొహం- . . . ." భాగ్యంకి తన ప్రేమని తెలియపరచడానికి వేరే మాటలేవీ తెలియవు కాబోలు!

"మొహం నచ్చలేదంటే, నిన్నెవరు చూడమన్నారు? నీ మొహం ఎలావుందని నీకు తెలుసా?" అని ముత్తువేల్ చిఱచిఱలాడాడు.

ఇద్దరూ మౌనంగా గదిలో మూలకి మూల కూర్చున్నారు. ముత్తువేల్ వెనుకనుంచి ఆమెని ధీర్ఘంగా చూసాడు:

"నాకెందుకు దీనిమీద ద్వేషం? . . . నిజంగానే అది ద్వేషమా? . . . " అని ఏదేదో తలబోసుకుంటూ ఆమెను తేఱిపార చూసాడు. 'దీన్ని మరెవరినైనా పెళ్ళిచేసుకొని ఉంటే ఎంత బాగున్ను!' అని వాడికి ఆలోచన కలిగింది. అందుకు కారణం తనకి ఆమెపై ఉన్న పగ కాదు అని అప్పుడే వాడికి తోచింది.

అత్త ఆస్తి పరాయివాడికి పోనివ్వకూడదు అనే కారణం వలనే ఈ పెళ్ళి జరిగిందని వాడికి తెలుసు. 'కారణం ఏదైనా, ఇప్పుడు నేను దీని భర్త, ఇది నా భార్య!' అని తన ఐదు సంవత్సరాల బంధుత్వాని ఈ నిమిషం స్వార్థంగా గుర్తుచేసుకున్నాడు. ముందురోజుల్లో, బడిలో, అన్నయ్య - చెల్లెలు గా ఉన్నట్టు ఇక ఉండడం సాగదు, కాని, భాగ్యకి ఆ ప్రజ్ఞ ఉందా?

'నేను దాని భర్త. నేనే స్వచ్ఛందంగా వెళ్ళి దానితో మా బంధుత్వం రూఢీచేసుకోవాలి. నేనుగాని వొదిగివుంటే దానిమీద నాకు ప్రేమ లేదని దానికి తెలిసిపోతుంది . . . ఆ తరువాత జీవితమంతా బాధపడుతుంది . . . '

"భాగ్యం . . . "

"ఏంటి?"

"నీకెందుకు నామీద కోపం?"

"నాకేం కోపం లేదు . . . నాకేదీ ఇష్టం లేదు . . . "

"నాకూ ఇష్టం లేదు . . . కాని మనం ఏం చేస్తాం, చెప్పు . . ."

"ఎందుకీ అబద్ధం?నీకు ఇష్టం వచ్చినట్టు నన్ను బలవంతం చెయ్యాలని . . . "

"అలాగేం కాదు . . . నాకూ ఇందులో ఇష్టం లేదు . . . "

"నిన్ను నేనిక 'నువ్వు' అని పిలవవకూడదంటున్నారే? . . . "

"అవును, అలాగే అంటున్నారు . . . "

"నిన్ను మరెలా పిలవాలని నాకు తెలియదే? . . . "

"విను, ఒక పని చేద్దాం . . . మనం ఒంటరిగా ఉన్నప్పుడు నన్ను 'నువ్వు' అని పిలు. నలుగురి మధ్య 'మీరు' అని పిలు . . . సరేనా?"

"అలా పిలుస్తే నీకు పెద్ద గౌరవం, అవునా?"

ముత్తువేల్ మౌనంగా తల ఊపాడు.

"మనం ఇప్పుడు భార్యాభర్తలు ఐపోయామా?"

"లేదు."

"ఏం, ఎందుకు?  మనకి పెళ్ళి ఐపోయిందిగా?"

"పెళ్ళైపోయింది. కాని శాంతి ముహూర్తం ఇవాళే కదా?"

"అదెందుకు?"

"నీకు నిజంగా దానిగురించి ఏమీ తెలియదా? తెలియదంటే చెప్పు . . . నేను నీకు నేర్పుతాను . . . "

"నువ్వేం నేర్పవద్దు! ఛీ, ఛీ, నీకు సిగ్గంటూ ఏమీ లేదు! . . . "

"ఇక మనిద్దరం దేనికీ  సిగ్గు పడకూడదనే మనిద్దరిని ఈ గదిలో బందించారు," అని అంటూ ముత్తువేల్ ఆమె భుజం తాకాడు. వెంటనే భాగ్యం వాడి చెయిని తోసి, ఓరగా నిలబడింది.

"నువ్వు నా పెళ్ళాం, తెలుసునా?"

"అవును . . . ఐతేనేం?"

"అందుకే ఇప్పుడు . . . "

"అయ్యో, నాకదేం వద్దు . . . "

"అంటే, నువ్వు నా పెళ్ళాం కాదా?"

"పెళ్ళామే . . . మా అమ్మా, మామయ్య కలిసి ఇలాగ చేసేసారు!" భాగ్యం ఏడవడం ఆరంభింటింది.

"ఎందుకు ఏడ్పు? ఎందుకు ఏడుస్తున్నావ్?

"నాకేం ఇష్టం లేదు . . . "

"ఇదిగో, విను. మనకిష్టం ఉన్నా లేకపోయినా మనిద్దరం ఇక కలిసి జీవించాలి. బతికివున్నంతవరకూ, అలాగే అన్నమాట . . . "

"అందుకు నేనేం చెయ్యాలి?"

"అందుకే నేను చెప్పేది వినాలి. నన్ను ప్రేమించాలి. నాకూ నువ్వంటే ప్రేమ . . . ఆ తరువాత, మనిద్దరం . . . "

"ఛీ, ఛీ . . . నాకేం వద్దు . . . "

"మనిద్దరం అది ఏంటో తెలుసుకోవద్దా?"

ఆ నిమిషం ఒక మగవాడికే కలిగే ఆతురత, ఉద్రేకం వాడిని ఆవరించుకుంది. ఒక స్త్రీకే కలిగే భయంతో ఆమె శరీరం వొణికింది. ఆ చీకటిలో ఢీకోనే కామం ఇద్దరినీ స్వాధీనం టేసుకుంది.

ఆమె భుజంమీద తన గోరులు నొక్కి, గీకుతూ వాడు ఆమెను కిందకి తోసాడు. చిరచిరలాడుతూ, బడిలో తను కొందరు పిల్లకాయలతో దెబ్బలాడిన రోజులు గుర్తుచేసుకున్నాడు. ఆలాగే ఆమెను బలవంతంగా కౌగిలించుకొని, మీద పడి తనకేర్పడిన అవమానంకి కసితీర్చుకున్నాడు.

ముత్తువేల్ తన మగతనం రూఢీ చేసుకున్నాడు. కాని వాడికి ఏడవాలనిపించింది; రాత్రంతా పెక్కి పెక్కి ఏడ్చాడు. భాగ్యమూ కోపంతో ఆ రాత్రి వట్టి నేలమీదనే నిద్రపోయింది.

ఆ ఘటన జ్ఞాపకం వచ్చినప్పుడు, తన ప్రవర్తన గుర్తు చేసుకున్నప్పుడు, ఈ నిమిషం కూడా అతనికి తలవంపుగా ఉంది. శరీరమంతా కుళ్ళిపోయినట్టు భావన అతన్ని ఆవరించుకుంది. ఒక నిట్టూర్పు వదిలి అతను మళ్ళీ రాయసాగారు:

“వైత్తా వచ్చాడే - అప్పుడు భాగ్యం ప్రసవించి ఉంది. నా కొడుకు - ఇవాళ ఉదయం నా తీర్పుని నిందించి, నా వలన తనకేర్పడిన అవమానం తాళలేక బాధపడుతున్నట్టు వాపోయాడే - ఆ సుందరలింగం - అప్పుడు వాడు పదిమాసాల బిడ్డ. వాడిని కన్న తరువాత తను పడిన బాధలకి భాగ్యం నన్ను శపించివుంది. మా మొదటి రాత్రి, ఆ తరువాత నేనూ, భాగ్యం కలిసి గడిపిన రాత్రులన్నీ దుఃఖమయంగానే గడిచాయి. ఎందుకో ఆ రోజుల్లో నాకు అటువంటి మనోక్షోభ. నేను గ్రహించాను. అవును, అదే నిజం. మేమిద్దరం ఒకరినొకరుని చూసి భయపడ్డాం, ‘ఏ సుఖం కావాలని ప్రజలు ఇటువంటి బంధుత్వం కోరుతున్నారు?’ అనేది నాకు ఒక పెద్ద ప్రశ్నగా కనిపించింది. భాగ్యంని వొదిలివున్న రోజులు నా బలమని, కలిసివున్న రోజులు నా బలహీనత అని కాని ఆ తరువాత ఎవరి నిర్బంధంతోనో మళ్ళీ కలుసుకున్నాం. ఆ ఆకర్షణ ఒక మాయ అని ఆ క్షణమే గ్రహించి మళ్ళీ ఒకరినొకరు వొదులుకోవాలని తొందరపడ్డాం. అదికూడా మాకొక లైంగిక అనుభవం కాదు. ఇంతలో మాకొక పాప పుట్టగానే, మేం సంతోషంగా ఆ వేడుక కొనియాడాం. భాగ్యం సంతోషంగా ఉండాలంటే నేను ఆమెకి సమీపంగా ఉండకూడదని నిర్ణయించాను. కాని ఆమెకి దూరంగా, అరమరగా ఉండాలని నేను ఎంత ప్రయాసపడినా, ఆత్మనిగ్రహం లేకపోవడం వలన నేను పదే పదే ఓడిపోయిన కారణంవలన మా ఇద్దరి మనసులోనూ, బాధ, కటువే మిగిలాయి. ఆ సమయంలోనే వైత్తా వచ్చి నా మనసుని వేరే దిశలో మళ్ళించాడు.

నేను రాత్రి, పగలు అనే భేదం లేకుండా వాడితోనే చదువు, శిక్షణలో రోజులు గడిపాను.

భాగ్యంకి నేనంటేనే కసి, పగ, నాతోనే జగడమాడడం దానికి సరదా అని నేను అనకున్నాను. అదొక పెద్ద అబద్ధమని త్వరలో తెలిసింది. క్రమేణ నాకు ఆమెపై కనికరం, సానుభూతి కలిగాయి. ఒకానొకప్పుడు భాగ్యం నాకు సబబైన చెలికత్తెగా ఉండేది. ఇప్పుడుకూడా మేమిద్దరం ఒంటరిగా ఉన్నా లేక నలుగురు మధ్య ఉన్నా, భాగ్యం నన్ను ‘నువ్వు’ అని ఏకత్వంలోనే పిలుస్తుంది. చూడడానికి నాకంటే వయస్సులో పెద్దదిగా కనిపించినా, ఆ బలిసిన శరీరంతో, భాగ్యం నిత్యమూ అందరినీ

తిట్టుకుంటూ, రాత్రంతా దగ్గుతూ, రోగిలాగ, తన్నూ, తన బంధువులు, తన జీవితంని దూషించుతూంటే నన్ను తప్పిస్తే మరెవరికి దానిమీద జాలి కలుగుతుంది?

ఇప్పుడు కూడా ఏ రోజైనా రగడకి తనకి ఎవరూ దొరకలేదంటే గుండె కొట్టుకున్నట్టు భాగ్యం మేడమెట్లెక్కి వచ్చేస్తుంది. నేను చదువుకుంటూనో లేక రాసుకుంటూనో ఉన్న మేజా దగ్గరకి వచ్చి, నిలబడి, రెండు చేతులూ చాటి, ఒక అర్ధగంటకి తగ్గకుండా నన్ను తిట్టి, శపించి, ఏడ్చి, 'అబ్బా!' అని ఒక విధమైన సుఖంతో వెళ్ళిపోతుంది. ఇది నేను చాలా సంవత్సరాలు అనుభవించి ఉన్నాను. ఆమె ఎవరిగురించి మాటాడుతోందని నాకింతవరకూ తెలీదు, అంటే ఆమె విషయంలో నేను అంతగా అజ్ఞాని ఐపోయాన్న మాట. ఆమె ఆక్రోశమైన మొహం చూడగానే నాలో ఏదో ఒక మీటని *switch off* చేసేస్తాను. దాని తృప్తికని నేను భాగ్యం చెప్పేదంతా వింటున్నట్టూ, ఆమె దాడికి నేను కూలిపోయినట్టూ, ఆమె అడిగిన నాలుగు ప్రశ్నలకి నేను నోరు మూసుకున్నాని ఆమెకి అనిపిస్తుంది. అలాగే కానీ! పాపం, ఇన్ని సంవత్సరాలు ఆమె సహవాసం తరువాత 'సరేలే!' అని నేను సర్దుకొని పోవాలని నిశ్చయించాను. ఇంతకు ముందు ఆమె వచ్చి వెళ్ళిన తరువాత నేను ఏడవడమూ జరిగేది, కాని క్రమేణ అదీ ఆగి పోయింది. తరచుగా 'ఇది ఎంత స్వార్థం!' అని నేను బాధ పడినా 'దీనివలన మా ఇద్దరికీ విముక్తి!' అనే ఊరడింపు కలిగింది.

భాగ్యం విషయంలో దానికి *sex* ఒక అనుభవం కాదు, దానిగురించి దానికి ప్రజ్ఞ లేదనే చెప్పాలి. ఆ ఎరుక రావడానికి ముందే ఆ భావన ఆమెలో కుక్కడమైంది. అందువలనే దాని మనసులోనూ, నాలాగే, *sex* అంటే అసహ్యం, జుగుప్స చోటు చేసుకున్నాయి. *Sex* అంటే శారీరక బంధుత్వం మాత్రం కాదు. కాని మా ఇద్దరికీ అది శారీరక సంబంధంగానే నిలిచిపోయింది. ముందునుంచే అందులో అపేక్ష లేరపోవడం వలన భాగ్యం మనసులో అదొక శాశ్వతమైన విసుగుగా చోటుచేసుకుంది. బాహ్య శక్తులకి శరీరం మాత్రమే లొంగుతుంది. ఆమెకి ఇష్టం ఉన్నా అంతవరకే అందుకు కట్టుబడుతుంది. ఈ వక్రబుద్ధి గురించి భాగ్యంకి ఎటువంటి ప్రజ్ఞ లేకపోవడం వలన సాంప్రదాయంగా మన పూర్వీకులు పాతివ్రత్యం, స్వామి భక్తి, అని వక్కాణించిన నీతులనే ఆమె మనసార అలవరచుకుంది. ఆమె నిత్యమూ ఏడవడం, అందరినీ

*దూషించడం, ఇతరులతో పోట్లాడడం - ఇవన్నీ ఆమెకి ఏర్పడిన శారీరక క్షోభకి - లైంగిక జీవిత భంగంకి - దోహదం చేసాయి. కుటుంబం, సమాజంలో నలుగురు నడిచేదే బాట, నలుగురు పలికేదే మాట - ఆమె ప్రవర్తనకి ఆధారమైన ఈ క్రూర సంకెళ్ళని తోసిపారేయాలనే ప్రజ్ఞ, ఆత్మబలం లేక సమాజంలో హింస పడుతున్న అనేక స్త్రీలతో భాగ్యంని కలుపుకోవాలి. నాకు ఇంత బోధపడినా నేనుకూడా దాన్ని కాపాడలేను. ఇప్పుడుకూడా భాగ్యం తను సుమంగళిగా ఉండాలని ఎడతెగకుండా అన్ని వ్రతాలు పాటించుతోంది. మన సామాజిక ధర్మం ప్రకారం ఆమె ఒక పూజ్యమైన దేవత . . . కాని జీవితంకి?*

*పూజనీయ దేవతలు కోవిలలోనే ఉండాలి, ఇతరులతో కలిసి అవి కాపురం చెయ్యడం ఎలా సాధ్యం? మా దాంపత్యంలో ఇటువంటి పరిస్థితికి కారణం భాగ్యం కాదు, నేనూ కాదు. కాని అందుకని భాగ్యంలాగ నేనూ బాధపడాలా ఏమిటి ? ఈ సమాజంలో మగజాతికని కొన్ని అదనపు హక్కులు ఉన్నాయిగా? అందుకని నా ఇరవైఐదేళ్ళ వయస్సులో ఈ సమాజం ధర్మం అనుసరించి నేను రెండో పెళ్ళి చేసుకోవాలని నిశ్చయించాను. ఆ సమయంలో ఆ ఆలోచన నాకు ఉన్నతంగానే కనిపించింది. ఎందుకంటే నా పరిస్థితిలో ఉన్నవారు తమ వ్యక్తిగత లైంగిక ప్రశ్నల నివారణకి ఇంకొక పెళ్ళి కావాలని ఆ రోజుల్లో ఆలోచించరు. కాని నాకు దానికి బదులు వ్యభిచారంలో పాల్గొనడానికి నాకు ఇష్టం లేదు. అందుకే నేను రెండవ పెళ్ళికి సిద్ధమెయ్యాను. భాగ్యంతోబాటు అందరూ ఒక మగవాడికి ఇది సముచితమని ఒప్పుకున్నారు.''*

'ఎంత పిచ్చిపని చేసాను!' అని మూలుగుతూ, తనలో నవ్వుకుంటూ, రాస్తున్న కలంని మేజామీద పెట్టి ముత్తువేలర్ వేళ్ళని మెలిదిప్పుకున్నారు.

అప్పుడు సమయం మూడు గంటలు దాటి ముప్పై నిమిషాలు!

దూరంలో కోడిపుంజు కూత వినబడుతోంది. ఊరుకి ఒక మైలుదూరంలో ఉన్న స్టేషన్ని దాటి వెళ్ళే రైలు బండి శబ్దం దగ్గరలో వినిపిస్తోంది. ముత్తువేలర్ లేచి నిలబడ్డారు. ఒక గ్లాసు నీళ్ళు తాగారు. మెల్లగా నడుస్తూ, తల వొంచుకునే, ఏదో ఆలోచిస్తూ, వీధికి పక్కనే ఉన్న కిటికీని చేరుకున్నారు. చల్లని గాలిలో అతని చూపు ఆ పొడుగాటి వీధిమీద వాలింది.

అదిగో, వీధి చివరన, సున్నంకొట్టి తెల్లగా ఈ వెన్నెలలో నిగనిగమని కనిపిస్తోందే - అదే దాక్షయణి తల్లి ఇల్లు. ఇది వాళ్ళ సొంత ఊరు కాదు. అసలు దాక్షాయణి ఇక్కడ పుట్టనేలేదు. వాళ్ళ నాన్నగారు Forest Department లో పని చేసి, ఉద్యోగ విరమణ తరువాత ఈ ఊరులోనే స్థిరపడిపోయారు.

అమ్మాయిని చూసిన తరువాత, తన మనసుకి పూర్తిగా తృప్తి కలిగితే, అమ్మాయికీ తృప్తి అని ఖాయమైన తరువాతనే పెళ్ళి చేసుకోవాలని నిశ్చయించి ముత్తువేలర్ పెళ్ళి చూపులకి వెళ్ళారు.

అంతకుముందే అతను దాక్షాయణిని - వేసవికాలంలో తన ఇంటి పెరడులో పనిమనిషులని పర్యవేక్షణ చేసినప్పుడు - వీధిలో, కోవిలకి వెళ్తున్న స్త్రీల గుంపులో, చూసివున్నారు. ఆ తరువాత అతను యెద్దుల బండిలో ప్రయాణం చేస్తూ ఆమె ఇల్లు దాటినప్పుడు ముగ్గులు వేస్తున్న దాక్షాయణి తొందర తొందరగా లేచి అతనికి దారి వదలినప్పుడు, ఆమె తనకింత వరకూ పరిచయం లేని, ఇటీవల కొత్తగా ఆ ఊరుకి వచ్చిన యువతి అని గ్రహించి అతనికి ఆహ్లాదం కలిగింది. ఆమె జాతి, కులం, అంతస్తు - ఇవేం అతనికి తెలీదు.

ఊరులోని పెద్దమనిషి నొక్కి చెప్పిన తరువాత అడ్డు చెప్పేదెవ్వరు? ఆ పొంతనలన్నీ తమకు తామే వచ్చి అతనికి అంటుకున్నాయి.

ఆఖరికి, ఒక రోజు అతను దాక్షాయణిని చూడడానికి వెళ్ళారు. తను ఆమెని నిలకడగా చూడడమైంది, కాని దాక్షాయణి తన్ను చూసిందా అని తెలియదే! అందువలన తను ఆమెని ప్రత్యక్షంగా చూసి కనుక్కోవాలని పట్టుబట్టారు, అలాగే చేసారు కూడా! అతని జాతిలో, ఆ రోజుల్లో అదొక ఘనకార్యం అని చెప్పాలి!

భాగ్యంలాగ దాక్షాయణి గ్రామీణ వాతావరణంలో పెరగలేదు. నగర పరిసరాల్లో, నియమం ప్రకారం బడిలో ఏదో కొంచెం చదువుకొని ఆమెకి సాహిత్యాభిరుచి ఉందని అతను తెలుసుకున్నారు. పెళ్ళి చూపులకి ఆమె ఇంటికి వచ్చినప్పుడు ప్రవేశద్వారంలో గ్లాసు గొట్టాలతోబాటు అల్లిన తెర అతని కళ్ళకి ఎంత చోద్యంగా కనిపించింది! ఆ తరువాత చావడిలో, గోడలమీద కళ్ళకి విందుగా రకరకాల

చిత్రలేఖనలు, వాటిలో ముద్రించబడిన ఆమె పేరు చూసి 'అబ్బా, ఈ దాక్షాయణికి ఎటువంటి కళాత్మక హృదయం!' అని అతను ఉప్పొంగిపోయారు.

దాక్షాయణి పెళ్ళిచూపులకి తను వెళ్ళిన ఆ ఘటన గుర్తు చేసుకొని కిటికీ దగ్గర నిలబడిన ముత్తుపేలర్ తొందర తొందరగా తిరిగివచ్చి రాసుకున్నారు:

***"మన స్త్రీల కళాత్మక భావనలు, సృజనాత్మకత, ఎందుకు - సానుభూతి కూడా - పెళ్ళైన ఆ దినమే హోమగుండంలో దహనమవుతాయి కాబోలు!"***

*ఈ సమాజం స్త్రీకి విధించిన ధర్మం ఏమిటి? నగరంలో పెరిగినా, గ్రామంలో పెరిగినా, చదువు ఉన్నా, లేకపోయినా, వారిద్దరి స్వభావం ఒకటే అని నేను నా దాంపత్య జీవితంలోనూ, ఇతర ప్రమాణాల్లోనూ తెలుసుకున్నాను.*

*స్త్రీ జన్మని ఆడదిగా పుట్టిన నిమిషం నుంచి జీవితమంతా ఈ సమాజం శపిస్తోంది. అనుభవంలో ఆమెని ద్వితీయశ్రేణి పౌరుడులాగ చులకన చేస్తోంది. మగవాడికంటే స్త్రీకి ఎంత ఎక్కువగా దుస్తులు, ఆభరణాలు, ఉన్నాయే, అలాగే ఆమె మోయడానికని సంకెళ్ళు, కట్టుబాట్లు, బరువులు కూడా ఉన్నాయి. ఆమె శరీరంని బందించినట్టు, ఆమె భావనలు కూడా అణచడం జరుగుతోంది. ఆమె లోకం ఆమె మనసులాగే యిరుకుగా, హింసాత్మకంగా ఉంది. ఆమె జన్మించిన తరువాత ప్రతీ ఘట్టంలోనూ ఒక్కొక్క మగవాడికి బానిసగా ఉంటోంది. కాని భర్త అనే ఒక యజమానుడు తప్పిస్తే ఆమె ఎటువంటి బాధ్యతలేని బానిసగానే ఉంటోంది. అందువలనే తన జీవితంలో తన బాధ్యతకని భర్తని కలుసుకున్నంతవరకూ ఆమె సాహసంతో, స్వాభావికంగా అన్ని పనులూ చెయ్యడం చూస్తాం. అనుభవంలో, అంతరంగ జీవితంలో ఆ యజమానుడు తనకి యీడుగా ఉన్నాడని గ్రహించగానే ఆమె మనసులో, ఆమెకి ప్రజ్ఞ లేకుండానే, ఒక విపరీత సంతోషం చోటుచేసుకుంటుంది. సమాజంలో ఆ భర్త ఎంత ఉన్నతమైన స్థాయికి లేచినా, 'మేం ఇద్దరం!' అనే భావనతో తమ అంతరంగ జీవితంలో అతన్ని క్రిందకి దించేయాలని, అదే న్యాయమని ఆమె మనసులో ఉంది. ఇవన్నీ నిరుద్దేశంగా కలిగే ఘటనలు. భాగ్యం చేష్టలకి తగిన కారణమేమిటో మీకు తెలుసా? యుగయుగాలుగా మన ఇతిహాసాలు, సాహిత్య గ్రంధాలు, శాస్త్రాలు వక్కాణించి చెప్పే ఆ పాత కధే - పాతివ్రత్యం!*

ఈ తెలివిమాలిన సమాజం స్త్రీల దగ్గర మరేం ఎదురుచూడలేదు! ఒక స్త్రీ ఎంత చెడిన భార్యగా, తల్లిగా, ఒక రోగిగా సమాజంలో ఉండవచ్చు - ఆమెకి తన భర్తని తప్పిస్తే మరే మగవాడితో - పరపురుషుడుతో - పెళ్ళికి ముందుగాని, లేక తరువాతగాని - తోడ సంబంధం ఉండకూడదు! అదే ఆమె శీలంకి ఆనవాలు! ఆమె ధర్మపత్ని! ఆమె దేవత! ఈ నియమంకి అనుగుణంగా వర్తించే స్త్రీలనే ఈ సమాజం ఉత్పత్తి చేస్తోంది. వాళ్ళు కూడా ఈ ఒక గుణం నిలబెట్టుకొని, దానికి శిక్షగా తమ భర్తల పరమ శత్రువులైపోతున్నారు . . .

వివాహాలన్నప్పుడు - అవి సనాతన ధర్మం అనుసరించినా లేక ఆచారాలన్నీ వదిలేసినా - అవెప్పుడూ ఈ సూత్రాన్ని నిరాకరించవు. ఎలాగైతేనేం, వివాహం అనేది ఈ సమాజంలో ఒక సంప్రదాయం, అంతేకదా?

అటువంటి సంప్రదాయంకి లొంగిపోయి, 'ఒక మగవాడికి ఒక స్త్రీ' అనే రీతిలో సాగుతున్న దాంపత్య జీవితంలో మగవాడు స్వాభిమానం పోగొట్టుకొనడానికి ఎన్నో అవకాశాలున్నాయి. అటువంటి పరిస్థితిలో - నాకిద్దరు భార్యలున్నారు! - నేను భవిష్యత్తులో శాంతం, సంతోషం, ప్రసన్నత ఎదురు చూడడం ఎంత పెద్ద పొరబాటు!

ప్రారంభంలో నా ఇద్దరు భార్యలూ భవ్యంగానే మెలగడం నేను గమనించాను. భాగ్యం తన sex జీవితం పూర్తిగా అంతమైపోయిందనే భావనతో అత్తగారి హోదాలో అధికారం చెలాయించడానికి సిద్ధంగా కనిపించింది. దాక్షాయణికూడా భాగ్యంని 'అక్కయ్యా!, అక్కయ్యా!' అని ప్రేమతో పిలవడం అలవాటు చేసుకుంది. వీళ్ళిద్దరూ ఎలాగ తమకుతామే మోసం చేసుకుంటున్నారని నాకు ఆశ్చర్యం కలిగింది. బానిసల జీవితంలో ఇటువంటి వక్రబుద్ధి సహజమే కాబోలు!

ఏది ఏమైనా ఆ రెండవ పెళ్ళి తరువాత నా మనసు కొంచెం కుదుటబడింది. అనిత్యమైన శాంతం నేను అనుభవించాను. కాని అది ఎంత పెద్ద అబద్ధం! ఎంత పెద్ద మాయ, మోసం!

'అసలు నేనతని రెండవ భార్య కదా?' అనే చిన్నదనంతోబాటు 'దీనిదగ్గర ఏదో కొఱత ఉంది, అందుకే అతను నన్ను పెళ్ళిచేసుకున్నారు!' అనే గర్వమూ దాక్షాయణి మనసులో చొరబడడం నేను గ్రహించాను.

*క్రమేణ ఆమెలోని కళాత్మక భావనలు మెల్లమెల్లగా జారుకున్నాయి.*

*నేనే ఒకరోజు దాన్ని అడిగాను: 'నువ్వెందుకు అవన్నీ వొదిలేసావ్? నువ్వు వచ్చిన తరువాత ఈ ఇల్లు శోభతో ప్రకాశిస్తుందని నేను ఎన్ని కలలు కన్నానో తెలుసా? నువ్వు ఆ రోజుల్లో ఒక దైవ విగ్రహంలాగ కనిపించడం నాకు గుర్తుంది,' అని నా ఆతురత తెలియజేసినప్పుడు దాక్షాయణి నిష్ఠూరంగా నాకు జవాబు చెప్పింది:*

*"నేనేం వేశ్య కాదు . . . " అని.*

*ఆ తరువాత నేను దానిగురించి నోరెత్తలేదు.*

*వాళ్ళిద్దరూ ఏదో కారణం వలన పోటీపడుతూ జీవితం గడుపుతున్నారని నాకు బోధపడింది.*

*ప్రారంభంలో నేను అనుభవించిన శాంతం, నెమ్మది, త్వరలో ఒక క్రూరమైన, అనాగరిక ఘటనకి దారి తీస్తుందని నేను ఊహించనేలేదు. ఈ ఆచారాలు, అనుష్ఠానాలు, కపటంగా పాటించుతే మనం ఎదురుచూడని సమయంలో అవి నీచంగా బద్దలవుతాయి . . .*

*అప్పుడు దాక్షాయణి ఈ ఇంటికి వచ్చి ఒక సంవత్సరం పైగా అయింది; ఒకవేళ ఆమె మూడు, నాలుగు మాసాలు కడుపుతో ఉందేమో?*

ఆ ఘటన గుర్తుకి రాగానే జుగుప్స కలిగినట్టు ముత్తుపేలర్ నెత్తిని, కనురెప్పలని రుద్దుకున్నారు.

ముత్తుపేల్, భాగ్యం గదిలో ఉన్నారు. ఆప్పుడే వాళ్ళిద్దరిమధ్యా ఇంతవరకూ జరిగిన వాదోపవాదాలు, భాగ్యం సణుగులూ కొంతవరకూ సద్దుమణిగాయి.

ముత్తుపేల్ అనుమానించినట్టే ఇవాళ అతనిలో 'బలహీనత' చోటుచేసుకుంది. ఆ కారణం వలనే అతను రెండో పెళ్ళి తరువాత భాగ్యంతో కొంచెం ఎక్కువ చనువుతో మెలగడం అలవాటు చేసుకున్నారు. 'నన్ను నా భర్త పూర్తిగా నిరాకరించారు!' అని భాగ్యం బాధ పడకూడదని, సహజంగా ఆమెలో కనిపించే తిరస్కరణ, ఉదాసీనత భావనలు భరించుకొని, ఆమెతో సరసమాడిన తరువాత అతని మనసు కొంచెం కుదుటబడిన సమయంలో . . .

గది తలుపుని ఎవరో కొట్టారు. ఆ ధ్వని విన్నగానే అది ఎంత క్రూరమైన, అవమానకరమైన పొరబాటు అని అతనికి బోధపడింది.

అతనూ భాగ్యమూ ఏకాంతంగా ఉన్న ఆ గది తలుపుని ఇంతవరకూ ఇలాగ బాదడానికి ఆ ఇంటిలో ఎవరికీ ధైర్యం లేదు. అలాంటి ధైర్యం ఎవరికైనా వచ్చిందంటే అందుకు కారణం తనే  అని గుర్తుచేసుకున్న నిమిషం అతని మనస్సు, శరీరం, కుంగిపోయాయి. అందువలనే భాగ్యం దృష్టిలో అతను ఇంకా చులకనగా కనిపించారు. ఎంత భయంకరమైన అవమానం! సొంత భార్యతో ఉండడానికి దమ్ములేక తనొక దొంగలాగ నిలబడాలా? భాగ్యం బుగ్గలు తాకుతూ అతను బతిమాలాడారు:

"నువ్వేం అనకు, అది దాక్షాయణే . . . నేను చూసుకుంటానులే" అని అతను తడబాటు పడుతుంటే అతని పురుషత్వంమీద పైబడినట్టు మళ్ళీ తలుపుని కొట్టడం వినిపించింది.

నీచుడైన ఒక బానిసలాగ ఆ ప్రభువు దుస్తులు తొడుక్కొని, పరుగెత్తుకొని వెళ్ళి తలుపు తెరిచారు.

అక్కడ దాక్షాయణి తన నిజస్వరూపంలో నిలబడి ఉంది.

అప్పు తీసుకొనేవాడిని ఎదుర్కొని దండించే రీతిలో ఆతని ఒడిని పట్టుకొని ఆమె అడిగింది:

"నన్నెందుకు పెళ్ళి చేసుకున్నారు? ఎందుకు?"

-ఆమె అడిగిన ధోరణిలో ఈ ప్రశ్న ఇప్పుడే ఆమె మనసులో లేచినట్టూ, ఆమె అడుగుతున్నట్టూ కనిపించలేదు. పెళ్ళైన మొదటి రాత్రి అతని పక్క కూర్చున్నప్పుడు ఆమె మనసులో ఆ ప్రశ్న లేచి ఉండాలి. సరే, దానికి జవాబు చెప్పే బాధ్యత ముత్తువేల్ తప్పిస్తే మరెవరికీ లేదా?

అతను జవాబు చెప్పారు: "అవును, అది పొరబాటు. నేను పెళ్ళిచేసుకున్నది పొరబాటు. రెండవ పెళ్ళి చేసుకున్నది ఇంకా పెద్ద పొరబాటు." భాగ్యం సమక్షంలో అతను ఆ మాటలన్నప్పుడు, ఆ నిమిషం తరతరాలుగా సమాజంలో స్త్రీజాతికి మగజాతి చేసిన అన్ని అధర్మాలకి ఈ మగవాడిపైనే  తీరా కసి తీర్చుకున్నట్టు అనిపించింది.

అతను ఆ గదిని నిష్క్రమించి బయటకి వెళ్ళినప్పుడు, భాగ్యం, అతని వెనుక, కాండ్రించి ఉమ్మింది. అతను తన మేడగదికి వెళ్ళి తలుపు మూసుకున్నారు. మిద్దె క్రింద దాక్షాయణి, భాగ్యం, మోటుగా, అనాగరికంగా ఒకరినొకరు తిట్టుకుంటూ ప్రయోగించిన మాటలు అతను చెవులకి చాలాసేపు వినిపించాయి. ఒక మగవాడుగా పుట్టి ఆ మాటలు విన్న పాపంకి వాపోయి ముత్తువేల కన్నీరు కార్చారు.

*'ఆ తరువాత భాగ్యమైనా సరే, దాక్షాయణియైనా సరే - వారిద్దరిని వొదిగివుండడం నా బలమని, వాళ్ళతో నేను గడిపిన రాత్రులు నా బలహీనమని నేను గ్రహించాను. వాళ్ళిద్దరిలో ఒకరు ఒక రాత్రి నాతో గడిపారంటే దానికి కారణం వాళ్ళకి నాపై ఉన్న ప్రేమ కాదని, వాళ్ళిద్దరూ అన్యోన్యంగా పెంచుకున్న పోటీ, ఈర్ష్యే కారణమని తెలుసుకునే నేను వాళ్ల చుట్టరికంకి వశమయ్యాను. నేను పోగొట్టుకున్నది నా శారీరక సుఖం మాత్రం కాదు, నేను అనుభవించినది ఆత్మ వేధనకూడా.*

*భాగ్యం మనస్సులో తను నా మొదటి భార్య, ధనవంతురాలు అనే అహంకారంతోబాటు తృప్తికూడా ఉంది. దాక్షాయణికేమో 'దీనికి ఆస్తీ, డబ్బూ, ఉంటే ఏం గొప్ప?' అనే ఈసడింపు. దానికి మించి నాకు రెండవ పెళ్ళాం కావాలని నేనే వెళ్ళి దాన్ని ఎంచుకున్నానని గర్వం. నేనేమో ఈ రెండు గుణదోషాలమధ్య చిక్కుకొని తల వంచుకున్నాను. ఈ ముక్కోణంలో పడి అల్లాడుతున్న శోకమే నా దాంపత్యం. నా వ్యక్తిగత జీవితంలో ఏర్పడిన ఈ ఘోర పతనంనుంచి మార్పు, విముక్తి కావాలని నేను నా శ్రద్ధని పూర్తిగా వేరే వేరే మార్గాల్లో చెల్లించాను.*

*ఆ కారణంవలనే ఇప్పుడు ఈ జిల్లాలో ఇరవై బస్సులు నా యాజమాన్యంలో సాగుతున్నాయి; ఆరు నగరాల్లో నా సినిమా రంగస్థలాలున్నాయి; నేను స్థాపించిన పత్తి ఖార్ఖానాలో వెయ్యిమంది పనిచేస్తున్నారు. ఇక యెద్దుల బండ్ల కాలం పోయి నా ఇంటి ముందు నాకోసం నాలుగు పెద్ద కార్లు నిలబడివున్నాయి. కాని, ఇంత డబ్బు సంపాదించి, కూడబెట్టి, ఆఖరికి ఏం లాభం? నాకు కావలసిన శాంతి, సంతోషం, ప్రపంచం - ఇవన్నీ నేను నాలోనే వెతికి కనుగొన్నాను. నా జీవితంలో పెద్ద భాగం ఈ లైబ్రరీలోనే గడిపాను. ఇదే ఈ సమాజం నాకు విధించిన శిక్ష. మరేం దారిలేక నేను*

*దాన్ని అంగీకరిస్తున్నాను. ఈ యాభైయేళ్ళ జీవితం తరువాత నాకు లభించినది ఈ ఆత్మ హత్య అని గింజుకొనే సమయంలో నేను ఆమెని కలుసుకున్నాను . . . .*

*'సుగుణా . . . '*

ముత్తుపేలర్ నిర్వహణలో ఉన్న ఆ ఉన్నత పాఠశాలలో టీచరు ఉద్యోగంకి వచ్చిన ఒక అభ్యర్థిగా సుగుణ అతనికి పరిచయమైంది. వచ్చిన అన్ని వినతి పత్రాల్లో సిఫారసు లేని పత్రం అదొకటే. అందువలనే ముత్తుపేలర్ దాన్ని ఉత్సుకతతో పరిశీలించారు. ఆమె యోగ్యతా పత్రాలు, ఈ ఉద్యోగంలో ఆమెకున్న ముందటి అనుభవాలు చూసి అతనికి ఆశ్చర్యం కలిగింది. ఆమెకున్న ఇరవైయేళ్ళ సర్వీసులో మూడేళ్ళకి మించి నిలకడగా ఆమె ఎక్కడా పని చెయ్యలేదు; ఈ మూడు సంవత్సరాలుకూడా ప్రారంభంలో ఆమె రెండు సంస్థలలో పని చేసినట్టు తెలిసింది. 'ఇటువంటి చోద్యమైన యోగ్యతాపత్రికలతో వచ్చిన మనిషిని చూసితీరాలి!' అనే ఆతురతతో అతను మేజామీదున్న గంటని మోగారు.

ఆఫీసు అబ్బాయి వచ్చాడు.

"బయట సుగుణ అని ఒకావిడ ఉన్నారు. ఆవిడని రమ్మను," అని చెప్పి వాడిని పంపారు; రాబోయే స్త్రీ ఎలా ఉంటుందని తలపోస్తూ కూర్చున్నారు:

ముందుకి ఉబికియున్న పళ్లు; బంగారు ఫ్రేముతో కళ్ళద్దాలు; చెయిలో ఒక ఖాకీ సంచి; టీచరుకి చిహ్నంగా ఒక గొడుగు; సగానికి పైగా తలలో నెరసిన జుత్తు; దానితోబాటు నిరాడంబరమైన కేశాలంకారం . . .

ఇంతవరకూ ఆపేకదా అతను చూసివున్నారు!

'ఇది నీకొక కొత్త అనుభవం!' అని అతనికి చెప్తున్నట్టు ఆమె గదిలోకి ప్రవేశించింది.

"Good morning!"

"Good morning!"

"కూర్చోండి!" అని అతను చెప్పడానికి ముందే మేజాకి ఎదుటవున్న కుర్చీలో ఆమె కూర్చుంది. సుగుణకి బదులు మరెవరైనా వచ్చేసారేమో అని అతనికి కొంచెం అనుమానం కూడా కలిగింది.

ఆమె ఆకారంలోని సరళత, కళ్ళలో కాంతి చూడగానే అతను వైత్తా కళ్ళలో కనిపించే ప్రకాశం గుర్తుచేసుకున్నారు. ఆమెను చూస్తే వయస్సు నలభైకి తక్కువ

ఉండదని ఎవరికైనా బోధపడుతుంది. కాని ఆ వయస్సులోనూ ఒక స్త్రీ యౌవనంగా కనిపించడం సాధ్యమని, ఆమెలో ఆ పడుచుదనం నిత్యమూ చోటుచేసుకుందని అతనకనిపించింది.

ఆమె తల వెండ్రుకల మధ్య కనిపించే ఆ తెల్లని గీటులో అతను గ్రహించినది ముసలితనం కాదు, పరిపక్వత!

'ఎవరికి తెలుసు? ఈమెను చూసిన తరువాత ఈ కాలం స్త్రీలు నెరసిన జుత్తుని ఒక సొగసైన శైలిగా అంగీకరిస్తారేమో?' అని అతను ఆలోచించారు.

ఆమెను చూడగానే తన మనసులో లేచిన భావనలని ఒక పక్క నెట్టించి, తన హోదాని అనుసరించి ఆమె యోగ్యతాపత్రాలని అతను మళ్ళీ పరిశీలించారు; ఆ తరువాత తలెత్తి ఆమెను చూసారు.

'ఈమె Intermediate చదివిన తరువాత ఎందుకు Secondary Grade Training లో చేరింది? ఎడతెగకుండా ఇరవై సంవత్సరాల ఉద్యోగంలో ఎటువంటి పదోన్నతి లేకుండా ఉత్తి టీచరుగానే ఉందే? ఈమె వృత్తిలో నిలకడగా ఏమీ కనబడదే, ఏం, ఎందుకు?' అని ఆలోచిస్తూ తేరిపారి చూసి ఆమెను అడిగారు:

"ఇంతవరకూ మీరు ఏ స్కూల్లోనూ నిరంతరంగా పని చెయ్యలేదనిపిస్తుందే?"

"Yes, that's my character!"

"Character?"

"అవును, దానికి కారణం నా character అని అంటున్నాను. ఒక టీచరుగా నాకు తెలిసిన ఏ టీచరు కన్నా నాకు మేలైన సమర్థత ఉందని అందరూ నన్ను పొగడారు. కాని ఆ సంస్థలు నా స్వేచ్ఛలో చొరబడినప్పుడు నేను రాజీనామా చెయ్యవలసిన అగత్యం ఏర్పడింది. లేకపోతే వాళ్ళే నన్ను రాజీనామా చెయ్యమని ప్రేరేపించారు . . . నా కడుపు నింపడానికని, వీళ్ళిచ్చే జీతంకోసం నా ఆత్మగౌరవం తాకట్టు పెట్టాలంటే ఎలాగ?"

"వాళ్ళు మీ స్వేచ్ఛలో చొరబడుతున్నారని మీరెలా వాదాడగలరు? ఒక కళాశాల నిర్వహణకి, ఒక ఖార్ఖానా నిర్వహణకి మంచి తేడా ఉంది. కళాశాల అనేది రాబోయే సమాజంని సృష్టి చేస్తోంది. టీచర్ల బాధ్యత క్లాసులో కూర్చొని పాఠం బోధించడంతో సరిపోతుందా? టీచర్లు భవిష్యత్తులో విద్యార్థులకి మార్గదర్శకులుగా మెలగాలి. ఆ

కారణంవలన విద్యాసంస్థలు మీదగ్గర ఆదర్శభావనలు ఆశించడం సహజం. వాళ్ళు మీ స్వతంత్రతలో చొరబడుతున్నారని మీరు అంటున్నారే, అది న్యాయమేనా?"

"టీచర్లు మార్గదర్శకులుగా ఉండాలని మీతో నేనూ ఏకీభవిస్తాను. ఈ తరంలో జీవించే ప్రతీ వ్యక్తి రాబోయే తరంకి ఆదర్శజీవిగా కనిపించాలి, అదే మానవ ధర్మం. ఏం, టీచర్లకి మాత్రం ఆ బాధ్యత ఉందంటున్నారా? ఆదర్శజీవితం అంటే జీతంకోసం చేసే వృత్తి అని అంటున్నారా?"

ఆమె కళ్ళలోని కాంతి మాత్రం కాదు. ఆమె మాటలు కూడా అతనికి సైత్తాని గుర్తుచేసాయి. ఆమె ఇంకా మాటాడాలని ఎదురు చూస్తూ అతను ఆమెను కళ్ళప్పగించి చూసారు. తనేమో ఎక్కువగా మాటాడిన భావనతో సుగుణ ఒక చిరునవ్వుతో చెప్పింది:

"నేను ఎక్కువగా మాటాడేసాను!"

"కొందరే గొప్ప విషయాలు మాటాడానికి అర్హులు . . . వాళ్ళైనా మాటాడకపోతే ఎలాగ?" అని ముత్తువేలర్ తనలో గొణుక్కున్నారు.

"నేనడిగిన ప్రశ్నకి మీరు జవాబు చెప్పారు, అంతే . . . మరేం లేదు," అని అతను ఆమెను సముదాయించి సంభాషణ కొనసాగించారు.

"అంటే టీచర్లకని ప్రత్యేకంగా ఆదర్శవంతమైన గుణాలేవీ వద్దని మీరంటున్నారు. సరే, కాని ప్రత్యేకంగా వాళ్ళకి దుర్గుణాలేవీ ఉండకూడదు, అవునా?" అని అనాలోచనతతో అతనడిగిన ప్రశ్న విని సుగుణ కలవరపడినట్టు కనిపించినా, నిదానంగానే జవాబు చెప్పింది.

"Yes, I am a lawful citizen . . . నేను సంఘానికి వ్యతిరేకంగా ఏ పనీ, ఎప్పుడూ చెయ్యలేదు. కావాలంటే వాళ్ళు నన్ను రాజీనామా చెయ్యమని ప్రేరేపించినప్పుడు నేనలా చెయ్యక కోర్టులో నా న్యాయం రూఢీ చేసుకొనివుంటాను. వాళ్ళెవరూ ఖరారుగా నామీద ఎటువంటి నేరమూ మోపలేదు. కొన్నిచోట్ల నా సహజమైన ప్రవర్తన చూసి వాళ్ళు ఆయాసపడ్డారు. అంత ఎందుకు, ఈ స్వల్పకాలంలో మీరూ నన్ను అపార్థం చేసుకున్నారేమో? సమాజంలో నకిలీగా అందరూ మెలుగుతున్నప్పుడు నేను నిజాయితీగా ఏమైనా అంటే అది అహంకారంగా

కనిపిస్తుంది. నా అంతరంగ జీవితంలోని ప్రశ్నలలో హద్దు మీరి, చొరబడిన వాళ్ళ ఆజ్ఞలకి నేను భయపడి లొంగలేదని నన్ను రాజీనామా చెయ్యమన్నారు. కొన్నిచోట్ల నామీద లేనిపోని నిందారోపణలు మోపడం వలన నేనే నా ఉద్యోగం రాజీనామా చెయ్యడమూ జరిగింది. వాళ్ళే నాకు అన్నిరకాల నీతిబోధనలు చేసారు!" అని పటపటమని సుగుణ ఆంగ్లభాషలో తన భావనలు వెళ్ళగక్కింది; తను ఆవేశపడినందుకు సిగ్గుపడుతున్నట్టు, వేళ్ళు పిసుకుతూ, వొంచిన తలనెత్తకుండా నవ్వుతూ తనలో ఆంగ్లభాషలో చెప్పుకుంది: "ఒక చోట నేను పెళ్ళి చేసుకుంటేనే టీచరు ఉద్యోగం చెయ్యగలనని షరతు పెట్టారు! How funny! . . . " ఆమె తలెత్తి తన్ను చూసి చిరునవ్వు నవ్వినప్పుడు అతనికి 'నేను ఈమె పక్షం అని ఈమెకు ఎలా తెలుసు?' అని ఆశ్చర్యం కూడా కలిగింది. కాని బాహటంగా అది తెలియపరచకుండా అతను సంబాషణ సాగించారు:

"మీరొక టీచరనే కారణం వలన ఒక సంస్థ మీ ప్రవర్తనలో శ్రద్ధ తీసకుంటే అది పొరబాటు అని మీరు అంటున్నారు, అవునా?"

సుగుణ చెప్పింది:

"అవును. నేను ఎది చేసినా నా మనస్సాక్షికి తగినట్టుగా చేస్తాను. నా ప్రవర్తన గురించి వివేకంగా వాదించడానికి నేను సిద్ధంగా ఉన్నాను. కొంతమంది మొండిగా మన పురాతన ధర్మాలకి బానిసలైపోయి తమకి లొంగలేదన్న ఒకే కారణంతో ఇతరుల ఊహలు అంగీకరించరు; వాళ్ళని నిందించడానికి, దూషించడానికి సిద్ధంగా ఉన్నారు."

"సరే, ఇక భవిష్యత్తులో దీనిగురించి మనం మాటాడదాం!" అని నవ్వుతూ ముత్తువేల్ అనగానే సుగుణకి ఆ సంస్థలో తనకి టీచరు ఉద్యోగం ఖాయమైందని బోధపడింది.

*సుగుణ టీచరు ఉద్యోగం అంగీకరించిన తరువాత మూడు మాసాలవరకూ నేను ఆమెను నాలుగుసార్లు కలుసుకున్నాను. ఆ ప్రతీ సమావేశం ఒక పొటుగాటి సంభాషణగా కనిపించినా మా ఇద్దరిమధ్యా ఎటువంటి అంతరంగ స్నేహభావం చోటుచేసుకోలేదు. కాని అవన్నీ మఱవలేని ఘటనలని నేను ఊహించినట్టే తనూ ఊహించినట్టు సుగుణ నాకు చాలా రోజులతరువాత చెప్పింది. ఈ టీచరు ఉద్యోగం*

భేటీకోసం ఆమె వచ్చిన మూడు మాసాల ఎడబాటు తరువాత మేమిద్దరం మళ్ళీ కలుసుకున్నాం. కాని మా పొటుగాటి సంభాషణలో ఏ పనిమీదో ఆటంకం వచ్చినట్టూ, ఆ తరువాత మేం మళ్ళీ మా ముచ్చట కొనసాగినంచినట్టూ మేం మాటాడుకున్నాం. సమాజం, నైతిక బాధ్యతలు, మన ఆచారాలు - వీటిగురించే నేను ఆమెతో వాదించాను.

సుగుణ Bertrand Russell రాసిన Marriage and Morals అనే గ్రంథంనుంచి - తన చెయిలో అది లేకుండానే - నిర్దేశాలతో ఒక పెద్ద ప్రసంగమే చేసింది. "ఈ ఆధునిక యుగంలో వివాహం అనేది ఒక లైంగిక బంధంగానే కొనసాగుతుంది," అని ఆమె వాదం. "ఈ నాటి సామాజిక అంచనాలో పెళ్ళి, కుటుంబం, సంప్రదాయం, వారసత్వంకి సంబంధించిన విధులు - వీటికి పునాది ఆస్తి హక్కులు అని మనం గుర్తించాలి. వాస్తవిక భావనలవలన రెండు ఆత్మలమధ్య కలిగే లైంగిక అపేక్షకి మనం ఆస్తిని మూలాధారంగా చేసిన తరువాత దాంపత్య జీవితంలో మరేం ఉంది? అందువలనే అదునిక మగవాడు భార్యని తనకొక వారసు ఇచ్చే యంత్రంగా చూస్తున్నాడు. నేను నన్నొక స్వేచ్ఛజీవిగా చూస్తున్నాను. ఎవరికో వారసు కని ఇవ్వాలని నేను నా స్వాతంత్ర్యం త్యాగం చెయ్యలేను. ఒక మగవాడి స్నేహం, సహవాసం, నాకు ఇష్టమే కాని అందుకు మూల్యంగా, నేను ఏది అనుభవించినా అది వ్యభిచారమే. Bernard Shaw చెప్పినట్టు ఈ నాటి వివాహాలన్నీ అనుమతితో జరిగే వ్యభిచారాలే!" అని ఆమె ఆవేశంతో గర్జించినప్పుడు నేను భారతియార్ శ్లాఘించిన ఆధునిక భారత యువతిని గుర్తుచేసుకున్నాను.

ఆ ప్రాదమిక ఘట్టాల్లో నా పనంతా ఆమె మాటలు వినడంతో సరి; ఆఖరివరకూ సుగుణ మాటాడుతూనే ఉంటుంది. ఇలాగ, ఎవరైనా స్వేచ్ఛగా -సాంప్రదాయంకి విరుద్ధంగా - తన అబిప్రాయాలు మనసు విప్పి మాటాడితే నా ఆత్మతృప్తికి అది చాలా నిండుగా ఉంటుంది. అందువలనే మేం ఇద్దరం ఎప్పుడు కలుసుకున్నా మా సంభాషణ - మొదటినుంచి ఆఖరివరకూ బుద్ధిజీవుల పరివర్తనలాగ - యౌవనదశలో ప్రేమికుల మధ్య, తక్షణంలో చోటుచేసుకున్న ఆకర్షణకి - విరుద్ధంగా ఉంటుంది. మా ఇద్దరికున్న వయసు, బాధ్యత వలన మేం మా భావనలు అదుపులో ఉంచుకున్నాం. ఆ మొదటి సంవత్సరం నేను సుగుణని నాలుగు సార్లు కలుసుకున్నాను, కాని కావాలనే నాకు

*ఆమెపై ఉన్న ప్రేమానురాగాల భావనలు ఆమెకు తెలియజేయకుండా నేను నాలో దాచుకున్నాను. నా జీవితంలో అన్య స్త్రీతో మెలగడానికి, మాటాడానికి నాకు అవకాశం లేకపోయినా నేనిప్పుడు ఇలాగ ఉన్నత భావనలతో సుగుణతో మెలగడం చూసి నాకే ఆశ్చర్యంగా ఉంది!*

*మా ఇద్దరి పరిచయంకి ఒక సంవత్సరం తరువాత సుగుణ తన పుట్టినరోజు వేడుకకి తన సహోద్యోగులతో బాటు నన్ను తనింటికి పిలిచింది. ఆ పార్టీలో నేను ఆమెకి* D.H. Lawrence *రాసిన వ్యాసాల పుస్తకం ఇచ్చాను. అందులో "ఇది ఆదర్శ స్వతంత్రవాది సుగుణకి నా బహుమతి," అని రాసి, నా సంతకం పెట్టాను.*

*అవన్నీ ఇప్పుడు గుర్తుచేసుకుంటే ఎంత హాయిగా ఉంది! ఇలాంటి సుఖం అనుభవించిన తరువాత సుగుణ సహవాసం లేకుండా నేను ఒంటరిగా నా గదిలో ఉన్నప్పుడు నా ప్రజ్ఞకీ, లక్ష్యంకి విరుద్ధమైన ఉపాధిలో చిక్కుకొని అంగలార్చుకున్నాను.*

రెండవ సంవత్సరం వారిద్దరూ కలుసుకున్న ఘటన చాలా చోద్యమైనది.

సుగుణ క్లాసులోని ఒక విద్యార్థికి - అమ్మాయికి - ఆ క్లాసులోని మరొక విద్యార్థి - ఒక అబ్బాయి - ప్రేమలేఖ రాసేసాడు. "ఓ, ప్రియురాలా, నేను నిన్ను ప్రేమించి విరహతాపంలో పడిపోయాను! నువ్వుకూడా నన్ను ప్రేమిస్తావా? అలాగైతే ఒకే వాక్యంలో నీ ఏకీభావం నాకు తెలియజేస్తావా?" అనే రీతిలో వాడు ఏదో రాసేసాడు. ఆ అమ్మాయి ఆ ఉత్తరం తన తల్లిదండ్రులకి చూపించి "నన్నెవరైనా ఇలాగ అడగవచ్చా?" అని మండిపడి తన పవిత్రతని రూఢీ చేసుకుంది. అంతే, ఆమె తండ్రి మీసం మలుపుకుంటూ ఆ స్కూలుకి వెళ్ళి Head Master ని బెదిరించాడు కాబోలు. Head Master విచారణకి తన ఆఫీసుకి ఆ అమ్మాయినీ, అబ్బాయినీ పిలిచారు. క్లాసు టీచరు సుగుణ కూడా వెళ్ళింది. ఆ స్కూలు ప్రతిష్టనీ, బాలబాలికలు కలిసి చదువుకొనే పద్ధతి గౌరవార్హతనీ, కాపాడాలనే కారణం వలన ఆ అబ్బాయిని స్కూలునుంచి వెళ్ళగొట్టాలని Head Master దుర్వాశమునిలాగ గర్జించగానే సుగుణ ఆక్షేపించింది. తన అభిప్రాయం తెలియజేయడానికి ముందు ఆ అబ్బాయినీ, అమ్మాయినీ, బయటకి వెళ్ళి నిలబడమని వేడుకుంది. ఆ తరువాత Head Master కి చెప్పింది:

"క్షమించండి సార్! ఆ అమ్మాయి ఇంత తీవ్రంగాగా నొచ్చుకోడానికీ, ఆమె తండ్రి ఇలా చిఱచిఱలాడడానికి ఎటువంటి అగత్యమూ లేదని నాకనిపిస్తోంది . . . మీరు అబ్బాయిని dismiss చెయ్యడం గురించి నేను ఏకీభవించలేను. "

Head Master కి సుగుణ ధోరణి బోధపడనేలేదు. ఆ అబ్బాయి చేష్టకి ఆమె సాయం చేస్తోంది అనే ఒక కారణం వలన ఆమెని పగదీర్చుకోవాలని అతను నిశ్చయించారు.

"నేను బతికి ఉన్నంతవరకూ ఇటువంటి జగడగొండితనం భరించలేను!" అని తాళలేక బొబ్బరించి అతను మేజామీద గట్టిగా బాదారు.

"ఇందులో ఏం జగడగొండితనం ఉంది సార్? నేనూ ఆ ఉత్తరం చదివాను. చాలా పిల్లతనంగా ఉంది. అంతే!"

Head Master కి సహించరాని కోపం వచ్చేసింది. 'ఇదేం స్త్రీ?' అని అతనికి అనుమానం కూడా కలిగింది. "ప్రేమలేఖలు ఎలా రాయాలని మీరే ఆ ఆబ్బాయికి నేర్పుతారేమో?" అని అతను హేళనగా అడిగారు.

"సార్, ఆ అమ్మాయి తల్లిదండ్రులు పామరులలాగ ప్రవర్తించడం చూసి మనమూ ఆవేశపడి తొందరపడకూడదు. ఇటువంటి సమయాల్లో మనమే పిల్లల మనసుని అర్థం చేసుకొని దాన్ని సవరించాలి. ఇవన్నీ తెలివిమాలిన చేష్టల వలన బాల్యంలో ఏర్పడే సమస్యలు; ఒక అమ్మాయిని చూసి సహజంగా ప్రేమించే వయస్సులో తన కోరికని మర్యాదతో ఆమెకి ఆ యువకుడు రహస్యంగా చెప్పివుంటాడు. అందుకోసం ఆ అబ్బాయిని అవమానించి, వాడి పురుషత్వంని మనం ఎగతాళి చెయ్యడంలో ఏ న్యాయమూ లేదు . . . " అని ఆమె అన్న మాటలేవీ అతను వినిపించుకోలేదు. ఆ అమ్మాయి తండ్రి తన ఆఫీసుకి వచ్చి ఫిర్యాదు చేసినప్పుడు 'ఈ వెధవని నేనివాళే డిస్మిస్ చేస్తాను!' అని అతనికి తనిచ్చిన వాగ్దానం నిరవేర్చడానికి ఈ టీచరు అడ్డుగా ఉందని Head Master చిటచిటలాడారు.

అంతేకాదు. ఆ అమ్మాయి తండ్రికి ఆ ఊరులో కొంచెం ఖ్యాతి ఉంది. అతను ఆ స్కూలులో గౌరవనీయమైన సభ్యుడు. అతనికి ముత్తువేలర్ తో మంచి పరిచయముంది. తను ఏమీ చెయ్యకపోతే ఆ అమ్మాయి తండ్రి ముత్తువేలర్ కి

ఫిర్యాదు చేస్తే తన ఉద్యోగంకి హాని రావచ్చు అనే భయమూ అతనికి ఉంది. టీచరుకున్న దృఢ సంకల్పం ఎదిరించడానికి అతనికి ధైర్యమూ లేదు; మరి క్లాసు టీచరు సంతకం లేకుండా ఆ అబ్బాయిని డిస్మిస్ చెయ్యడం ఎలా సాధ్యం?

'నిన్ననే ఉద్యోగంలో చేరిన దీనికి ఎంత పొగరు! సాహసురాలే, దీనివలన పిల్లలు చెడిపోతారు! దీన్ని ముందు వెళ్ళగొట్టాలి!' అని అతను నిశ్చయించారు; ముత్తువేలర్ కి ఫిర్యాదు రాసి ఇచ్చారు.

*Head Master ఇచ్చిన ఫిర్యాదుని అనుసరించి సుగుణని విచారించడానికి నాకు బాధగా ఉందని నేను సుగుణకి చెప్పాను. ముందు నా ఉద్యోగ హోదాలో చాలా మెత్తగా ఆమెతో మాటాడాను. Head Master ఉత్తరం చూపించి "దీనికి మీ జవాబు ఏమిటి?" అని అడిగాను.*

*ఆ రోజు సుగుణ నా ఎదుట కూర్చోలేదు; రెండు చేతులనీ ఛాతీమీద ఆనుకొని చిరునవ్వుతో మాటాడింది:*

*"అతను నా క్లాసు విద్యార్థిని డిస్మిస్ చెయ్యాలని అన్నప్పుడు నేను ఆక్షేపించాను, కాని అది తుంటరితనం కాదు. ఒక టీచరనే బాధ్యతతో నా వాదనలని నా ఎదుట ఎదిరించకుండా అతనిలాగ నామీద నేరం మోపుతారని నేను ఎదురుచూడలేదు. ఆ విద్యార్థి చేష్ట పెద్ద నేరమూ కాదు. వాడొక మంచి విద్యార్థి, ఒక పేద కుటుంబంకి చెందినవాడనే కారణాలు తప్పిస్తే అతని పక్షంలో వాదాడడానికి నాకు మరేం అగత్యం లేదు. నేనిప్పుడు మీకు చెప్పేది ఇదే: ఆ విద్యార్థి పక్షంలో వాదాడడానికి నేను సిద్ధంగా ఉన్నాను. మీరు పూర్తిగా విచారించి ఆ తరువాత తీర్పు చెప్పడమే న్యాయం. తనకిష్టం వచ్చినట్టు Head Master ఇతన్ని డిస్మిస్ చెయ్యడం మీరు ఆక్షేపించకపోతే నేను నా ఉద్యోగం రాజీనామా చెయ్యడానికి సిద్ధంగా ఉన్నాను."*

*"అది మీకు చేయితిరిగిన పనికదా?" అని గొణుక్కుంటూ "మీ పక్షంలో న్యాయం ఉందంటే మీకెందుకీ ఇంత కోపం?" అని సుగుణని సముదాయించాను.*

*"మీరు నామీదున్న ఫిర్యాదు విచారించడానికి నన్ను పిలిచారు. అలవాటుగా మీతో స్నేహభావంతో మాటాడానికి నేను ఇవాళ రాలేదు. నామీదున్న ఈ నిందారోపణలు నాకేం కొత్తకావు. 'అహంకారి, అణకువ లేని స్త్రీ, దుర్నీతులకి వకాలతు*

*కోరేది', మరేం కావాలి?" అని కటువుతో నవ్వుతూ ఆ ఉత్తరం నా చెయికి తిరిగి సుగుణ అందించింది. ఆమె మనసు ఎంత లోతుగా బాధ పడిందని ఆ రోజే నేను గ్రహించాను. అంతవరకూ నేను ధరించిన ఉద్యోగహోదా అనే ముఖ కవచాన్ని తీసి పారేసాను:*

"మిస్ సుగుణా, I am sorry! ఈ ప్రశ్నలు అడిగి మిమ్మల్ని నొప్పించినందుకు నన్ను క్షమించండి. మిమ్మల్ని మొట్టమొదట కలుసుకున్న రోజులనుంచీ నేను మిమ్మల్ని స్నేహభావంతోనే తలపోస్తూ వస్తున్నాను. నేను ఈ కుర్చీలో కూర్చొని మిమ్మల్ని ఏ ప్రశ్న అడిగినా అందులో మిమ్మల్ని సమగ్రంగా అర్థం చేసుకోవాలని తహతహలాడే ఒక మిత్రుడు మీకు కనిపించనేలేదా? దయచేసి కూర్చోండి . . . Please!"

*సుగుణ కళ్ళలో కలవరం చోటుచేసుకుంది. నా బాహ్య ఆకారంకి, నా ధోరణికి విరుద్ధంగా అంతర్గతంగా నాలో సానుభూతి ఉందని అమెకి తెలియదేమో?*

*ఏదో మంత్రంలో వశపడినట్టు, నా మాటలు వినగానే సుగుణ కూర్చుంది. ఆమెలో మౌనం, ఆ పెదిమలలో చలనం, కళ్ళలో కాంతి - ఇవి చూడగానే ఆమె నన్ను పూర్తిగా తెలుసుకుందని నేను గ్రహించాను; నా ఎదురు పరీక్ష ఆరంభించాను:*

*"ఆ అబ్బాయి చేష్ట న్యాయమని మీరెలా వాదించగలరు? అతను పేద కుటుంబంకి చెందినవాడు, మంచి విద్యార్థి అంటున్నారు. కాని ఒక సహ విద్యార్థికి అతను అటువంటి ఉత్తరం రాయడం తప్పు కాదా?" అని నేను అడిగినప్పుడు సుగుణ ఆవేశపడకుండా, చిరచిరలాడకుండా నాకు జవాబు చెప్పింది:*

*"I don't think so . . . ఇంతకీ అతను ఏమిటి రాసాడు? 'నేను నిన్ను ప్రేమిస్తున్నాను. నువ్వూ నన్ను ప్రేమించావంటే నాకు తెలియజేయ్!' అని అడిగితే అందులో తప్పేముంది? అతనెవరినీ నిర్బంధించలేదే? ఆమె ప్రేమని అతను ఎదురు చూడలేదే? ఆ ఉత్తరంలో ఆ అబ్బాయి తన మనోభావనలు తెలియజేసాడు, అంతే . . . ఆమెకి అది ఇష్టం లేదంటే ఆ ఉత్తరాన్ని నిర్లక్ష్యం చెయ్యమో, నిరాకరించడమో ఆమెకి ఎంత సులభం! అతను తన్ను ఇలా అడిగాడని గర్వపడుతూ, తన ఇచ్ఛని ధైర్యంగా చెప్పలేని పిరికిగా . . . అదే సమయం అతను తన్ను ప్రేమించాడని అందరికీ తెలియాలనే వాంఛ ఆమెకి ఉందని మనం గుర్తించాలి . . . ఇవన్నీ తల్లిదండ్రులు*

*గ్రహించలేరు. పిల్లల భావనలు టీచర్లకే బోధపడుతుంది, వాళ్ళే మంచి మార్గదర్శకులు. ఒక యువకుడు ఒక యువతిని చూసి 'నేను నిన్ను ప్రేమిస్తున్నాను. నువ్వూ నన్ను ప్రేమిస్తావా?' అని అడిగితే అది తప్పని నేనను."*

*"అంటే 'ఏ మగవాడైనా సరే ఒక ఆడదాన్ని ఇలాగ అడగడం న్యాయం,' అని మీ ఉద్దేశమా?"*

*"కాదు. ఏ మగవాడైనా ఒక ఆడదాన్ని - అటువంటి ప్రశ్న - అలా అడక్కూడదు! That's bad manners, uncultured! ఐతే, అలా అడిగినా అదేం మితిమీరిన నేరం కాదు! ఎందుకంటే ఆ ప్రశ్న అడిగినప్పుడు ఆమె భావనకి అతను ప్రాధాన్యం ఇస్తున్నాడుకదా?" అని ఇంగ్లీషులో అడిగి, అందుకు కరారుగా జవాబు చెప్తున్నట్టు "అది తప్పకుండా న్యాయం," అని సుగుణ నిశ్చయంగా చెప్పింది.*

*ఇలాంటి ప్రశ్న ఆమెని అడగాలని చాలా రోజులనుంచి ఒక ఆతురత నాలో లేచివున్నా, ఏవో కారణాలు, పిరికితనం వలన నేనేం అడక్కుండా అది నామనసులోనే అలాగే నిలిచిపోయింది. కాని సుగుణ ప్రేరేపించిన వాదం వినగానే నాకూ నా మనసు విప్పి మాటాడాలని ఆవేశం కలిగింది. తటాలున ఏ భాషలో నా భావనలు ఆ రోజు బయలుపడ్డాయని ఎంత ఆలోచించినా నాకు ఇప్పుడు గుర్తురావడంలేదు . . .*

*ఇంతవరకూ నేను సుగుణలో ఊహించినది ఆమెకున్న వివేకం, ఆలోచనాశక్తి మాత్రమే. కాని ఆ రోజు, మొట్టమొదట ఆ ఆవేశమూ, వేగిరపాటూ చూసి, నేను ఆమెలోని భావనలు, స్త్రీతత్వం పూర్తిగా గ్రహించాను.*

*ఈ ప్రశ్ననే ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్నట్టు, దానికి జవాబు తనెప్పుడో సిద్ధం చేసినట్టు, అడగని ప్రశ్నకి తహతహలాడుతున్నట్టు, సుగుణ . . . అబ్బా, . . . నాకూ, నా రాతకీ, ఆ అనుభవం వర్ణించే ప్రజ్ఞ లేదు!"*

-ఈ మాటలు రాసినప్పుడు ముత్తువేలర్ ఆవేశపడిపోయారు; అతని కళ్ళలో ఒక కొత్త కాంతి చోటు చేసుకుంది; తన యౌవన ప్రేమానుభావాలు గుర్తుచేసుకుంటున్నారు.

ఆ ఊరు సరిహద్దులో - రైలు స్టేషన్ కి వెళ్ళే మార్గంలో ఉన్న మలుపు పొలిమేరలో - తోవను చూస్తూ సుగుణ నిలబడి ఉంది. చెయిలో ఒక చిన్న సూట్ కేసు.

ముక్కోణంగా మడిచివున్న కాశె గుడ్డె చెవులని, గడ్డంని పూర్తిగా కప్పేసింది; ఎవరూ అనవాలు పట్టుకోవద్దనికాబోలు, నల్ల కళ్ళద్దాలు.

ఆ సాయంకాల సమయంలో, ఎండలో, ఒక చెట్టుకింద నిలబడివున్న ప్రయాణికులు ఆతురతతో బస్సుకోసం కాచుకొనివున్నారు . . .

ఒక పొడుగాటి కారు వచ్చి ఆమెను ఎక్కించుకొని త్వరగా వెళ్ళింది . . .

ముత్తువేలర్ పక్కన దర్జాగా కూర్చున్న సుగుణ అతని భుజం మీద వాలింది.

తలలో జుత్తు పూర్తిగా నెరసిపోయిన వయసులో తనకీ అదృష్టం ఎలా వచ్చిందని అతని మనసూ, శరీరమూ హర్షించాయి. మానవ జీవితంలో ఇటువంటి ఆహ్లాదం చోటుచేసుకుంటుందని అతనెరుగరు; ఎన్ని మహత్తైన గ్రంధాలు చదివివున్నా ఇంతవరకూ అతనికి ఈ జ్ఞానం రాలేదు.

వెయ్యి గ్రంధాల్లో లభించని బోధనలని ఒక అనుభవం వెలువరించుతుందని అతను ఇప్పుడే తెలుసుకున్నారు.

*"ప్రేమలోనూ, ఇతరులని మోసగించి, ఆ ప్రేమకోసం ఎవరికీ తెలియకుండా ఒక అంతరంగ స్వర్గంలో వెళ్లి దాక్కొంటే అది ఎంత సరదాగా ఉంది!*

*ఆలోచనలు, ఎరుకలు అన్నీ ఒకపక్క నెట్టిపెట్టి, ఆడవారూ, మగవారూ, సహజంగా, పైమెరుగలు తోసిపారేసి, లజ్జ, మర్యాద, సంప్రదాయాలు వదిలేసి, దిగంబరులుగా, పక్షులులాగ, అడవి జంతువులలాగ, ఆదిమ ప్రజల్లాగ, రాక్షసులలాగ, దేవతల్లాగ - రధాల్లో, కోవిల గోపురాల్లో చిత్రించబడిన శృంగార భంగిమలలో కనిపించే వేల్పులులాగ - మానసికంగా, శారీరకంగా - స్వాతంత్ర జీవులుగా మారితే - దానికి పేరు ఆత్మ విమోచనం అని అనవచ్చా?*

*ఒక తటాకంలో పడి ఈదుతున్నట్టు; ఒక జలపాతం అడుగున నిలబడి తనివి తీర స్నానం చేసినట్టు; టెరడు మాసిపోయినంతవరకూ ఒక చెట్టు మీద ఎక్కుతున్నట్టు; ఒకరికొకరు పోటీగా ఒక బండరాయిని పడదోసినట్టు; తలా, తోకా తెలియక గంతులు వేసినట్టు; వొంగుతున్న విల్లు వొంగుతూ, వొంగుతూ సాగుతూంటే దానికి తగినట్టుగా బాణమూ నెగ్గి నెగ్గి నిలబడుతున్నట్టు - జీవితంలో ఈ పెనుగులాటకి ఏమైనా అర్ధముందా?*

*మానవ శరీరంలో, మానవ స్వభావంలో, మానవ ఏవగింపులో ఇటువంటి అభిరుచి ఎలా సాధ్యం?*

*ఆ ఏకాంత భవనంలో - దాని చుట్టూ చెట్లు, కొండలు, ఒక సెలయేరు ఉన్నాయి - మేం చాలా శని, ఆదివారాలు గడిపాం. అక్కడున్న కొందరు నౌకరీలు ఆ ప్రాంతంకి చెందిన అడవి జాతివారనే కారణంచేత వాళ్ళు సుగుణని తమ యజమానుడుతో వస్తున్న యజమాని అనే భావించారు.*

*ఆ రోజులే నా జీవితంలో సార్థమైన రోజులు. శారీరకంగా, భావేశంగా, వివేకంగా మా ఇద్దరి స్వాతంత్ర ఉద్యమంకి ఆ రోజులే దోహదం చేసాయి.*

*అదిగో, ఆ భవనం . . .*

*చతురస్రంగా, తులసీకోటలాగ ఒక కట్టడం. చుట్టూ నాలుగు పక్కలా ఇంటికి పైకప్పుగా విదేశీయ పెంకులతో, అదొక పురాత ఇల్లు. పరామరిక లేకపోవడం వలన గోడల మీద అడ్డుగా వాలిన చెట్లు, బీటికలు, వర్షంలో ముంచుకున్న ఆకుపచ్చని కాలిబాటలు - అవన్నీ, ఇటీవల మరమ్మతుల తరువాతనే బాగుపడ్డాయి.*

*ఇంటి వసారాలో మనం కూర్చొని చూస్తే అడవి కనిపిస్తుంది. నిత్యమూ తుమ్మెదల ఝుంకారం వినిపిస్తుంది. మంచి చలిలో, నక్కల కూతలు, అటవికుల రమ్య గానం ఒకేలాగ మనం వింటాం. రాత్రి నిశబ్దంలో శృంఖనాదం జోరుగా మోగుతుంది.*

*ఆ భవనం ఒక చిన్న పర్వతం మీద ఉంది. ఆ పర్వతం అడుగున ఒక సెలయేరు బండరాళ్ళమీద జోరుగా ప్రవహించడం చూస్తాం. ఆ సెలయేరు ఒక ఆ పర్వతం చుట్టూ ఒక మైలు దూరం అర్ధవృత్తంగా ప్రయాణం చేసి ఆఖరికి ఆ లోయకి ఒక జలపాతంగా మారుతుంది."*

పగటివేళ ముత్తువేలర్, సుగుణ, ఆ బండరాళ్ళమీద విడిగా విడిగా కూర్చొని ఏదో పుస్తకం చదువుకోడమో లేక దగ్గరగా కూర్చొని కాళ్ళని నీళ్ళలో ముంచుకుంటూ ఏదో మాటాడుకోడమో, లేక ఇద్దరూ చేతులు కలుపుకొని, ఆ రాళ్ళని దాటి ఒక మైలు దూరం నడవడమో - అలా గడిపిన రోజుల్లో వాళ్ళ ప్రపంచం ఆ ఏకాంత లోయలేనే సఫలమైంది.

ఆ పరిసరాలు, ఆ వాతావరణం రాబోయే ఒక నూతన జీవితంకి సూచనగా వాళ్ళిద్దరూ కొనియాడారు. దానికి స్వాగతం చెప్పే ప్రతినిధులనే దృష్టిలో తమ తమ వ్యక్తిగత జీవితాలగురించి ఇద్దరూ పూర్తిగా మరిచిపోయారు.

*"ఆ Head Master రాసి పంపిన ఫిర్యాదు విచారణకి సుగుణని నేను పిలిచానే, ఆ వారం ఆరంభించి ఈ రెండు సంవత్సరాల్లో అన్ని వారాల్లోనూ శని ఆదివారాలు మేమిద్దరం ఆ భవనంలో గడిపాం. స్కూల్లో చదువుతున్నప్పుడు ప్రతీ శుక్రవారం సాయంకాలం - ఇక రాబోయే రెండు సెలవు దినాల గురించేకదా నా ఆలోచన, పరవశం అంతా? అలాగే ఇప్పుడుకూడా నేను ఒక వారంలో ఐదు రోజులూ ఈ శుక్రవారంని ఎదురుచూస్తూనే గడిపాను. ఈ రెండు సంవత్సరాలలో నా వయసులో ఇరవై సంవత్సరాలు తగ్గిపోయినట్టనిపించింది. అవును, జీవితాన్ని జీవితంలాగ గడిపితే వయస్సుకూడా తగ్గుతూ వస్తుంది కాబోలు!*

*ఆమె గురించి నేనూ, నాగురించి సుగుణ, చాలా రోజుల వరకూ ఏదీ అడిగి తెలుసుకోలేదు. మా ఇద్దరికీ ఇతరుల బాహ్యజీవితంలోని అబద్ధాలగురించి తెలుసుకోవాలనే ఆతురత లేదు. మేమిద్దరం నిరర్థకంగా వెయ్యి కబుర్లు మాటాడుకున్నా, మధ్య మధ్య మాగురించికూడా మాటాడుకుంటాం. కాని అటువంటి సమయంలోనూ మా అవగాహనకి ఏది ముఖ్యమో, అదే గుర్తుచేసుకొని మాటాడుతాం. ఒక ఉదాహరణ చెప్తాను: ఒక సమయం మా సంభాషణలో, మాట వరుసకి, నేను నా భార్యల గురించి ఏమైనా చెప్తాను. అలా అనగానే, ఆ ప్రజ్ఞ రాగానే నాలో కొంచెం తడబాటు చోటుచేసుకుంటుంది. అలాగే మాట వరుసలో సుగుణ కూడా గతకాలంలో తనకేర్పడిన ప్రేమానుభవాల గురించి ఏమైనా చెప్పితే, నేనూ అందులో ఎక్కువగా శ్రద్ధ చూపను. అఖరికి, ఇప్పుడు ఆలోచించి చూస్తే నాకు తెలియని ఏ పాతకాలపు రహస్యాలు ఆమె దగ్గరగాని, ఆమెకి తెలియని రహస్యాలు నా దగ్గరగాని లేవనే చెప్పాలి. స్త్రీ - పురుష సంబంధాల విషయాలలో హద్దులు మీరి మేం ఏదీ చెయ్యలేదు. దాంపత్య జీవితంకి శాస్వతంగా అగత్యమైన ఈ సంప్రదాయాలు మేం కరారుగా పాటించాం.*

ఈ స్పష్టత నాకు చాలా తృప్తిగా ఉందని గ్రహించి నేను ఒక రోజు సుగుణకి చెప్పాను:

"మనిద్దరి భావనలూ ఎంత అనుగుణంగా ఉన్నాయో చూసావా? మనిద్దరంగాని పెళ్ళి చేసుకొని ఉంటే ఆదర్శ దంపతులుగా ఉంటాం కదూ?"

సుగుణ ముందు నవ్వేసింది. ఆమె నవ్వులోనే ఆమె చింతన నాకు తెలిసిపోయింది. నా ఆశ నా తెలివిని మూసేసిందని గ్రహించిన సౌజన్యంతో నాకు చెప్పింది:

"ఇలా అంటున్నది మీరు కాదు. ఇది మీకు తెలుసా?" అని ఒక విద్యార్థికి పాఠం చెప్పే ధోరణిలో సుగుణ ఆరంభించింది. "మీకూ నాకూ సంబంధించిన చుట్టరికంకి మీరు సామాజిక అంగీకారం కోరుతున్నారు, కాని మీరంటున్న వివాహం వలన మన చుట్టరికంకి ఒక కొత్త అర్థం రాబోతుందని అంటున్నారా? వివాహం అన్నప్పుడు వ్యక్తిగతంగా దానికి అర్థం వేరు, సమాజంకి అర్థం వేరు. మనం స్వేచ్ఛగురించి ఎంత వాదించినా, మనమూ సమాజంలో ఒక ప్రతిరూపం, మనకీ సామాజిక ప్రజ్ఞ ఉంది. సమాజం అనే పదం abstract అని మనం గుర్తు చేసుకోవాలి. సమాజం అంటే 'ఇది!' అని దృఢంగా అనలేం. వివాహం అనే పదమూ, పరిమితీ లేకుండా ఈ జన సమూహం ఎన్నో సంవత్సరాలుగా ఉంది. ఇంకా ఎన్నో సంవత్సరాలు ఉంటుంది. మన రక్తంలోనూ, ప్రజ్ఞలోనూ ఆదిమ, సాంప్రదాయాలు లోతుగా పాతుకొని ఉన్నాయి. మీరూ, నేనూ సంతోషంగా ఉన్నామనే కారణం వలన మీ మగ మనసు నన్ను మీరు ప్రత్యేకంగా అనుభవించే భోగ వస్తువుగా చూస్తోంది, దాన్ని సమాజం రూఢీ చెయ్యాలని కోరుతోంది. పురుషుడు ఆశించేది ఏమిటి? శాశ్వతత్వం. దాన్నే అమరత్వం అని, చమత్కారంగా సిగ్గు లేకుండా ప్రకటించడం మనం చూస్తున్నాం. ఈ మీ వాంఛకీ, మీ వ్యక్తిగత విలువలకీ ఎటువంటి సంబంధమూ లేదు. సామాజిక అంగీకారం కావాలనే కోరికకి ఆధారం ఏమిటో తెలుసా? పురుషజాతికున్న బలహీనతలు. ఆ బలహీనతల్లో ప్రధానమైనది శాశ్వతత్వం. శాశ్వతత్వం కోరే పురుషుడు శాశ్వతంగా శాంతం పోగొట్టుకుంటాడు, అంతే. మరేం లాభం లేదు! అతను అన్ని సుఖాలూ అనుభవించినప్పుడుకూడా ఆ స్థిరత్వం గురించే తపించిపోతాడు. అదే అతని కర్మ. ఈ

లోకం, జీవితం, స్థిరమైనవే. ఈ స్థిరత్వంకి మూల కారణం వ్యక్తిగత చేష్టలు. అందుకే 'జగమే మాయ, బ్రతుకే మాయ!' అనే బోధనలు మనం వింటున్నాం. చుట్టరికాలు, బంధువర్గాలు నిరంతరంగా ఉండాలనే కోరికవలనే వివాహం అనే సామాజిక ముద్ర అమలుకి వచ్చింది. ఆ ముద్ర వెయ్యగానే, ఆ చుట్టరికంలోని, స్నేహంలోని ఆత్మ నశించిపోతుంది. ఇవాళ ఉదయం మనిద్దరం ఆ సెలయేరు ఒడ్డున బండరాళ్ళమీద నడిచినప్పుడు ఎంత బిగువుగా ఒకరికొకరు చేతులు పట్టుకొని నడిచాం! కొన్నిచోట్ల నేను వెనకపడినప్పుడు నేను యీడ్చితే మీరు పడిపోకూడదని మనం చేతులు విడివించుకున్నాం. ఆ తరువాత మళ్ళీ చేతులు కలుపుకొని నడిచాం. మనమే ఏర్పరచుకున్న ఆ స్వాతంత్ర బంధమే జీవితంలో మనకి దోహదం చేస్తుంది. మనం బిగువుగా చేతులు కలుపుకున్నాం, కాని మన చేతులు బిగువుగా కట్టబడలేదు. ఒక మూడవ శక్తి, నిర్బంధం, మనకిష్టం లేకుండా, ఏదో ఒక నెపంతో, ముద్ర వేసి, శాస్వతంగా మనకి చుట్టరికం ఏర్పడితే మన స్వేచ్ఛ నాశనమైపోయినట్టేకదా? ఆ స్వేచ్ఛ పోగొట్టుకుంటే మనకది పెద్ద చెరసాలే కాదా? మీరు మన పెళ్ళి గురించి మాటాడారు, అందుకే మీకొక సంగతి స్పష్టం చేస్తున్నాను. ఈ నిమిషం నా మనసులో మిమ్మల్ని తప్పిస్తే మరెవరూ లేరు. అంటే అన్ని నిమిషాలూ నేను ఇలాగే గడుపుతాను, గడపాలి అని కాదు. ఈ నిమిషం ఇది సత్యం. ఇటువంటి సత్యమైన నిజంతో ఏ పతివ్రతా ఏ భర్తతోనూ కాపురం చెయ్యలేదు. అది మనం గుర్తుచేసుకోవాలి. ఈ నిమిషం అనేది మన గర్వంకోసం కాదు, అదొక వేడుక . . . ఎప్పుడైనా ఒక రోజు మనలో ఎటువంటి కారణమూ లేకుండా ఎడబాటు రావచ్చు . . . జీవితమనే ఉత్సవంలో ప్రజలు తమ తమ వ్యవహారాలు చూసుకుంటారు. కలుసుకోవడం, విడిపోవడం స్వేచ్ఛగా సాగుతే అందులో శోకం ఉండదు . . .

ఈ తరం మగవాళ్ళు - నేను కలుసుకున్నవారందరూ - నా ఈ నియమంతో ఏకీభవించరని నేను తెలుసుకున్నాను. నేను నా స్వతంత్రత గురించి మాటాడితే వాడు జుత్తు పీక్కోవడం ఎందుకు? మనోక్షోభ భరించలేక అల్లాడుతున్నాడే? ఆ తరువాత ఆ స్త్రీ దగ్గర వాడు ఏమిటి ఎదురుచూస్తున్నాడు? 'ఇది నాది!' అనే భ్రాంతి తప్పిస్తే వాడికి అందులో మరేం సుఖముంది?నాకోసం ఒక మగవాడు బాధ పడాలా? నాకోసం ఎవరూ

బాధపడవద్దు, నేనూ మరెవరికోసం బాధపడను! చుట్టరికం అంటే పరస్పరం బాధపడడం కాదు. అదృష్టవశంగా మారుతున్న ఈ రోజుల్లో అవశ్యకమైతే వివాహాలకీ పరిహారాలున్నాయి . . . నన్నడిగతే నిర్బంధం లేకుండా 'ఒక భర్తకి ఒక పత్ని' అనే సిద్ధాంతం ఒప్పుకోతగ్గది. నేనిలాగ అనడం వలన నాకు కావలసిన చుట్టరికాలకోసం నేను వెదకి, ఆఖరికి ఇలా ఐపోయానని కాదు. నన్ను తమతో జోడించుకోలేని మగవారు నన్ను వదిలివెళ్ళిపోయే సమయంలో వాళ్ళు వెళ్ళడం జరిగింది. అటువంటి మార్గంతరాల్లో శోకం ఉండదు. అటువంటి సమయాల్లోనూ ఆ చుట్టరికం ఎడతెగకుండా కొనసాగాలంటే ఆదే అత్యంత శోకం!" అని తన సిద్ధాంతాలు తరచుగా సుగుణ నాకు వివరించేది.

మా ఇద్దరికీ మా భావనల గురించి పరస్పర, ఉన్నత అభిమానం, మర్యాద ఉంది. అందువలన సుగుణ తన సిద్ధాంతం మార్చుకోవాలని నాకు తోచినా నేను ఆమెను అడిగివుండను.

మా ఇద్దరికీ ధైర్యంగా ఆలోచించే శక్తి ఉంది. మరెందుకు మేమిద్దరం పిరికిపందల్లాగ . . . నలుగురు చూస్తారని భయపడి ప్రతీ సాయంకాలం రైలు స్టేషన్ వెనుక ఉన్న రహదారిలో సుగుణని కాచుకోమని చెప్పి, ఎవరినో దొంగతనంగా అపహరించినట్టు ఆమెతో కలిసి పరుగెత్తుకొని పోవడం, మళ్ళీ సోమవారం ఉదయం వెలుతురు రావడానికి ముందే ఆమెను రైలు స్టేషన్ దగ్గర దింపేసి ఆమె టాక్సీలో ఎక్కి వెళ్ళడం నేను దూరంనుంచి చూస్తూ నిలబడడం? . . . ఈ మోసం తలుచుకొని నాకు బాధ కలిగేది.

నాకెందుకు భయం?

ప్రతీ స్త్రీకి "నువ్వు దేవత, పతివ్రత," అని బిరుదులు అంటించి ఆమె స్వతంత్రతని దోపిడీ చెయ్యడం మనకి తెలుసుకదా? ఆ బిరుదులు పోగొట్టుకోకూడదని ప్రతీ స్త్రీ ఎంత ప్రయాసపడుతోంది! అటువంటి చిన్నదనంకి, నా భయంకి ఏమైనా భేదం ఉందా? ఈ సమాజమూ నాకూ ఎన్ని బిరుదులు ఇచ్చివుంది!

ఒక రోజు పొద్దున్నే ఎస్టేట్ నుంచి వచ్చిన నా కారు రైలు స్టేషన్ దగ్గర ఆగకుండా ధైర్యంగా ఊరులో ప్రవేశించింది. మేమిద్దరం ఊరులోనే రోజూ కలుసుకున్నాం. అంతే, ఊరులోనూ, వీధుల్లోనూ, ఇళ్ళల్లోనూ, ప్లేగ్ వ్యాధి వచ్చినట్టు దిగులు పట్టుకుంది!

అయ్యో, దేవుడా! వాళ్ళందరూ విసుగ్గుండా నిత్యమూ మాగురించే మాటాడుకుంటున్నారు! నాకు కొన్ని సమయాల్లో ఆశ్చర్యంగా ఉంటుంది: నా గురించి కబుర్లు వినడానికి ముందు వీళ్ళందరూ ఏం చేసేవారు? కోవిల, చెరువు గట్టు, బజారు వీధి, పార్కు, నలుగురు కలుసుకొనే ఏ జాగా - ఎక్కడ చూసినా నాగురించే వృధా మాటలు!

వీళ్ల మాటలు వింటూంటే నాకున్న ధైర్యం దృఢపడింది. నన్ను పొగడుతున్న ఊరే ఇలా మారిందంటే ఇక నామీద అంతులేని కసి, కటువు ఉన్న నా ధర్మపత్నులగురించి వేరే చెప్పాలా? వాళ్ళిద్దరూ నాతో వేరే వేరేగా ఒంటరిగానూ, తమలో తామే దీనికోసం కేకలు పెట్టినప్పుడు ఇల్లంతా ఒకటే గడబిడ! నాకేం పోయింది? వాళ్ళని చూసినప్పుడల్లా నేను నాలో ఏదో ఒకటి switch off చేయడం అలవాటు చేసుకున్నాను. వాళ్ళిద్దరూ, ఒకరి తరువాత ఒకరు, నా ముందు నిలబడి గొంతుచించుకున్నప్పుడు, వాళ్ళ చేష్టల్లోనే - చేతుల విసురు, మొహంలో జుగుప్స, నోటినుంచి బూతులూ - నేను అన్నీ గ్రహించాను: నేనెవరో మంత్రగత్తె వలలో పడిపోయానని వీళ్ళంటున్నారు. నేను కన్ను మూసినతరువాత నా ఆస్తికి వాళ్ళిద్దరిలో ఎవరికి ప్రధమ స్థానం అనే పోటీలో బాధ పడుతున్న ఈ పతివ్రతలని మోసగించి నేను నా సంపదని ఎవరికో దానం చేస్తున్నానని ఏడ్చారు.

నౌకరులందరూ నా వీపు వెనుక నన్ను చూసి నవ్వుకున్నారు. కొందరు స్నేహితులు - నాతో ఈడుగా మెలిగిన వారు - మా మధ్య మోమాటం వద్దని - నన్ను సూటిగా అడిగేసి తృప్తి పడి ఎగతాళి చేసారు.

"యాభైయేళ్ళ తరువాత ఇదేంటి నాన్నగారూ?" అని ముప్పైయేళ్ళలోనే ముసలివాడైన నా అల్లుడి భార్య - నా కూతురు - నా దగ్గరకి వచ్చి ఏడ్చింది.

అమెరికాకి వెళ్ళివచ్చిన తరువాతకూడా ఈ దేశం సాంప్రదాయం కాపాడుతున్న నా కొడుకు చాలా కటువుతో నన్ను తిట్టుతూ ఇంగ్లీషులో ఒక ఉత్తరం రాసాడు.

నా సర్దార్ మాత్రం, తనకిది సంబంధించిన విషయం కాదని, ఎప్పటిలాగే నాతో మెలుగుతోంది. అవును, దానికి ఎంత నాగరికత ఉంది! అందరూ నన్ను చుట్టుముట్టుకొని పైబడుతుంటే అది మాత్రం నన్ను రక్షించడానికని నా పక్కన వచ్చి, తన సానుభూతిని తన కళ్ళతో నాకు తెలియజేస్తుంది. నేను అనుభవించే తీరని పగకి యీడుగా నామీద మళ్ళీ మళ్ళీ వాలుతోంది.

వీళ్ళ భయం పోగొట్టాలని నేనింతవరకూ పోగుచేసిన నా ఆస్తిని, బాధ్యతలని వీళ్ళకే వదిలేసి - ముక్కు, మోహం తెలియని అన్యులమధ్య - కొత్తగా జీవించాలనే నా ఆలోచనని ఒకరోజు సుగుణకి చెప్పాను. ఆమె ధైర్యంగా సరేనంది.

ఒక వారం రోజులుగా ఈ ఇంటిలో ప్లీడర్లు, గుమాస్తాలు, నా సహకారులూ గుమిగూడివున్నారు . . .

ఒక్కొక్క బాధ్యతని వదలించుకుంటే మనసుకి మాత్రం కాదు, శరీరంకీ ఎంత హాయిగా ఉంది! నిన్న ఉదయం నా కుటుంబ సభ్యులందరినీ పిలిచి, హాలులో కూర్చోబెట్టి, నా ఆస్తి నిర్ధారణ పత్రాలు చదివి వివరించాను. నాయనా, అప్పుడు ఎన్ని గొడవలు, ఏడ్పులు, తిట్లు, శాపాలు!

గత ముప్పై సంవత్సరాలలో నా బాధ్యతకి వచ్చిచేరిన నా పూర్వీకుల ఆస్తిని నేను పదింతలుగా వృద్ధిచేసివున్నాను. అందుకు కృషిచేసివున్నాను. నేనే నా ఆస్తిపై ఆధారపడి జీవించలేదు. ఇతరులు - చాలామంది - ఉద్యోగులుగా అందుకు దోహదం చేసారు. వాళ్ళతో కలిసి, యజమానుడనే పేరుతో, నేనూ కృషి చేసాను. నా ప్రయాస లేకుండా ఈ పత్తి ఖర్ఖానా, ఈ బస్సుల సేవ, ఈ సినిమా శాలలు - ఏవీ ఈ కుటుంబంకి చెందిన సంపదలుగా వచ్చి ఉండవు. ఈ కుటుంబం అభివృద్ధికి నేను తప్పనిసరి కాదు; అలాగే వీటికీ నేను అనివార్యం కాదు.

నేనీ ఆస్తులనుంచి నాకని ఏదీ వద్దని నిర్ణయించాను. నా పేరులో నేనేదీ రాసిబెట్టలేదు. ఒక న్యాయాధిపతి తన పీఠంనుంచి పంచిపెట్టినట్టు నా ఆస్తులు నా కుటుంబ సభ్యులకి పెద్దమనిషితనంతో ఇవ్వాలనుకున్నాను. అప్పుడే నాకొక ఆలోచన తట్టింది.

*ఆస్తిలో భాగస్తులంటే దానిమూలంగా వచ్చే లాభం, ఫలం అనుభవించడం అన్న మాట. "ఈ పురాతన ఆస్తి సంపదలు ధ్వంసం చెయ్యడానికి వీళ్ళకి హక్కు లేదు!" అనే షరతు చేర్చాలని అనుకున్నాను. ఈ భావన భూస్వాముల మనప్రవృత్తి వలన నాకు కలిగిందని, ఇష్టమున్నా లేకున్నా, నేను గ్రహించాను. కాని ఆఖరికి వాళ్ళ హక్కుని ఎదిరించే ఆ షరతుని నేను ఆ పత్రంలో రాయలేదు.*

*ఇన్ని సంవత్సరాల కృషికోసం నా జీతమని రెండు లక్షల రూపాయలు తీసుకున్నాను.*

*ఇదిగో, ఈ రాత్రి సమాప్తమైపోయింది. ఒకరోజు గొడవలన్నిటికీ శృతి చేర్చినట్టు పగటి వేళ వచ్చేసింది."*

ముత్తువేలర్ బయలుదేరడానికి ఇంకా ఒక గంట ఉంది; అతను సర్దార్ తో ఆడుకుంటున్నారు.

నౌకరులు అతని రెండు సూట్ కేసులు, ఒక తోలు సంచి - మేడమీదనుంచి తీసుకొని వచ్చినప్పుడు అతన్ని దాటి వెళ్ళినప్పుడు "సర్దార్ని బాగా చూసుకోండి!" అని వాళ్ళకి చెప్పాలని అతనికనిపించింది. 'సరేలే, ఎందుకు నేనింకా అధికారం చెలాయించాలి?' అని మరేం అనక ఊరుకున్నారు.

సుమారు ఏడు గంటలకి - ఒక ముప్ఫైయేళ్ళ యువకుడులాగ - తెల్లని పంచె, అంగవస్త్రం ధరించి - గాంభీర్యంతో మెట్లు దిగి వచ్చినప్పుడు అతను ఇంకొక మారు ఆ గ్రంధాలయం చూసారు.

'ఈ వెసవి సెలవుల తరువాత ఇది కళాశాలకి వెళ్ళిపోతుంది; దీని మూలం భవిష్యత్తులో ఎందరు పైత్తాలు అవతరిస్తారో?' అనే ఆలోచనతో అతను ఉప్పొంగిపోయారు.

క్రింద హాలులో అతని మాజీ బంధువులందరూ గుమిగూడివున్నారు. వాళ్ళని చూస్తే మనసుకి కవచం ధరించినట్టు; పగ, ఈర్ష్య వశపరచుకున్నట్టు; గుహనుంచి బయలుదేరిన ఒక భయంకర మృగంని చుట్టుముట్టడానికి ఒక బోనుతో సిద్ధంగా ఉన్నట్టు; నిబ్బరంగా, నిమ్మళంగా కనిపిస్తున్నారు. భాగ్యమూ, దాక్షాయణీ ఏడవకుండా, వాపోకుండా, దెబ్బలాడకుండా ఉండడం ఎప్పుడు నేర్చుకున్నారని

ఆశ్చర్యపడుతూ ముత్తువేలర్ భాగ్యంని చూసినప్పుడు ఆమె ఒక సారి దగ్గి, 'దేవుడా!' అని విసుగ్గుంది. 'మంచి మాటే అంటోంది, దాన్ని ఇంకొకసారి చూస్తే ఏమంటుందో?' అనే భయంతో అతను మొహం వేరే దిశలో మళ్ళించారు.

ఈ నిమిషం అతనికి చాలా ఇబ్బందిగా ఉంది. వీళ్ళందరిదగ్గర ఏమని చెప్పి తను సెలవు తీసుకోవాలనే ఆలోచన రాగానే అతనికి దుఃఖం కలిగింది. వీళ్ళందరూ తన్ను అపార్థం చేసుకున్నారని గుర్తుచేసుకున్నప్పుడు అది ఇంకా ఎక్కువైంది. 'నాకు మీమీద ఎటువంటి క్రోధమూ, విరోధమూ లేదు. నేను వెళ్ళిపోవడంవలన మీలో ఎవరికీ ఎటువంటి నష్టమూ లేదనే నమ్మకంతో నేను వెళ్తున్నాను!" అని వివరించి చెప్పాలనిపించింది.

కాని తన భాష వాళ్ళకి బోధపడదని గ్రహించి అతను అలాగే నిల్చున్నారు. తన బాల్యంలో కాశీకి వెళ్ళారే ఆ  తాతగారు, ఆ ఘటన ఇప్పుడొక మనవడిని చూడగానే అతనికి జ్ఞాపకం వచ్చింది.

ఆ పెద్ద ఇంట్లోని అన్ని భాగాల్లోనూ అతని పాదాలు పడి చాలా రోజులైపోయాయి. ఇప్పుడు అతను ఆ ఇల్లునుంచి పూర్తిగా నిష్క్రమించుతున్నారు. పక్కనే ఉన్న సర్దార్ తలని తాకాలని అతను తలెత్తి చూసినప్పుడు  -

అతని డ్రైవరు భవ్యంగా దగ్గరకి వచ్చి అతనికి ఒక ఉత్తరం అందించాడు. అతను దాన్ని తీసుకున్నప్పుడు అంతవరకూ అక్కడున్న ప్రశాంతత భంగమైనట్టు, మునుపటి బంధువులందరూ నోరెత్తకుండా మూలుగుతున్నట్టు అతను ఊహించగలిగారు. మెల్లగా జేబునుంచి కళ్ళద్దాలు తీసి, తొడుక్కొని, కవరుని తీసి, ఉత్తరం చదివారు:

అది ఇంగ్లీషులో "నా ప్రియమైన మిత్రులు . . . " అని ఆరంభించింది.

అతనికి ఎందుకో దాన్ని కూర్చొని చదవాలనిపించింది. అతను వెంటనే మెట్లమీద కూర్చున్నారు.

ఆ మొదటి వాక్యం చదవగానే అతన్ని భయం ఆవరించుకుంది; భయపడుతూనే చదవసాగారు.

"దయచేసి నన్ను క్షమించండి!"

అతను తలెత్తి హాలులో అందరినీ చూసారు. అతనికి మాత్రం వినబడినట్టు ఆ కుట్రదారులు జయించిన పొగరుతో చప్పట్లు కొట్టడం విని అతను రెండు చెవులూ మూసుకున్నారు. మొహమంతా చెమట పట్టేసింది. 'సరే, నవ్వితే నవ్వనీ!' అని నిశ్చయించి పూర్తిగా దాన్ని చదివారు.

'మగవాడి బలహీనత శాశ్వతత్వం కోరడమే. నేను మీకు పూర్తి నమ్మకం ఇచ్చి ఆఖరికి మోసం చేసేసాను. నేను మీకు ముందే చెప్పివున్నాను - ఇతరులకోసం నేను బాధపడను, నాకోసం ఎవరూ బాధ పడకూడదని. అలాంటప్పుడు మిమ్మల్ని అంటుకున్న బంధువులందరినీ కొట్టిపారేసి, మీకు నిరంతరంగా ఒక జీవితం ఇవ్వగలిగిన జవాబుదారిగా నాకు యోగ్యత ఉందనే భ్రమ నాకెలా వచ్చిందని నిన్న సాయంకాలమే- నేను మొట్టమొదట - ఆలోచించాను. మీ ఇద్దరు భార్యలూ, మీ అబ్బాయీ, అమ్మాయీ కోపంతో ఆ న్యాయం గురించి నన్నడిగినప్పుడే నేను నా పొరబాటు గ్రహించాను. నేను వాళ్ళకి ఎటువంటి జవాబు ఇచ్చినా అది మన జీవితంకి ఒక ముడి ఐపోతుంది. మనం పెళ్ళి చేసుకుంటేనే మన చుట్టరికం ఒక ముడి అనలేం. మీకెవరూ లేరు, నాకెవరూ లేరు అనే పరిస్థితిలో మనమిద్దరం మనకని ఒక జీవితం కల్పించుకుంటే భవిష్యత్తులో ఆదీ ఒక ముడిగానే మారవచ్చు. మనిద్దరి చుట్టరికం మనకొక భారం అవనే కూడదు. నేనీ ఉత్తరం ద్వారా మీకు పంపించే సందేశం ఇదే: మనం ఈ ఊరు వదలి మరెక్కడికీ వెళ్ళవద్దు! ఎక్కడికి వెళ్ళినా నలుగురు ఏలే గుంపులోనే మనం జీవించి తీరాలి. నాతో మీరు ఏకీభవిస్తారని నా ఆశ. మీరు బయలుదేరి వచ్చిన తరువాత మిమ్మల్ని మోసం చెయ్యకూడదని ఈ సలహా మీకు ఉత్తరం ద్వారా తెలియజేస్తున్నాను.

మీ ప్రియమైన

సుగుణ

గభీమని తనకి వయస్సు ఇరవైయేళ్ళు ఎదిగినట్టు అతనికనిపించింది.

*స్త్రీలందరూ సామాజిక ఘోరంకి తప్పకుండా బలి అవాలనే నియమం ఉందా?*

*భాగ్యం, దాక్షాయణీ, ఒక మూల . . . సుగుణలాంటివారు మరొక మూల. కాని వాళ్ళ ఏకత్వం సంఘానికి బలి కావడం. తన స్వతంత్రతని ఇంత భయంతో*

కాపాడాలని సుగుణ ప్రయాసపడుతోంది, కాని అందువలనేకదా ఆఖరికి ఆమెకి ఈ అవస్థ! ఆమె దృష్టిలో ప్రపంచం ఎంత ఇరుగుగా ఐపోయింది! బలి అయిన స్త్రీలు తమ భర్తలని కసితీర్చుకున్నట్టు సుగుణ ఈ సమాజంనే కసితీర్చుకొంటుంది కాబోలు . . .

సామాజిక బాధ్యతలకి భయపడి నేనెక్కడో పారిపోతున్నానని ఈమె అంటోంది! అది ఎంత పెద్ద పొరబాటు! తనే సామాజిక శిక్షకి భయపడి తప్పించుకుంటోందని నాకిప్పుడు బోధపడింది.

ఇప్పుడు, నేనేం చెయ్యాలి?

ఈ కుటుంబ సభ్యులలో నేనే ఇప్పుడు పేదవాణ్ణి. నేనిప్పుడు ఈ ఇంటికి యజమానుడు కాదు. అక్కడ నిల్చొని నన్ను చూస్తున్నాడే - నా తెలివితక్కువ అల్లుడు - వాడిప్పుడు నాకంటే గొప్పవాడు!

నేను వీళ్లందరి విషయాల్లో దయా దాక్షిణ్యం చూపాను. కాని, వీళ్ళందరూ నాకెంత అన్యాయం చేసారు! తమ పని సాధించాలని సుగుణని చమత్కారంగా ఉపయోగించుకున్నారు . . .

వాళ్ళ మొహాలు చూడండి . . . 'జయం మనదే!' అనే అహంకారం, పొగరు!

సుగుణని కలుసుకొని అమెతో . . . ఛీ. ఛీ, . . . దానికంటే పెద్ద అవమానం లేదు! ఆమెకి తెలియనది నేను వివరించి చెప్పాలా? ఆమె నిర్ణయంకి మీరి నేను ఏది చెప్పినా అది బలాత్కారమే కదా?

ఆమె అన్నట్టు -

జీవితమనే ఉత్సవంలో ప్రజలు తమ తమ వ్యవహారాలు చూసుకుంటారు. కలుసుకోవడం, విడిపోవడం, మళ్ళీ ఎదురవడం - ఇవన్నీ స్వేచ్ఛగా జరిగే ఘటనలు కాబోలు! ఇందులో శోకం ఎందుకు? మరేం లేదు!'

అతను మౌనంగా తల వొంచి, అలసిన శరీరంతో, ఒక్కొక్క మెట్టులో ఆగి ఆగి మేడమీదకి వెళ్తున్నారు. తన మెడలోని గొలుసుని ఈడ్చుకుంటూ - ముత్తువేలర్ తన ఆత్మని లాగ్గొని వెళ్తున్నట్టు - అతని వెనుక సర్దార్ ఆ మేడమెట్లమీద నడుస్తోంది.

మేడగదిని చేరుకున్న ముత్తువేలర్ లోపల ప్రవేశించడానికి ముందు తొందరగా తలుపుని బాది మూసేసారు.

మేజామీద చిందరవందరగా ఉన్న పుస్తకాలమధ్య 'నా చరిత్ర' అనే పేరుతో అతను రాత్రంతా రాసిన కాగితాలని ఒక ఫైలులో జాగ్రత్తగా ఉంచారే, దాన్ని తీసుకొని చిరునవ్వుతో పేజీలు తిప్పారు.

మిద్దె క్రిందనుంచి భాగ్యం మాటలు వినిపించాయి:

"ఆస్తి సంపదలన్నీ తనకే వస్తాయని అది కలలు కన్నదేమో?"

ఆ తరువాత ఆమె అన్న మాటలేవీ అతనికి వినిపించలేదు.

'ఆఖరికి స్త్రీ అంటే దౌర్బల్యమే కాబోలు!' అని ముత్తువేల్ తనలో గొణుక్కున్నారు. అతని కళ్ళకి ఆ నిద్రమాత్రల సీసా కనిపించింది.


తొందర తొందరగా ఆ ఫైలులోని కాగితాలు తిరగవేసి ఆఖరి పేజీలో ఆఖరి వాక్యం అతను రాస్తున్నారు.

*'నేనిక నిద్రపోతాను.'*

బయట గది తలుపుని సర్దార్ తన పాదంతో గీకుతున్న సద్దు మరేదో ప్రపంచంలోనుంచి వచ్చే శబ్దంలాగ లేతగా అతని చెవులకి వినబడుతోంది.

నిద్రమాత్రల సీసా ఖాళీ ఐపోయింది!

********



"సమాజంని గౌరవించి దాని విలువలకి లోబడడం లేక సమాజంని తోసి పారేయడం అనే రెండు అంశాలకీ, వాటి ధోరణికీ ఈ రెండు కథలు ఉదాహరణంగా చెప్పవచ్చు.

సామాజిక విలువలు, నీతులు, వదిలేసిన మగవాడికి (నేను ఇక్కడ మగవాళ్ళ గురించే మాటాడుతున్నాను; మన సమాజంలో మగువలకి వాటా లేదు!) ఇల్లాలు Better Half గా కనిపించదు; కుటుంబం ఒక చెఱసాల ఐపోతుంది.

చెఱసాల తలుపులు నిత్యమూ మూసుకునే ఉంటాయి; వాటిని బహిరంగపరచాలి. లేకపోతే చెఱసాల ధ్వంసమైపోతుంది.

సామాజిక విలువలకీ, కుటుంబ నిలువలకీ మధ్య నెగ్గే భేదాలు చాలా హానికరమైనవి.

జయకాంతన్ **ముందు మాట లో**